వెనుకబాటే!

స్థూల ఉత్పత్తిలో 15, తలసరి ఆదాయంలో 18వ స్థానం

- వచ్చే ఏడాది అంచనాలను కలెక్టర్ల సదస్సులో జిల్లాల వారీ ప్రకటించిన ప్రభుత్వం
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో తగ్గుతున్న జిల్లా వాటా
- తలసరి ఆదాయంలోనూ చివరనే!
- నివేదికలతో హాజరైన కలెక్టర్ అన్సారియా
- నేడు పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- శాంతిభద్రతలపై సమీక్షలో పాల్గొన్న ఎస్పీ



అమరావతిలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్

స్థూల ఉత్పత్తితోపాటు తలసరి ఆదాయంలోనూ రాష్ట్రంలోని అనేక జిల్లాల కన్నా మన జిల్లా వెనుకబడి ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) రాష్ట్రంలో స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయాల అంచనాలను ప్రభుత్వం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో తొలిరోజైన మంగళవారం ప్రకటించింది. రాష్ట్రం మొత్తం 2025-26 స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంతోపాటు జిల్లాల వారీగా అంచనాలను వెల్లడించింది. ఇందులో జిల్లా అన్ని విషయాలలోనూ చివరి స్థానాలలో ఉంది.

ఒంగోలు మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం విషయంలో జిల్లా బాగా వెనుకబడింది. మిగతా జిల్లాలతో పోలిస్తే చివరి స్థానాలలో ఉంది. విజన్-2047 లక్ష్యంగా తొలి ఐదేళ్ల (2024-29) ప్రణాళికలను ఏటా 15శాతం వృద్ధితో ప్రస్తుత ప్రభుత్వం వార్షిక సంవత్సరాల వారీగా రూపొందించిన విషయం విదితమే. ఆయా జిల్లాల్లో స్థానిక వనరుల వినియోగం, ప్రభుత్వ పథకాల సద్వినియోగంతో కీలక రంగాలలో వృద్ధికి తీసుకునే చర్యలపై దృష్టి పెట్టింది. అలాగే మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి అంశాల వారీగా ప్రజల జీవన ప్రమాణాల పెంపు ద్వారా పేదరిక నిర్మూలన లక్ష్యంతో ప్రణాళికలను రూపొందించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం మరో వారం రోజుల్లో ప్రారంభంకానున్న తరుణంలో మంగళ, బుధవారాల్లో కలెక్టర్ల సదస్సు ఏర్పాటు చేసింది. తొలిరోజు వచ్చే ఏడాది ఆయా రంగాల వారీ లక్ష్యాలను ప్రకటించి వాటిని సాధించేందుకు యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేశారు. తొలుత రాష్ట్ర, జిల్లాల వారీ స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం అంచనాలు.. అందులో కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక, సర్వీసు రంగాల ద్వారా రాబడి వివరాలను సీఎం ప్రకటించారు. అందులో ప్రస్తుత

మిగతా 6వ పేజీలో

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. స్థానిక సంస్థలు ఒక్కొక్కటిగా వైసీపీ నుంచి చేజారి టీడీపీ ఖాతాలో చేరుతున్నాయి. గురువారం జరగనున్న ఒక ఎంపీపీ, మరో వైస్ ఎంపీపీ, ఒక మండల కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక వ్యవహారం ఇరు పార్టీల మధ్య ప్రతిష్ఠాత్మకంగా మారింది. రెండు కీలకమైన పదవులు టీడీపీకి దక్కనున్నాయి. వైసీపీ నేతలు అధినేత జగన్ వద్దకు వెళ్లి పార్టీలోని విభేదాలను వివరించటంతోపాటు టీడీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని ఫిర్యాదు చేశారు. కాగా కిందిస్థాయిలో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు చతురతతో చక్రం తిప్పుతున్నారు. దీంతో గురువారం నాటి ఉపఎన్నికల ఫలితాలపై యావత్తు జిల్లా రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి.



పరిషత్ ఫైట్

ఎర్రగొండపాలెంలో రాజకీయం రసవత్తరం

- వైసీపీలో గ్రూపుల గలాటా
- అనుకూలంగా మార్చుకున్న అధికార పార్టీ
- త్రిపురాంతకం ఎంపీపీ, పుల్లలచెరువు వైస్ ఎంపీపీ టీడీపీ ఖాతాలో చేరే అవకాశం
- జగన్ వద్దకు వైసీపీ పంచాయితీ
- చక్రంతిప్పుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా వైసీపీకి చెందిన చంద్రశేఖర్ ఉండగా టీడీపీ ఇన్‌చార్జిగా ఎరిక్షన్‌బాబు రాజకీయం చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్‌ను కొండపి నియోజకవర్గానికి జగన్ బదిలీ చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి వైసీపీలో గ్రూపు విభేదాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకులు వాటిని అనుకూలంగా మార్చుకునే ప్రక్రియకు శ్రీకారం పలికారు. దీటైన రాజకీయ వ్యవహారాలు నిర్వహిస్తున్న ఎరిక్షన్‌బాబు కొంతకాలంగా స్థానిక సంస్థల్లో వైసీపీ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టే ప్రయత్నాలకు శ్రీకారం పలికారు. అందులో భాగంగా త్రిపురాంతకం, పుల్లలచెరువు మండల పరిషత్‌లపై దృష్టిసారించి కొంతమేర విజయం సాధించారు. త్రిపురాంతకం ఇన్‌చార్జి ఎంపీపీని, పుల్లలచెరువు వైస్ ఎంపీపీని టీడీపీలో చేర్చుకున్నారు. కీలకమైన దోర్నాల సర్పంచ్‌ను, మరో ఇద్దరు వైసీపీ నాయకులను ఆయన సైకిలెక్కించారు. ఈనేపథ్యంలో మండల పరిషత్‌లకు ఉప ఎన్నికలు రావడంతో రాజకీయం వేడెక్కింది.

రెండు మండలాల్లో పాగా దిశగా టీడీపీ

ప్రస్తుతం త్రిపురాంతకం ఎంపీపీ, పుల్లలచెరువు వైస్ ఎంపీపీ, ఎర్రగొండ పాలెం మండల పరిషత్‌లో కోఆప్షన్ సభ్యుడి పదవులకు ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికలు రావడానికి గతంలో మంత్రి సురేష్ అవలంబించిన రాజీ సూత్రమే ప్రధాన కారణమైంది. త్రిపురాంతకం మండల పరిషత్‌లో 18 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను వైసీపీ నుంచి 17 మంది ఎన్నికయ్యారు. ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. అప్పట్లో ఎంపీపీ పదవి కోసం కోట్ల సుబ్బారెడ్డి, ఆపార్టీ నాయకుడు ఆంజనేయరెడ్డి భార్య ఆళ్ల సుబ్బమ్మలు పోటీపడ్డారు. అప్పటి మంత్రి సురేష్ ఇద్దరి మధ్య రాజీగా తొలి రెండున్నర సంవత్సరాలు సుబ్బారెడ్డి, ఆతర్వాత మరో రెండున్నరేళ్లు ఆళ్ల సుబ్బమ్మలు ఎంపీపీలుగా ఉండేలా రాజీసూత్రాన్ని అమలు చేశారు. ఆ ఒప్పందం ప్రకారం సుబ్బారెడ్డి రాజీనామా చేసే సమయానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆయన స్థానంలో వైస్ ఎంపీపీగా ఉన్న సుబ్బమ్మను ఎంపీపీగా చేయాలని వైసీపీ భావించగా.. టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు చక్రం తిప్పారు. రెండో వైస్ ఎంపీపీగా ఉన్న గొట్టిముక్కల రెబ్కాను ఇన్‌చార్జి ఎంపీపీగా అధికారులు నియమించారు. ఈ నియామకం చెల్లదని ఆంజనేయరెడ్డి బృందం హైకోర్టుకు వెళ్లగా వైస్ ఎంపీపీలుగా ఉన్న ఇద్దరికీ సమాన అధికారం ఉంటుందని తేల్చి వారి పిటిషన్ కొట్టివేసింది. ఆ తర్వాత ఇన్‌చార్జి ఎంపీపీ రెబ్కా టీడీపీలో చేరిపోయారు. అయినప్పటికీ ఎంపీటీసీ సభ్యుల్లో 16 మంది వైసీపీ పక్షాన, ఒకరు టీడీపీ, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారు.

రెబల్ ఎంపీటీసీ సభ్యులతో అవగాహన

ప్రస్తుతం ఎంపీపీ ఎన్నికలు రావడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. వైసీపీలో రెబల్ ఎంపీటీసీ సభ్యులను ఎరిక్షన్‌బాబు మచ్చిక చేసుకున్నారు. ఆ వర్గానికి ఎంపీపీ పదవి ఇచ్చేందుకు సహకారం

మిగతా 6వ పేజీలో



ఇంటి పన్ను బకాయిలపై
ప్రత్యేక దృష్టి

జిల్లావ్యాప్తంగా రూ.20కోట్ల పెండింగ్

వసూలుకు అధికారుల స్పెషల్ డ్రైవ్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీగా పేరుకుపోయిన ఇంటి పన్ను బకాయిల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డివిజనల్ పంచాయతీ అధికారులు ఈ ప్రక్రియను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఈ నెలాఖరుకు వందశాతం వసూలు లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇంటి పన్ను విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భారీగా బకాయిలు ఉండిపోయాయి. వీటి వసూలు ఇప్పుడు పంచాయతీ కార్యదర్శులకు కత్తిమీద సాములా మారింది.

లక్ష్యం రూ.58.58 కోట్లు.. వసూలు రూ.38 కోట్లు!

జిల్లాలోని 38 మండలాల్లో ఉన్న మొత్తం 719 గ్రామ పంచాయతీల్లో రూ.58.58 కోట్ల మేర పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు సుమారు రూ.38 కోట్లు మాత్రమే రాబట్టారు. ఇంకా రూ.20 కోట్లకుపైగా పెండింగ్‌లో ఉంది. పన్ను వసూలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు పంచాయతీరాజ్ కమిషనర్ జిల్లా అధికారులతో టెలీ, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి ఈనెలాఖరులోపు నూరుశాతం రాబట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఆమేరకు జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకటనాయుడు అవసరమైన చర్యలు చేపట్టారు. ఏరోజుకారోజు మండలాల వారీగా పన్నుల వసూళ్లను సమీక్షిస్తూ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. పన్నుల వసూలు బాధ్యతను కేవలం పంచాయతీ కార్యదర్శులకు వదిలి వేయకుండా మండల స్థాయిలో ఉండే ఈవోఆర్‌డీలు, డివిజనల్ పంచాయతీ అధికారులకు కూడా దిశానిర్దేశం చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసే ఈనెలాఖరు లోపు పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు.


ప్రజలకు అవగాహన

జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీలు ఇంటి పన్ను వసూళ్లలో పూర్తిగా వెనుకబడి ఉన్నాయి. అక్కడ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పన్నుల ద్వారా వచ్చే నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆవిషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులతోపాటు ఇతర సిబ్బంది కూడా నిత్యం ఇంటి పన్ను వసూళ్ల కోసం తిరుగుతున్నా కొన్ని పంచాయతీలో ప్రజానీకం ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది.

ఖాళీగా ఉన్న 'స్థానిక' పదవులకు
రేపు ఎన్నికలు

- రెండు ఎంపీపీలు, ఒక ఉపాధ్యక్ష, ఒక కోఆప్షన్ సభ్యుని పదవికి నిర్వహణ
- నాలుగు ఉపసర్పంచ్‌లకు కూడా..

6



పంచాయతీ నిధుల భోక్తలపై చర్యలు నిల్!

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా డ్రా
- విచారణ పేరుతో జాప్యం చేస్తున్న అధికారులు

దర్శి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు కరువయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు పంచాయతీల్లోని నిధులను అడ్డగోలుగా దోచుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఇష్టానుసారంగా వ్యవహరించారు. కొన్ని పంచాయతీల్లో ఎలాంటి పనులు చేయకుండా లక్షలాది రూపాయలు డ్రా చేశారు. ఇంజనీరింగ్ అధికారులు కిక్కురుమనకుండా బిల్లులు చేశారు. నిధులు గోల్‌మాల్ విషయాలు బయటకురావడంతో కొన్ని గ్రామాల్లో స్థానిక నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. వారు నిజాలు నిగ్గు తేల్చేందుకు విచారణ చేయించారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

పలు పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం

మండలంలోని తూర్పువెంకటాపురం పంచాయతీలో రూ.25లక్షల నిధులు గోల్‌మాల్ అయ్యాయని ఆ గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పలుమార్లు ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో కనిగిరి డీఎల్‌పీవోను విచారణాధికారిగా నియమించారు. సుమారు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ విచారణ పూర్తి చేయలేదు. జముకులదిన్నె, సామంతపూడి, కొత్తపల్లి, తదితర పంచాయతీల్లో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి అధికార పార్టీ నాయకులు ఒక పంచాయతీ కార్యదర్శిని పలుచోట్ల ఇన్‌చార్జ్‌గా నియమించి అడ్డగోలుగా నిధులు డ్రా చేసుకున్నారు. జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు చేపల చెరువుల నగదును కూడా మార్చుకున్నారు. కొన్నిచోట్ల మొక్కుబడిగా పనులు చేశారు. కొన్ని నిధులకు పనులు చేసిన దాఖలాలు లేవు. అనంతరం ఎన్నికలు రావడంతో నిధుల దుర్వినియోగం విషయం మరుగునపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో ఫిర్యాదు చేసిన నాయకులు మళ్లీ ఉన్నతాధికారులను కలిసి నిధుల దుర్వినియోగంపై విచారణ ముందుకు సాగని విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తున్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో ఎలాంటి పనులు చేయకుండా అడ్డగోలుగా నిధులు డ్రా చేసినప్పటికీ

మిగతా 6వ పేజీలో

ఈకేవైసీ తప్పనిసరి!

- త్వరలో రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం



ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వం త్వరలో అవకాశం కల్పించనుంది. అందుకోసం ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులకు ఈకేవైసీని చేపట్టింది. దీనివలన రేషన్‌లో అక్రమాలకు కూడా అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. సాధారణంగా కార్డు కలిగిన కుటుంబంలో ఒకరు వేలిముద్ర వేసి ప్రతినెలా రేషన్ తీసుకుంటున్నారు. మిగిలిన సభ్యుల్లో కొందరు చదువులు, ఉద్యోగాలు, ఇతర పనుల నిమిత్తం వేరే ప్రాంతాల్లో ఉంటుండటంతో అటువంటి వారి వేలిముద్రలు అప్‌డేట్ కాలేదు. దీంతో ప్రస్తుతం తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబంలోని అలాంటి సభ్యులందరిచేత తప్పనిసరిగా ఈకేవైసీ చేయించే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 6.61 లక్షల రేషన్‌కార్డులు ఉండగా వాటిలో 19.37 లక్షల మంది సభ్యులు ఉన్నారు. అందులో ఇప్పటివరకు 17.31లక్షల మంది ఈకేవైసీ చేయించుకోగా మరో రెండు లక్షల మంది చేయించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రేషన్ కార్డుదారులు ఉన్న పరిధిలోని డీలర్ల ద్వారా ఈకేవైసీ ప్రక్రియను చేపట్టారు. అయితే నెలల తరబడి ఈ పోస్‌లో వేలి ముద్రలు వేయని వారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్తున్నారు. దీనిపై అవగాహన లేకుండా కార్డుదారులంతా డీలర్ల వద్దకు ఒకేసారి వస్తుండటంతో ప్రక్రియలో జాప్యం జరుగుతోంది.



పండిళ్లపల్లిలో చెట్టుకు కాచిన మామిడిపండ్లు

బంగినపల్లి కేరాఫ్ పండిళ్లపల్లి

- మామిడి రుచులకు ఫేమస్
- దాదాపు 300 ఎకరాల్లో సాగు
- పలు ప్రాంతాలకు ఎగుమతి

7



బంపర్ ఆఫర్

- మునిసిపాలిటీల్లో ఇంటి యజమానులకు శుభవార్త
- ఆస్తిపన్ను చెల్లింపునకు 50 శాతం వడ్డీ రాయితీ
- ఈనెల 31లోపు చెల్లింపులకే వర్తింపు
- ఆ తర్వాత వడ్డీపై వడ్డీ
- జిల్లాలో సుమారు రూ.10 కోట్ల మేర లబ్ధి

6

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.27 (బుధవారం సాయంత్రం)

సహర్ : 4.49 (గురువారం ఉదయం)



బంపర్ ఆఫర్..!

- ఇంటి యజమానులకు శుభవార్త
- మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను చెల్లింపునకు 50 శాతం వడ్డీ రాయితీ
- ఈ నెల 31లోపు చెల్లింపులకే అవకాశం..
- ఆ తర్వాత వడ్డీపై వడ్డీ
- జిల్లాలో సుమారు రూ.10 కోట్ల మేర లబ్ధి

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను చెల్లింపుపై టీడీపీ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈనెల 31వ తేదీలోపు పన్ను చెల్లించనున్న సొంతింటి యజమానులకు పురపాలక శాఖ శుభవార్త తెలిపింది. పట్టణాల్లో ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తూ జీవో ఎంఎస్.46 ఎంఏ అండ్ యూడీ 25-03-2025ను మంగళవారం విడుదల చేసింది. ఇప్పటి వరకు దీర్ఘకాలికంగా పన్నులు చెల్లించకపోవడంతో వడ్డీల భారంతో కొందరు పన్నులు చెల్లింపుకు ఆసక్తి చూపక పోవడంతో అవన్నీ కొండలా పేరుకుపోయాయి. ఈ క్రమంలో నూరు శాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా, ఆదాయ వనరులు పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం వడ్డీపై 50 శాతం రాయితీ ఇవ్వనుండటంతో జిల్లాలో సుమారు రూ.10 కోట్లు వరకు రాయితీతో గృహ యజమానులకు లబ్ధిచేకూరనుంది.

జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్ తోపాటు, మిగిలిన మునిసిపాలిటీలు, నగర పంచాయతీలతో కలుపుకుని మొత్తం 1,28,213 అస్సెస్‌మెంట్‌లు ఉండగా, వాటికి సంబంధించి మొత్తం రూ. 77.41 కోట్లు పన్నుల రూపంలో ఆయా మునిసిపాలిటీలకు రావాల్సి ఉంది. వాటికి అదనంగా ఇప్పటి వరకు 2 శాతం వడ్డీ జమ అవుతుంది. 50 శాతం రాయితీతో జిల్లా మొత్తంలో సుమారు రూ.10 కోట్లు మేర వడ్డీ రాయితీ లబ్ధిస్తుండటంతో గృహ యజమానులకు కొంత ఊరట కానుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. చాలా కాలంగా పెండింగ్ ఉన్న బకాయిలను చెల్లించేందుకు ఇది మంచి అవకాశం అని, గృహ యజమానులు, వ్యాపారులు, ఇండస్ట్రీ యజమానులు చెబుతున్నారు. పురపాలక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, వీలైనంత త్వరగా ప్రజలు వినియోగించుకునేలా, నూరు శాతం వసూలు లక్ష్యంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ముందే చెల్లించిన వారికీ ఆఫర్

ఆస్తి పన్నులు చెల్లింపుపై మంగళవారం ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో ఇంతకుముందే చెల్లించిన వారిలో కొంత నిరాశ చోటు చేసుకునే అవకాశం ఉండటంతో ప్రభుత్వం వారికి మరో ఆఫర్ ప్రకటించింది. జీవో విడుదలకు ముందే ఒకేసారి ఆస్తి పన్ను, వడ్డీ చెల్లించిన వారికి 50 శాతం రాయితీ ప్రకటించింది. ఆ రాయితీని 2025-26 ఆర్థిక సంవత్సరం పన్నులో వడ్డీ సర్దుబాటు చేసి చెల్లించుకోవచ్చని ప్రకటించింది. దీంతో గతంలో పన్నులు చెల్లించిన వారికి, ఈనెల 31లోపు చెల్లించేవారికి ఇది మంచి అవకాశం కానుంది.

ఏ మున్సిపాలిటీలో ఎంతెంత...

ఒంగోలులో 63,702 అస్సెస్‌మెంట్‌లు ఉండగా, 49.08 కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే రూ.10 కోట్లు వడ్డీ రావాల్సి ఉండగా, ప్రభుత్వం ప్రకటించిన రాయితీ జీవోతో రూ.5 కోట్లు వడ్డీ తగ్గనుంది. మార్కాపురంలో 17,054 అస్సెస్‌మెంట్‌లు ఉండగా, రూ.8.56 కోట్లు, దర్శి మునిసిపాలిటీలో 9,437 అస్సెస్‌మెంట్‌లు ఉండగా, రూ.5.05 కోట్లు, గిద్దలూరు మునిసిపాలిటీలో 11,554 అస్సెస్‌మెంట్‌లు ఉండగా, రూ.4.03 కోట్లు, కనిగిరి మునిసిపాలిటీలో 9,411 అస్సెస్‌మెంట్‌లు ఉండగా, రూ.4.20 కోట్లు, చీమకుర్తిలో 6,659 అస్సెస్‌మెంట్‌లు ఉండగా, రూ.3.34 కోట్లు, పొదిలి నగర పంచాయతీలో 10,806 అస్సెస్‌మెంట్‌లు ఉండగా, రూ.3.16 కోట్లు ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది

పన్నులు చెల్లింపులు ఇలా...

వడ్డీ మినహాయింపుతో ఈనెల 31వ తేదీ లోపు పన్నులు చెల్లింపుకు సమీపంలోని సచివాలయంలో గాని, కార్పొరేషన్, మునిసిపాలిటీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో, ఆన్‌లైన్‌లోని సీడీఎంఏ.ఏపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ నందు డెబిట్ కార్డు/క్రెడిట్ కార్డు/నెట్ బ్యాంకింగ్/యూపీఐ ద్వారా చెల్లించవచ్చని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ మొబైల్ నెంబర్ 9552300009 ద్వారా చెల్లించవచ్చని నగర కమిషనరు కే వెంకటేశ్వరరావు తెలిపారు.

ఏప్రిల్ 1 దాటితే వడ్డీపై వడ్డీ..

ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉంటుందని, ఇప్పటి వరకు చెల్లించకుండా, గడువులోపు కూడా చెల్లించని వారికి ఏప్రిల్ 1వ తేదీ నుంచి వడ్డీపై వడ్డీ వసూలు చేస్తామని, ఒంగోలు నగర కమిషనరు కే వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ వారంలో రోజుల్లో పూర్తి పన్నులు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా నూరు శాతం పన్నులు వసూలు కావడంతోపాటు, కార్పొరేషన్, మునిసిపాలిటీల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఏప్రిల్ 1 నుంచి సదరమ్ స్లాట్ పునఃప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి సదరమ్ స్లాట్ పునఃప్రారంభం కానుంది. ఇన్ని రోజులు దివ్యాంగుల పెన్షనర్ల వెరిఫికేషన్ కారణంగా జనవరిలో విడుదల కావాల్సిన సదరమ్ స్లాట్‌లు నిలిపివేయగా, దివ్యాంగ సంఘాలు విజ్ఞప్తుల మేరకు అర్హులైనవారికి సర్టిఫికేట్‌లు అందజేసేందుకు తిరిగి ప్రారంభించేందుకు రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయం తీసుకున్నట్లు ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ఏరియా, జిల్లా, టీచింగ్ ఆసుపత్రులు, జీజీహెచ్‌లలో ప్రతి మంగళవారం సేవలు అమలులోకి వస్తాయని, జిల్లాలో అర్హులైన దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు, రేపు విద్యార్థులకు తరల్ ఎండ్‌లైన్ పరీక్షలు

ఒంగోలు విద్య, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి తరల్ ఎండ్‌లైన్ పరీక్షలను బుధ, గురువారాల్లో నిర్వహించాలని డీఈవో కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, గణితం సబ్జెక్టుల్లో ఈ పరీక్ష నిర్వహించాలన్నారు. ఇందుకోసం అవసరమైన ప్రశ్నపత్రాలను ఇప్పటికే పాఠశాలలకు పంపించినట్లు పేర్కొన్నారు. ఎంఈవోలు, హైస్కూలు హెచ్‌ఎంలు, 3,4,5 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు తగు సూచనలు ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతి విద్యార్థికి బేస్‌లైన్, మిడ్‌లైన్ పరీక్షల్లో వాడని నాలుగు శాంపిళ్లలో ఒక శాంపిల్‌ను మాత్రమే ఎండ్‌లైన్‌లో ఇవ్వాలని డీఈవో సూచించారు.

విధులకు డుమ్మా కొట్టిన సెక్రటరీలపై చర్యలు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు సచివాలయాలలో ఎమినిటీ సెక్రటరీలుగా పనిచేస్తూ ఏడాది కాలంగా విధులకు గైర్హాజరైన సెక్రటరీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. స్థానిక ఇస్లాంపేట, రాజీవ్‌నగర్, గద్దలగుంట-2, భాగ్యనగర్, రామనగర్, గోపాల్ నగర్, నిర్మల్‌నగర్ సచివాలయాలలో ఎమినిటీ సెక్రటరీలుగా పనిచేస్తున్న సుభాష్ రెడ్డి, కృష్ణచైతన్య, ప్రవీణ్‌కుమార్, మస్తాన్ రెడ్డి, రాజేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శివకృష్ణలు ఎలాంటి సెలవు అనుమతులు లేకుండా ఏడాదికాలంపాటు విధులకు గైర్హాజరయ్యారన్నారు. వారిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే ఆయా సచివాలయాల్లో సెక్రటరీలుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

పంచాయతీ నిధుల భోక్తలపై చర్యలు నిల్

(5వ పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ అధికారులు పనులు జరిగినట్లు బిల్లులు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే అందుకు కారణమైంది. పంచాయతీల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీగా ఉన్న 'స్థానిక' పదవులకు ఎన్నికలు రేపు

రెండు ఎంపీపీలు, ఒక ఉపాధ్యక్ష, ఒక కోఆప్షన్‌సభ్యుని పదవికి నిర్వహణ

నాలుగు ఉపసర్పంచ్ పదవులకు కూడా..

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆకస్మికంగా ఖాళీలు ఏర్పడిన మండల పరిషత్ అధ్యక్ష స్థానాలకు గురువారం పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకు అవసరమైన చర్యలను అధికారులు తీసుకున్నారు. మార్కాపురం, త్రిపురాంతకం మండలాల అధ్యక్ష పదవులతో పుల్లలచెరువు మండలంలో ఉపాధ్యక్ష, ఎర్రగొండపాలెం మండలంలో కోఆప్షన్ సభ్యుడి పదవికి ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఆయా మండలాలకు జిల్లా స్థాయి అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించారు.

నాలుగు ఉపసర్పంచ్ పదవులకు కూడా..

జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు ఉప సర్పంచ్ పదవులకు కూడా ఈనెల 27న పరోక్ష పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ముందుగా జిల్లాలో ఎనిమిది ఉప సర్పంచ్ పదవులు ఖాళీగా ఉండటంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. అయితే నాలుగు పంచాయతీల్లో వార్డు సభ్యుల పదవులు ఖాళీగా ఉండటంతో అక్కడ ఎన్నికలను ఈసీ నిలిపివేసింది. కొండపి మండలం పెరిదేపి, కంభం మండలం తురిమెళ్ల, టంగుటూరు మండలం ఆలకూరపాడు, త్రిపురాంతకం మండలం మిట్టపాలెంలో ఉపసర్పంచ్ పదవికి ఎన్నికలు నిర్వహించనున్నారు. వార్డు సభ్యుల పదవి ఖాళీగా ఉన్న నాగన్నపాలెం, నాగంపల్లి, బేస్తవారపేట, టంగుటూరు పంచాయతీల ఉప సర్పంచ్ ఎన్నికలను నిలుపుదల చేశారు.

ఉపాధి పథకం పంచ ప్రాధాన్యత పనులపై దృష్టి సారించాలి

- **పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశం**

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా పంచ ప్రాధాన్యత పనులపై దృష్టి సారించాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. మంగళవారం జిల్లా డ్వామా అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పశువుల నీటి తొట్టెలు, ఫారంపాండ్ల నిర్మాణాలు, పంట కాలువలు, పూడిక తీత పనులు, సాగునీటి చెరువుల పూడిక తీత పనులతో పాటు కనీస వేతనం రోజుకు రూ.290నుంచి రూ.300 వరకు తగ్గకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పథకం ద్వారా ప్రకాశం జిల్లాకు 1475 పశువుల నీటి తొట్టెలు లక్ష్యం కాగా ప్రతి గ్రామంలో పశుసంవర్థకశాఖ అధికారులను సమన్వయం చేసుకొని ఈ పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాకు 9,500 నీటి కుంటలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం 43 నీటి కుంటలు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు 15నుంచి 20శాతం పనులను పని కోరే కూలీలకు కేటాయించాలని ఆదేశించారు. ప్రతి మూడేళ్ళకు ఒకసారి ఫీల్డ్ చానల్/ఫీడర్ చానల్‌ల్లో అవసరాన్ని బట్టి పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లోని చెరువులలో పూడిక తీత ద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడమే కాకుండా గ్రామ ప్రజలకు, పశువులకు తాగునీటి సౌకర్యంతో పాటు రైతులకు వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అందువల్ల ఆయా పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగ కృషి ఫలితమే రాష్ట్రంలో వర్గీకరణ వేగవంతం

- **ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు**

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలకు పైగా మాదిగల స్వప్నం త్వరలోనే నెరవేరబోతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి ప్రకాశం జిల్లా నాయకుల సాధారణ సమావేశం మంగళవారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో నగర అధ్యక్షులు జి.ప్రభుదాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం, మాదిగ జాతి అభ్యున్నతి కోసం మూడు దశాబ్దాలకు పైగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సుదీర్ఘపోరాటం చేశారన్నారు. అందుకోసం రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు వేగవతం చేయడంతో పాటు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం శుభ పరిణామం అన్నారు. ఈ క్రమంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మాదిగలకు వర్గీకరణ ఫలాలు అందబోతున్నాయని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి నరేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్, ఉపాధ్యక్షుడు ఆదిమూలపు ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు, మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బొంత దాసు, ఎంపీఎఫ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు కత్తి ఐజక్, దుడ్డు వందనం, నియోజకవర్గ కన్వీనర్ తిరువీధి బాబు తదితరులు పాల్గొన్నారు.

లారీలను ఆపి.. ఆర్డీవో పేరుతో డబ్బు వసూలు

ఇద్దరికి ఏడాది జైలు, రూ.10వేల జరిమానా

అద్దంకి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలం కిందట నామ్ రోడ్డులో లారీలను ఆపి.. ఆర్డీవోనని చెప్పి, భయపెట్టి డబ్బులు వసూలు చేసిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ అద్దంకి కోర్టులో మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత తీర్పు చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరుకు చెందిన లారీ డ్రైవర్ గోవిందస్వామి సురేష్ 2015 జనవరి 18వ తేదీన మధ్య ప్రదేశ్ నుంచి చెన్నైకి లారీలో మార్బుల్ లోడుతో వెళ్తున్నారు. నామ్ రోడ్డులో అద్దంకి మండలం చక్రాయపాలెం వద్దకు వచ్చే సరికి ఆర్డీవోనని చెప్పి ఇద్దరు హైదరాబాద్‌లో ఇన్‌కంటాక్స్ కన్స్‌ల్టెన్సీ ఆఫీస్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన అజిత్ కుమార్ సింగ్ (అజయ్), నల్గొండ జిల్లా నకిరికల్లు మండలం కేతపల్లికి చెందిన దేశగాని కరుణాకర్ లారీని ఆపారు. క్లీనర్‌ని కొట్టి రూ.25వేల నగదు తీసుకువెళ్లారు. అప్పటి ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. సీఐ బేతపూడి ప్రసాద్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసు విచారణ చేసి మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత.. ఇద్దరికి ఏడాది జైలు, రూ.10వేల ఫైన్ విధించారు. నిందితులకు శిక్షపడేలా సీఐ సుబ్బరాజు, కోర్టు కానిస్టేబుల్ రమణ కృషి చేశారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

మార్టూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన కుందేటి నాగేశ్వరరావు వేధిస్తున్నారని భార్య లక్ష్మి ఫిర్యాదు చేయగా మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాల కారణంగా గత నాలుగురోజుల కిందట లక్ష్మి తన స్వగ్రామమైన తాటివారిపాలెం గ్రామంలోని పుట్టింటికి వెళ్లారు. అయితే సోమవారం రాత్రి తాటివారిపాలెం వెళ్లిన నాగేశ్వరరావు భార్యపై కర్రతో గాయపరచాడు.దాంతో ఆమెను కుటుంబసభ్యులు వైద్యం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లక్ష్మి ఆస్పత్రి నుంచి ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు బాషా తెలిపారు.

వెనుకబాటే!

(5వ పేజీ తరువాయి)

ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.15.93ల క్షల కోట్లు కాగా వచ్చే ఏడాది (2025-26)కి రూ.18.65 లక్షల కోట్లుగా అంచనా వేశారు. అలా రూ.3.72 లక్షల కోట్లు ప్రస్తుత ఏడాది కన్నా వచ్చే ఏడాది స్థూల ఉత్పత్తి పెరగనున్నట్లు అంచనా. అలాగే రాష్ట్రంలో ప్రస్తుత ఏడాది తలసరి ఆదాయం రూ.2.66 లక్షల కోట్లు కాగా వచ్చే ఏడాదికి మరో 16.81శాతం వృద్ధితో రూ.3.11 లక్షల కోట్లుగా అంచనా వేశారు. అదేసమయంలో జిల్లాల వారీ వివరాలను ప్రకటించారు. అందులో మన జిల్లా ప్రస్తుత ఏడాది స్థూల ఉత్పత్తి రూ.56,271 కోట్లు కాగా వచ్చే ఏడాది అది రూ.65,543 కోట్లుగా ఉంది. అలా ప్రస్తుతం ఏడాది కన్నా వచ్చే ఏడాది స్థూల ఉత్పత్తి దాదాపు రూ.9వేల కోట్లకుపైగా అధికంగా కనిపిస్తున్నా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వృద్ధి కన్నా వెనుకబడి ఉంది.

మరో మూడు స్థానాలు దిగువే..

రాష్ట్రంలో ప్రస్తుత ఏడాది జిల్లా స్థూల ఉత్పత్తి వాటా 15వ స్థానంలో 3.53శాతంతో ఉండగా వచ్చే ఏడాది కూడా 15వ స్థానంలోనే ఉండనున్నప్పటికీ రాష్ట్రంలో జిల్లాల వాటా 3.51శాతానికి తగ్గిపోనున్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. అంటే ఇతర జిల్లాల్లో పెరుగుతున్నంత వేగంగా జిల్లాలో వృద్ధి కనిపించడం లేదు. ఇక తలసరి ఆదాయాన్ని చూస్తే ప్రస్తుత ఏడాది జిల్లాలో రూ.2,03,770 కాగా వచ్చే ఏడాది రూ.2,36,741గా అంచనా వేశారు. అలా దాదాపు రూ.33వేల మేర పెరుగుదల ఉన్నప్పటికీ రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తలసరి ఆదాయం పెరిగే వేగం ఇక్కడ కనిపించడం లేదు. రాష్ట్రంలో ప్రస్తుత ఏడాది తలసరి ఆదాయంలో జిల్లా 15వ స్థానంలో ఉంది. వచ్చేఏడాది మరో మూడు తగ్గి 18వ స్థానానికి పడిపోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం తెలుస్తోంది.

మంత్రి స్వామి హాజరు

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వచ్చే ఏడాది కీలక రంగాలైన వ్యవసాయ, అనుబంధ రంగాల వాటా 35.19శాతం, పారిశ్రామిక రంగం వాటా 23.32శాతం, సేవారంగాల వాటా 41.49శాతం ఉండనున్నట్లు అంచనా వేస్తున్నారు. అదే జిల్లాలో పరిశీలిస్తే వచ్చే ఏడాది స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 40.79శాతం, పారిశ్రామిక రంగం వాటా 18.07శాతం, సేవా రంగాల వాటా 41.14శాతంగా అంచనా వేశారు. ఇదిలా ఉండగా కలెక్టర్ల సదస్సుకు ప్రభుత్వం తరఫున జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఆయా రంగాల వారీ కీలక అంశాలాపై నివేదికలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరయ్యారు. సదస్సులో రెండో రోజైన బుధవారం ఆయా అంశాలపై కలెక్టర్ అన్సారియా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం లా అండ్ ఆర్డర్‌పై నిర్వహించిన సమీక్షకు ఎస్పీ దామోదర్ హాజరయ్యారు.

అవీఇవీ

కాటంరాజు తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న వెంకటరాజుయాదవ్

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేనూతల కాటంరాజు గంగాభవాని తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆలయ కమిటీ అధ్యక్షులు పి.వెంకటరాజుయాదవ్ పేర్కొన్నారు. స్థానిక బీసీభవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాటంరాజు తిరునాళ్ల సందర్భంగా 30 వేల మంది పైచిలుకు భక్తుల కోసం అన్నదాన ఏర్పాట్లు చేసినట్లు కమిటీ ముఖ్య బాధ్యులు పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ తెలిపారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రెవెన్యూ, పోలీసు వివిధ శాఖల సహకారం అడిగినట్లు చెప్పారు. సభ్యులు ఏ.శ్రీనివాస్‌యాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నిక సజావుగా నిర్వహించాలి

జడ్పీ సీఈవో చిరంజీవి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో చిరంజీవి

మార్కాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎంపీపీ ఎన్నిక ఈ నెల 27వ తేదీన సజావుగా నిర్వహించాలని జడ్పీ సీఈవో చిరంజీవి ఎన్నికల అధికారులను కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం మార్కాపురం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన విషయాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలనుసారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలీసుల సహకారంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల రిటర్నింగ్ అధికారులు మార్కాపురం డీఎల్‌డీవో కొల్లి శ్రీనివాస రెడ్డి, త్రిపురాంతకం డ్వామా వాటర్‌షెడ్ ఏపీడీ బీజే వందర్‌మాన్, పుల్లలచెరువు జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కేవీఎన్ ఉపేంద్ర కుమార్, యర్రగొండపాలెం మార్కాపురం మైన్స్ ఏడీ విష్ణువర్ధన్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

చేజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈ కిశోర్‌బాబు

ఒంగోలు(రూరల్), మార్చి25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం చేజర్ల గ్రామంలో మంగళవారం కరవది సొసైటీ ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో జి.కిషోర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా వరి ధాన్యం రూ.2,300గా ప్రభుత్వం మద్దతు ధరగా ప్రకటించిందని, ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల తరువాత రైతుల బ్యాంక్ ఖాతాలలో నగదు జమ అవుతుందన్నారు. చింతాయగారిపాలెం, దేవరంపాడు, బీవీ.పాలెం, ఉలిచి, కొప్పోలు, చేజర్ల గ్రామాల రైతులు షెడ్యూల్ ప్రకారం వరి ధాన్యం అమ్మకాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలోసొసైటీ మాజీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరామయ్య, ఏఈవో కె.రామకృష్ణారెడ్డి, గద్దె వెంకట కృష్ణ, చేజర్ల శ్రీనివాసరావు, కనుమూరి వెంకటరావు, కొమ్మనబోయిన శ్రీనివాసరావు, షేక్ బాజీ పాల్గొన్నారు.

పరిషత్ ఫైట్

(5వ పేజీ తరువాయి)

అందిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు చల్లా జ్యోతిని ఎంపీపీ చేసేవిధంగా వైసీపీ రెబల్ ఎంపీటీసీలతో అవగాహన కుదిరింది. దీంతో రెచ్చిపోయిన వైసీపీ నాయకులు అంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఒక ఎంపీటీసీ కుటుంబసభ్యులపై దౌర్జన్యానికి దిగారు. దళిత వర్గానికి చెందిన ఆ ఎంపీటీసీ కుటుంబ సభ్యులు కేసు పెట్టడంతో ఆంజనేయరెడ్డి, ముడివేముల ఎంపీటీసీ సుబ్బారావులు అట్రాసిటీ కేసులో చిక్కుకున్నారు. ఆంజనేయరెడ్డి రిమాండ్‌లో ఉండగా సుబ్బారావు పరారీలో ఉన్నాడు. టీడీపీ సహకారం పొందుతున్న వైసీపీ రెబల్ వర్గానికి చెందిన ఎంపీటీసీ సభ్యుల సంఖ్య తొమ్మిదికి చేరింది. వైసీపీతో ఉన్న ఎనిమిది మందిలో ఆంజనేయరెడ్డి రిమాండ్‌లో ఉన్నారు. ఆయన బెయిల్ పిటిషన్ ఏప్రిల్ 1వతేదీకి వాయిదా పడింది. ఓటింగ్‌కు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలన్న ఆయన పిటిషన్‌పై బుధవారం తీర్పు వెల్లడికానుంది. ఒకవేళ కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చినా ఆంజనేయరెడ్డితో వైసీపీ మద్దతుదారుల సంఖ్య ఏడుకు చేరుతుంది. పరారీలో ఉన్న మరో ఎంపీటీసీ సుబ్బారావు ఓటింగ్‌కు రావాలని ప్రయత్నించినా పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉంది. దీంతో టీడీపీ మద్దతు ఉన్న చల్లా జ్యోతి ఎంపీపీ అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అందిన సమాచారం మేరకు ఎన్నికల్లో వారు విజయం సాధిస్తే టీడీపీ తీర్థం పుచ్చుకున్న తర్వాతే ప్రమాణ స్వీకారం చేయవచ్చు అనేది సమాచారం.

పుల్లలచెరువులోనూ అంతే

పుల్లలచెరువు మండలంలో కూడా టీడీపీ చక్రం తిప్పింది. అప్పట్లో మంత్రిగా ఉన్న సురేష్ ఇక్కడ కూడా ఎంపీపీ పదవిని రెండేళ్లు ఒకరికి, మరో రెండేళ్లు ఇంకొకరికి చివరి ఏడాది మరొకరికి కేటాయిస్తూ ఒప్పందం చేశారు. ఆ ప్రకారం తొలుత ఎంపీపీగా ఎన్నికైన లాజరు రాజీనామా చేయగా వైస్ ఎంపీపీగా ఉన్న వెంకటయ్య ఎంపీపీ అయ్యారు. ఇటీవల ఆయన్ను ఎరిక్షన్‌బాబు టీడీపీలో చేర్చుకున్నారు. ప్రస్తుతం వెంకటయ్య స్థానంలో వైస్ ఎంపీపీగా కొత్తవారిని ఎన్నుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ సభ్యులు ఉండగా 11 మంది వైసీపీ, నలుగురు టీడీపీ నుంచి గెలుపొందారు. ఎంపీపీ టీడీపీలో చేరడంతో వారి సంఖ్య ఐదుకు పెరిగింది. దీనికి తోడు ఐటీవరం, ముటుకుల, మర్రివేముల ఎంపీటీసీ సభ్యులు కూడా టీడీపీకి మద్దతు ప్రకటించినట్లు తెలుస్తోంది. ఈ ఎంపీటీసీలపై ప్రభావం చూపే వైసీపీ నాయకులు కొందరు ఎన్నికలకు ముందే టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ ఎంపీటీసీల బలం ఎనిమిదికి చేరింది. వైస్ ఎంపీపీగా నాయుడుపాలెం ఎంపీటీసీ నాగభూషణంను టీడీపీ రంగంలో దింపింది. వైసీపీ నాయకులు కుస్తీ పడుతున్నారు. పదిహేను మంది ఎంపీటీసీల్లో ఎనిమిది మంది టీడీపీలో ఉన్నందున వైస్ ఎంపీపీ టీడీపీకి అవకాశం ఉంది.

విభేదాలే కొంపముంచాయి..

ఎర్రగొండపాలెం మండల పరిషత్‌లో మైనారిటీ వర్గం నుంచి ఎంపికైన కోఆప్షన్ సభ్యుడు మృతిచెందడంతో ఆ పదవికి గురువారం ఎన్నిక జరగనుంది. మండలంలో మొత్తం 18 మంది ఎంపీటీసీ సభ్యుల్లో వైసీపీ తరపున పది, టీడీపీ తరపున ఎనిమిది మంది ఉన్నారు. దీంతో మరో ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులను రాబట్టుకొని కోఆప్షన్ పదవిని చేజిక్కించుకునేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రాధాన్యత ఉన్న మూడు పదవులను వైసీపీ కోల్పోయి టీడీపీ చేజిక్కించుకునే అవకాశం రావడం వెనుక ఆపార్టీ నాయకుల కృషితోపాటు వైసీపీ కింది స్థాయి నాయకుల్లో విభేదాలు కారణమన్న చర్చ నడుస్తోంది. అయితే వాటిని ఆపార్టీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ సరిచేయలేకపోవడం కూడా ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.





మామిడి తోట

ఫ్లేవర్‌కే బంగినపల్లి పందిళ్లపల్లి

మామిడి రుచులకు ఫేమస్
దాదాపు 300 ఎకరాల్లో సాగు
పలు ప్రాంతాలకు ఎగుమతి
ఆక్వా, రియల్ రంగాలతో సాగు కొంత కుదేలు

పండ్లలో మామిడికి ఉన్న క్రేజ్ మరే పండుకూ ఉండదంటే అతిశయోక్తికాదు. దాని అమోఘమైన రుచికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. దాన్ని చూస్తుంటేనే నోట్లో నీళ్లు ఊరాల్సిందే! వేసవికాలం వచ్చిందంటే అందరూ లొట్టలు వేసుకుని మామిడి కాయలను తింటుంటారు. ఇక పిల్లలైతే వాటి రసాన్ని జుర్రుకుంటూ ఆస్వాదిస్తారు. పందిళ్లపల్లిలో సాగు చేసే మామిడి తోటలకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. వాటి రుచి, నాణ్యత, సైజుతోపాటు కమ్మని వాసనకు పెట్టింది పేరు.

వేటపాలెం, చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లి నుంచి కడవకుదురు వరకు విస్తారంగా సాగవుతున్న బంగినపల్లి మామిడికి మంచి గిరాకీ ఉంది. పందిళ్లపల్లి మామిడి గురించి తెలిసిన వారు ఈ పరిసరాల్లోకి వచ్చినప్పుడు మామిడిని రుచిని చూడాల్సిందే.

● పడిన లేస్తున్న మామిడి సాగు

మామిడి సాగు ఇటీవల అనేక గండాలను ఎదుర్కొంటోంది. ఈ ప్రాంతంలో ఆక్వా రంగం, రియల్ ఎస్టేట్ వంటివి దూసుకుపోవడంతో మామిడి సాగు తగ్గుముఖం పట్టింది. పైగా గాలివానలు, ఈదురు గాలులు, వర్షాలు వంటివి సంభవించినప్పుడు ప్రభుత్వాలు కూడా వీరికి బాసటగా నిలవకపోవడంతో సాగు కొంత కుదేలయింది. ఇటీవల సాగుకు ప్రభుత్వం నూతన పాలసీలు అమలు చేస్తుండటంతో కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. మామిడి రైతులకు సబ్సిడీపై రుణాలు, రోటోవీటర్లు, గొర్రులు వంటివి అందిస్తే బాగుంటుందని రైతులు చెబుతున్నారు.

● సాగుకు శ్రమ.. పంటికి రుచి

పందిళ్లపల్లి నుంచి కడవకుదురు వరకు దాదాపు ఏళ్ల తరబడి సుమారు 300 ఎకరాల్లోపు మామిడి తోటలు సాగులో ఉన్నాయి. రైతులు, కౌలు రైతులు వీటిని సాగు చేస్తున్నారు. మొక్క దశ నుంచి పంట చేతికి రావడానికి సుమారు ఐదేళ్లు పడుతుంది. ఈ కాలంలో ఆ మొక్కలను కంటికి రెప్పలా సాకుతున్నారు. పూత దశకు చేరినప్పుడు మరింత అప్రమత్తంగా ఉంటున్నారు. పూతకు పచ్చ పురుగు, తేనె పురుగు, బంక పురుగు వంటివి సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సాగుకు ప్రభుత్వం సహకరించాలి



కొండెపి సుబ్బారావు, మామిడి కౌలు రైతు

దాదాపు ఇరవై ఏళ్ల నుంచి ఏటా 20 నుంచి 30 ఎకరాలవరకు మామిడి తోటలను కౌలుకు చేస్తున్నా. పలు మార్లు ఎదురుదెబ్బలు తగిలాయి. మామిడిపై మక్కువతో లాభనష్టాలు బేరీజు లేకుండా తిరిగి ప్రారంభిస్తున్నా. ప్రభుత్వాలు సాగుకు సహకరించి అవసరమైన పనిముట్లు, సబ్సిడీ రుణాలు అందించి ప్రోత్సహించాలి.

ప్రకృతి సేద్యంతో సాగు చేస్తున్నా



గోవన ఆదియ్య, సేంద్రీయ మామిడి సాగు రైతు

దాదాపు 20 ఏళ్లుగా ప్రకృతి సేద్యం చేస్తూ మామిడిని పండిస్తున్నా. ప్రకృతి మామిడి సాగు చేయడం కొంచెం కష్టంగా ఉంటుంది. కానీ మంచి ఫలితం, ఆరోగ్యం ఉంటుంది. రసాయనాలు, పురుగుమందులతో సాగు సులువుగా ఉన్నా దిగుబడి తక్కువగా ఉంటుంది. ఈక్రమంలో ఇటీవల జిల్లా కలెక్టర్ వెంకటమురళీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నా.

పందిళ్లపల్లిలో సాగులో ఉన్న మామిడి ప్రత్యేకతలు

- రసాలు, చిత్తూరు మామిడి, కొబ్బరి మామిడి, బెంగళూరు మామిడి, నాటు సువర్ణ రేఖ(పుట్టుకతోనే పండు ఎరుపుగా తయారవుతుంది) వంటివి సాగు చేస్తున్నారు.
- హైదరాబాదు, తిరుపతి, విజయవాడ వంటి ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి.
- ఇతర ప్రాంతాల మామిడితో పోలిస్తే ఇక్కడ పండుకి చాలా ప్రాముఖ్యత ఉంది. వేరే ప్రాంతాల్లో పండిన పండు రెండురోజులకు మెత్తపడటంతో పాటు తియ్యదనం తగ్గుతుంటుంది. కానీ ఇక్కడి పండు సైజు అధికంగానూ, నాణ్యతగానూ ఉంటుంది. అలాగే పండిన తరువాత కూడా దాదాపు వారం పాటు తియ్యదనం తగ్గదు. నిల్వ ఉంటుంది.



ఆర్గానిక్ పద్ధతిలో విరగ కాసిన పచ్చడి మామిడి

7నుంచి విద్యార్థులకు వార్షిక పరీక్షలు

19 నాటికి మూల్యాంకనం పూర్తి
21న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

ఒంగోలు విద్య, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వచ్చే నెల 7 నుంచి 17వ తేదీ వరకు వార్షిక పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాకమిషనర్ విజయరామరాజు పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక పాఠశాలలు, యూపీ, హైస్కూళ్లలోని 1నుంచి 5 తరగతుల విద్యార్థులకు తరగతి గది ఆధారిత అంచనా(సీబీఏ3), 6నుంచి9 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)2 పేరుతో వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. 1నుంచి 8 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9నుంచి 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు పదో తరగతి పరీక్షల తరహాలో పరీక్షలు నిర్వహిస్తారు.

పరీక్షలు ఇలా...

- 1నుంచి 5 తరగతుల విద్యార్థులకు వచ్చే నెల 9న తెలుగు, 10న ఇంగ్లీషు, 11న గణితం, 12న పరిసరాల విజ్ఞానం, 15న ఓఎస్ఎస్‌సీ పరీక్షలు నిర్వహిస్తారు.
- 6నుంచి 9 తరగతుల విద్యార్థులకు 7న తెలుగు, 8న హిందీ, 9న ఇంగ్లీషు, 10న గణితం, 11న జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, 12న బయాజికల్ సైన్స్ 15న సోషల్, 16న కాంపోజిట్ కోర్సు, ఓఎస్ఎస్‌సీ పేపర్-1, 17న కాంపోజిట్ కోర్స్, ఓఎస్ఎస్‌సీ పేపర్-2 పరీక్ష జరుగుతుంది.



1నుంచి 5 తరగతుల ప్రశ్నాపత్రాలు క్లస్టర్ స్కూలు కాంప్లెక్స్‌లో, 6నుంచి 9 తరగతుల ప్రశ్నాపత్రాలను మండల విద్యావనరుల కేంద్రాల్లో భద్రపరుస్తారు. ప్రశ్నాపత్రాలను భద్రతకు రెండు స్థాయిల్లో త్రిసభ్యకమిటీలను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. పరీక్షలు పూర్తయ్యాక ఈనెల 19వ తేదీ నాటికి జవాబుపత్రాలు మూల్యాంకనం చేసి 21వ తేదీ నాటికి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలి. 23వ తేదీన విద్యార్థుల ప్రమోషన్ జాబితాలు తయారు చేసి ప్రకటించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న ఏపీపీఎస్సీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఏపీపీఎస్సీ పరీక్ష జరుగుతున్న స్థానిక నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా సెంటర్‌ను ఆయన తనిఖీచేశారు. అక్కడ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరీక్షలు రెండు సెషన్స్‌లో జరుగుతున్నాయని జేసీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మార్కాపురంలో కృష్ణ చైతన్య కాలేజీ, డాక్టర్‌శామ్యూల్ ఇంజనీరింగ్ కాలేజీ, ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ, రైజ్ కృష్ణసాయిగాంధీ ఇంజనీరింగ్ కాలేజీ, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థలో ఈ పరీక్షలు జరిగాయి. కాగా ఉదయం జరిగిన సెషన్‌కు 797 మంది అభ్యర్థులకుగాను 372 మంది హాజరు కాగా 425 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెషన్‌కు 475 మంది అభ్యర్థులకు గాను 215 మంది హాజరు కాగా 260మంది గైర్హాజరయ్యారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి వస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు

ఒంగోలు నగరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ-2025 పరీక్షకు జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి అంజల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 08592-231232, 9989285530 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలి

అధికారులతో కలిసి బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర
400 ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్
చకచకా విద్యుత్ లైన్ల ఏర్పాటు

పీసీపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు సంబంధించిన పనులు చురుకుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనలతో సైట్ ఇన్‌చార్జ్ బత్తిన రాధాక్రిష్ణ నేపథ్యంలో పనులన్నీ అత్యంత వేగవంతంగా జరుగుతున్నాయి. బయోగ్యాస్ ప్లాంట్ కోసం ప్రభుత్వం కేటాయించిన 475.57ఎకరాలలో మంగళవారానికి 400 ఎకరాలలో జంగిల్ క్లియరెన్స్ చేయించడంతో పాటు భూమి చదును చేసే కార్యక్రమం పూర్తయింది. విద్యుత్ ఈఈ ఉమాకాంత్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది, విద్యుత్‌లైను ఏర్పాటు పనులు చకచకా చేస్తున్నారు. ఇప్పటికే స్తంభాలను వేసి విద్యుత్‌లైన్‌లను ఏర్పాటుచేశారు. పంచాయతీరాజ్ అధికారులు దివాకరపల్లి నుంచి భూమిపూజ జరిగే ప్రాంతం వరకు ఒక రోడ్డు, మురుగుమ్మి వైపు నుంచి మరో రోడ్డును ఏర్పాటుచేస్తున్నారు.

మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులతో కలిసి బయోగ్యాస్ ప్లాంట్ ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సభావేదిక నుంచి ఐదారొందల మీటర్ల దూరంలో వీవీఐపీల కోసం రెడు హెలిప్యాడ్‌లను నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు చెప్పారు. పబ్లిక్ వాహనాలు, వీవీపీల వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కనిగిరి సీఐ ఖాజావలిని ఆదేశించారు. బుధవారానికల్లా భూమి మొత్తాన్ని చదును చేయించాలని సైట్ ఇన్‌చార్జ్‌కు సూచించారు. ప్లాంట్, దానికి ఉపయోగించే గ్రాస్‌ని త్రీడి డెమో ద్వారా వీవీఐపీలకు చూపించేందుకు ఒక ఎకరా స్థలాన్ని ప్రత్యేకంగా కేటాయించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సమర్పణరావు, ఏఈ ఫిరోజ్, విద్యుత్ ఈఈ ఉమాకాంత్, షీప్ సొసైటీ సంఘం ప్రెసిడెంట్ తొండేటి గోపి, ఎంపీడీవో ప్రభాకరశర్మ, వీరపనేని పెద్దన్న, వేమూరి రామయ్య, ఏనుగంటి చిన్నా, షరీఫ్, పీసీపల్లి ఎస్ఐ జి.కోటయ్య, బజాజ్ ఓబుల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

300 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

డ్రోన్ కెమెరా సహాయంతో నాటుసారా బట్టీ గుర్తింపు

గిద్దలూరు టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మనూరు పంచాయతీ వేములపాడు అటవీప్రాతంలో నాటుసారా తయారీ కేంద్రంపై దాడి చేసి 300 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారరు. డ్రోన్ కెమెరాసాయంతో నాటుసారా బట్టీని గుర్తించి ధ్వంసం చేయడం గమనార్హం. అందిన సమాచారం మేరకు.. గిద్దలూరు మండలం కొమ్మునూరు పంచాయతీ పరిధిలోని వేములపాడు పరిసరాలలో నాటుసారా తయారీ కేంద్రాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆప్రాంతంలో నిఘా పెట్టారు. అయితే సరైన కదలికలు వీరికి దొరకలేదు. దీంతో అర్బన్ సీఐ కె.సురేష్ డ్రోన్ సహాయంతో మంగళవారం వేములపాడు సమీప ప్రాంతంలోని అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. కొందరు వ్యక్తులు ఆప్రాంతంలో నాటుసారా తయారు చేసేందుకు బట్టీలను ఏర్పాటు చేసినట్లు డ్రోన్ ద్వారా తెలుసుకుని దాడి చేశారు. పోలీసులను గుర్తించిన నాటుసారా తయారీదారులు పరారయ్యారు. ఆ ప్రాంతంలోని నాటుసారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లంఊటను అర్బన్ సీఐ సురేష్, పోలీసులు ధ్వంసం చేశారు. అసాంఘీక కార్యకలాపాలను కనిపెట్టేందుకు పోలీసులు సరికొత్తగా డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నారు.



నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న అర్బన్ సీఐ, పోలీసులు

నాటుసారా తయారీ చేస్తే చట్టపరమైన చర్యలు

ఎక్సైజ్‌శాఖ అసిస్టెంటు కమిషనర్ విజయ

పెద్దదోర్నాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీకి తోడ్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ అసిస్టెంటు కమిషనర్ విజయ హెచ్చరించారు. నవోదయం-2లో భాగంగా నాటుసారా నిర్మూలనకు స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వ్యాపారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ అధిక లాభాలు కోసమని నాటుసారా తయారీకి బెల్లం అమ్మినట్టయితే కేసులు నమోదవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఎస్ దాసరి బాలయ్య,సీఐ వెంకటరెడ్డి, ఎస్సై శ్రీకాంత్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు

28న సింగరాయకొండలో జాబ్‌మేళా

సింగరాయకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ యాదవ్ తెలిపారు. ఈ మేళాకు ఇండోసోల్, ఫ్లిప్ కార్ట్‌తోపాటు పలు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. జిల్లాలో 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు ఆధార్ కార్డు, సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

సింగరాయకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై దాడి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని శ్రీరాంనగర్‌కు చెందిన కుంచాల ఏడుకొండలు అక్కడి ప్రాథమిక పాఠశాలలో కోఆప్షన్ సభ్యుడు. ఈనెల 20వ తేదీన ఆయన స్కూల్‌కు వచ్చి సమస్యలపై హెచ్‌ఎంతో చర్చించారు. తిరిగి వెళ్తుండగా ఆయన్ను కుంచాల రవి నిలువరించాడు. అనంతరం ఏడుకొండలును దుర్భాషలాడుతూ కర్రతో దాడి చేశాడు. దీంతో గాయాలైన ఏడుకొండలు చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలలో చేరారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి మంగళవారం రవిని అరెస్టు చేసి కందుకూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిపాడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పారిశ్రామికవాడ పరిధిలోని పలు ప్రాంతాలలో బుధ, గురువారాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. మద్దిపాడు సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ మద్దిపాడు నార్త్ సబ్‌స్టేషన్, గుండ్లాపల్లి పారిశ్రామికవాడ 33 లెవెన్ కేవీ, 3,4,6 ఫీడర్ల పరిధిలో నూతనంగా విద్యుత్ లైన్ నిర్మాణం జరుగుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వృద్ధురాలి కంటి ఆపరేషన్‌కు ఆర్థికసాయం



నగదును అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఒంగోలు కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కంటి చూపు సరిగా లేని పేద వృద్ధురాలి కంటి ఆపరేషన్‌కు శివం ఫౌండేషన్ మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఒంగోలులోని మోడరన్ ఐ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.25 వేల చెక్కును నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు చేతులమీదుగా ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ మారం వెంకటరమణారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి మాట్లాడుతూ పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన పాశం అనసూయమ్మను కుటుంబ సభ్యులు పట్టించుకోకుండా వదిలేశారని, ఆమెకు కళ్లు కనిపించని స్థితికి చేరటంతో తమ ట్రస్ట్ ద్వారా ఆపరేషన్‌కు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు దన్నారపు మస్తాన్‌రావు, ఆస్పత్రి నిర్వాహకులు శ్రీనివాసరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామ్‌చరణ్ పుట్టినరోజు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో సినీ హీరో రామ్‌చరణ్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముత్యాల కళ్యాణ్, అయినాబత్తిని రాహుల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షులు చనపతి రాంబాబు, జనసేన పార్టీ నాయకులు పప్పు శ్రీను, ఆకుపాటి ఉష, పల్ల ప్రమీల, దండే అనిల్, సుంకర కళ్యాణి, అలా నారాయణ, షేక్ ముంతాజ్, బ్రహ్మనాయుడు, కర్రీ శ్రీకాంత్, తాడి దానమూర్తి, సాయికుమారి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు జాబితా విడుదల

సంతనూతలపాడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతులకు ఏ ప్రయోజనం దక్కాలన్నా ఈ-పంట, ఈ-కేవైసీ తప్పనిసరి. దిగుబడులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా, విపత్తులు సంభవించినపుడు పంటల బీమా పొందాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. ప్రస్తుతం ఈ-పంట నమోదు పూర్తవడంతో ముసాయిదా జాబితాలను గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల్లో ఉంచారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ముసాయిదా జాబితాను ప్రచురించారు. ఈమేరకు మండలంలో 8,402 ఎకరాల్లో 5,275 మంది రైతులు 2024-25 రబీలో వరి, శనగ, మినుము, మిరప, పొగాకు పంటలను సాగు చేసినట్లు వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు.

సాగర్ జలాలతో చెరువులను నింపాలి



మాట్లాడుతున్న వెంకట్రావు

చీమకుర్తి, మార్చి25(ఆంధ్రజ్యోతి) : సాగర్ జలాలతో చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల పరిధిలోని చెరువులన్నింటినీ వెంటనే నింపాలని రైతుసంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు కోరారు. రైతు సంఘం మండలకమిటీ సమావేశం మంగళవారం చీమకుర్తిలో బెజవాడ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ధాన్యపు కొనుగోలు కేంద్రాలను తెరచి మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. పొగాకు ధర రోజురోజుకు దిగజారుతోందని, ప్రభుత్వం జోక్యం చేసుకొని గతం కన్నా ధరలు మిన్నగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిన్నపురెడ్డి, కొల్లూరి వెంకటేశ్వర్లు, కుమ్మిత శ్రీనివాసరెడ్డి, లక్ష్మయ్య, మాదాల నరసింహారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగుండ్లపాడు విద్యార్థి ప్రతిభ



సానిధ్య

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడు ప్రభుత్వ ఎంపీపీ హైస్కూలులో 5వ తరగతి విద్యనభ్యసిస్తున్న చినిగే సానిధ్య జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలలో 6వ తరగతి సీటు సాధించాడు. గత నెల 18వ తేదీన జరిగిన జేఎన్‌వీ ప్రవేశ పరీక్షలలో ప్రతిభ చాటిన సానిధ్య ఉత్తమ మార్కులు సాధించి నవోదయ పాఠశాలలో విద్యాభ్యాసానికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈమేరకు సానిధ్యను వారు అభినందించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

ఒంగోలు క్రైం, మార్చి25(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన వెంగముక్కపాలెం జంక్షన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. పేర్నమిట్ట సుందరయ్యనగర్‌కు చెందిన ఉప్పుటూరి సాయి (30) వెంగముక్కపాలెం జంక్షన్ నుంచి బైక్‌పై ఇంటికి వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సాయిని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

కొండపిలో రోడ్డు మార్జిన్లు ఆక్రమణ

ఇరువైపులా దుకాణాలు, తోపుడు బండ్లు

గత వైసీపీ పాలనలో ఇష్టానుసారం అనుమతులు

కుంచించుకుపోయిన ఆర్అండ్‌బీ రహదారి

రాకపోకలకు ఇబ్బందులు



జెండాచెట్టు సెంటర్‌లో రోడ్డు మీదే ఉంచిన తోపుడు బండ్లు

కొండపి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని జెండాచెట్టు సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత వైసీపీ పాలనలో ఇష్టారీతిగా గ్రామ పంచాయతీ పేరుతో రసీదులిచ్చి దుకాణాలు, తోపుడు బండ్ల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. దీనికితోడు అప్పటి ప్రజాప్రతినిధులు దుకాణదారుల వద్ద కొంత డబ్బులు తీసుకున్నట్లు విమర్శలువచ్చాయి. రోడ్డుపక్కన ఉన్న గృహ యజమానులు తమ ఇళ్ల ముందు స్థలాలు తమవేనంటూ దుకాణాలకు, తోపుడు బండ్లకు ఇచ్చి అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. దీంతో జెండాచెట్టు సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డు కుంచించుకుపోయింది. కూరగాయలు, పండ్ల దుకాణాలతోపాటు, తాత్కాలికంగా చేపలు, రొయ్యల విక్రేతలు అక్కడే రోడ్డుపై పెట్టుకుని వాటిని విక్రయించుకుంటున్నారు. దీనికితోడు ఇతర ప్రాంతాల నుంచి కొందరు ఆటోల్లో కూరగాయలు, పండ్లు తెచ్చి రోడ్లపైనే వాహనాలను నిలిపి అమ్ముకొంటున్నారు. దీంతో తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

ఆక్రమణలపై మంత్రి అసహనం

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఇటీవల కొండపిలో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో ఆయన ఆక్రమణల విషయాన్ని ప్రస్తావించారు. 2014-19 మధ్య కాలంలో ఆక్రమణలు తొలగించి డివైడర్లు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తే, తర్వాత వచ్చిన ప్రభుత్వం రోడ్డుకు రెండు వైపులా ఆక్రమణలను ప్రోత్సహించిందని విమర్శించారు. కొండపిని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో భాగంగా గ్రామాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం చర్యలు కరువయ్యాయి. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

శక్తి యాప్‌తో మహిళలు, బాలికలకు రక్షణ

● ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు



ఏఎస్పీ అశోక్‌బాబును సత్కరిస్తున్న ప్రతిభా వెంకటేశ్వర్లు

ఒంగోలు విద్య, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల రక్షణ, భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తియాప్ ఎంతో దోహదపడుతుందని ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు తెలిపారు. మంగళవారం ఒంగోలు సమీపంలోని శ్రీప్రతిభ, శ్రీగురుదత్తా విద్యాసంస్థల క్యాంపస్‌లో విద్యార్థినులకు శక్తి యాప్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలు తమ ఆత్మరక్షణపై జాగ్రత్తలు చూపాలన్నారు. విజ్ఞానం పెరిగే కొద్దీ నేరప్రవృత్తి కూడా పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా కిడ్నాప్, అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు మహిళలు ధైర్యంగా ఎదుర్కొనేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా శక్తి బృందాలతో గస్తీ ఏర్పాటు చేశామని, ప్రతి మహిళ తమ ఫోన్లలో శక్తియాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కరాటే శిక్షకులు శ్రీనివాసరెడ్డి, జయశ్రీలు విద్యార్థినులతో సాధన చేయించారు. కళాశాల డైరెక్టర్ నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థినులు చదువు ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తమ కళాశాల విద్యార్థినులకు నెలరోజుల పాటు ఆత్మరక్షణ విధానాలపై శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అశోక్‌బాబును నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐ సుధాకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, అనిత తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి

సింగరాయకొండ: పోక్సో చట్టంపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సీఐ హజరత్తయ్య ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎంఈవోలు, హెచ్‌ఎంలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడునడత, నేరాలకు పాల్పడిన ఉపాధ్యాయులు ఉంటే గుర్తించి వారి వివరాలను ఇవ్వాలని కోరారు. పాఠశాల ఆవరణలో, తరగతి గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈవోలు కత్తి శ్రీనివాసులు, శ్రీనివాసరావు, గురుకుల పాఠశాల హెచ్‌ఎం కె.రమాదేవి, బాలికల హైస్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవిచంద్ర, ఏఎస్సై శేషారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యం

● డీఈ శ్రీనివాసులు



రికార్డులను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసులు

మర్రిపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆశాఖ దర్శి డివిజనల్ ఇంజనీర్ పాలగిరి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి పెద్దఎత్తున అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియో గదారులు ఏదైనా సమస్య ఉంటే సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దర్శి డివిజన్ పరిధిలోని కురిచేడు మండలం కల్లూరు, పొదిలి మండలం ఏలూరుల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో మర్రిపూడి మండలం గుళ్లసముద్రం గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధచూపాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పరివర్తకాల పనితీరును పరిశీలించారు. ఈయన వెంట పొదిలి ఏడీఈ హరిబాబు, ఏఈ సుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ తగ్గింపు

● కమిషనర్ రామకృష్ణయ్య

చీమకుర్తి, మార్చి25(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 50శాతం తగ్గిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు కమీషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. ఈనెల 31వ తేదీలోపు బకాయిలు చెల్లించిన వారికే ఈ తగ్గింపు అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. పట్టణవాసులు తమ ఆసుతలకు విధించిన పన్ను నగదును ఏడాదికి రెండుసార్లు చెల్లించే వెసులుబాటు ఉంటుంది. మొదటివిడత చెల్లింపులు జూన్ దాటినా, రెండవ విడత చెల్లింపు మార్చి దాటితే చెల్లించాల్సిన పన్నుకు రెండు శాతం వడ్డీ కలిపి చెల్లించాల్సి ఉంది. ఇపుడు గతంలో ఎప్పటి బకాయికైనా వడ్డీలో రాయితీని కట్టే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని, ఇప్పటికే వడ్డీతో చెల్లించినవారికి తదుపరి చెల్లింపుల సమయంలో మినహాయింపు ఉంటుందన్నారు. చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో దాదాపు రూ.70లక్షల మేర పన్నులు బకాయిలు ఉన్నాయని, బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

రుణాల రికవరీ నూరు శాతం చేయాలి

● పీడీ నారాయణ

ఒంగోలు నగరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలు తీసుకున్న రుణాలు సొమ్మును నూరుశాతం రికవరీ సాధించాలని డీఆర్‌డీఏ, వెలుగు పీడీ నారాయణ ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ భవనంలో ఆయన మాట్లాడుతూ ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు తప్పకుండా పొదుపు సంఘాల సమావేశాల్లో పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను పొదుపు సంఘాల సభ్యులకు అందించేలా కృషి చేయాలని చెప్పారు. సంస్థాగత నిర్మాణ విభాగంలో ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్త్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణ ఎంతో సులువు

ఒంగోలు(రూరల్), మార్చి25(ఆంధ్రజ్యోతి): టీబీ నివారణ ఎంతో సులువని, రెండు వారాలకు మించి దగ్గు, జలుబు ఉంటే దగ్గర ఉన్న ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సుందరప్రసాద్ కోరారు. ఒంగోలు మండలం కరవది గ్రామంలో మంగవారం టీబీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన సమావేశం నిర్వహించి ప్రసంగించారు. ఒక ఇంట్లో టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయితే కుటుంబసభ్యులు అందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఇది అంటువ్యాధి అని, ఒకరి నుంచి మరొకరికి సోకుతుందని చెప్పారు. ఆసుపత్రిలో ఇచ్చే మాత్రలతో ఈ వ్యాధి సులభంగా నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాలకు దాతల చేయూత

కరవది పీహెచ్‌సీలో సమావేశాలు నిర్వహించుకోవటానికి అవసరమైన 20కుర్చీలను గ్రామస్థుడు నల్లూరి వెంకటరావు వితరణ చేశారు. అలాగే వైద్యశాల ఫ్లోరింగ్ నిర్మాణానికి అమెరికాలోని టెక్సాస్‌లో ఉంటున్న ఈశ్వర్ రూ.25వేలు అందజేయగా నిర్మాణం పూర్తి అయ్యింది. ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన దాతలకు డాక్టర్ సుందరప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించాలి

● సీడీపీవో మాధవీలత

కొండపి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని వెంటనే గుర్తించాలని సీడీపీవో మాధవీలత కార్యకర్తలకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న పోషణటీ.. పడోటీ శిక్షణలో రెండోరోజైన మంగళవారం ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పోషకాహార లోపం నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఆటలతో కూడిన విద్యను అందించాలన్నారు. సూపర్‌వైజర్ విక్టోరియారాణి మాట్లాడుతూ శిక్షణలో సూచించిన అంశాలను అమలు చేయాలని సూచించారు.

గుండ్లాపల్లి జడ్పీ హైస్కూలులో..

మద్దిపాడు: గుండ్లాపల్లి జడ్పీ హైస్కూలులో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా సీడీపీవో ఆర్.ఇవాంజెలిన్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

29న విశ్వావసు ఉగాది వేడుకలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు కల్చరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం స్థానిక కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారికి అత్యంత ప్రధానమైన ఉగాది వేడుకల్లో భాగంగా స్థానిక కాపు కళ్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి పంచాంగ శ్రవణం, నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ సంవత్సరం కుర్రా కోటి సూర్యమ్మ స్మారక సాహిత్య జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కప్పగంతుల మధుసూధన్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. మరికొందరికి ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీవీఎన్ రీడింగ్ రూం అధ్యక్షుడు గురునాథరావు, నారపుశెట్టి శ్రీనివాసరావు, గిరిజాశాండిల్య, నూనె అంకమ్మరావు, అనుమల మహేంద్ర కుమార్, మద్దులూరి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన

ఒంగోలు విద్య, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వీసీ డీవీఆర్.మూర్తి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న ఒంగోలులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లను డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి టి.రాజేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీపై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న ఈవోఆర్డీ రమణమ్మ

సంతనూతలపాడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని చెత్త సంపద తయారీ కేంద్రంలో నియోజక వర్గంలోని నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు చెత్త నుంచి సంపద సృష్టిపై మంగళవారంతో శిక్షణ తరగతులు ముగిశాయి. ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఈవోఆర్డీ రమణమ్మల పర్యవేక్షణలో ఈనెల 21 నుంచి ఈ వరకు శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు తప్పనిసరిగా పాటించి చెత్తసంపదపై దృష్టిసారించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ చక్రధరరావు, మద్దిపాడు ఈవోఆర్డీ రఘుబాబు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్‌బాబు

నాగులుప్పలపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో బాలికల భద్రతపై అప్రమత్తంగా ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు సూచించారు. ఇటీవల కాలంలో విద్యార్థినులు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు దృష్ట్యా నాగులుప్పలపాడు జడ్పీ హైస్కూల్‌లోని పోక్సో తదితర చట్టాలపై ఉపాధ్యాయులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మద్దిపాడు: లింగంగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోక్సో చట్టం సీఐ శ్రీకాంత్‌బాబు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.రామారావు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల వద్ద శనగల కొనుగోలు



మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం నుంచి శనగల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏవో పి.వెంకట్రావు సూచించారు. మద్దిరాలపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ శనగలకు ప్రభుత్వం క్వింటాకు రూ.5,650 మద్దతు ధర ప్రకటించిందని చెప్పారు. ప్రతి రైతు తప్పనిసరిగా 11 అంకెల యూనిక్ నెంబరును పొందాలని, దీనివల్ల వ్యవసాయ శాఖ ద్వారా రైతులు పొందే సేవలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. 50శాతం రాయితీపై పీవీసీ పైపులు, స్ప్రింక్లర్లు, 90శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్యశాలను ఏర్పాటు చేయాలి

● ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తృతీయ క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం ప్రశ్నించారు. పార్లమెంట్ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ రోగ నిర్ధారణ, అత్యాధునిక సౌకర్యాలు, వైద్య చికిత్సలు అందించేందుకు తృతీయ క్యాన్సర్ కేంద్రం రాష్ట్రంలో లేకపోవడం బాధాకరమన్నారు. క్యాన్సర్ రోగ నివారణ ఒక్కటే సరిపోదని, చికిత్సకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా కల్పించాలని చెప్పారు. దేశంలో అధిక క్యాన్సర్ రోగులు ఉన్న పది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని, ఈ అందువల్ల తృతీయ క్యాన్సర్ వైద్యకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మాగుంట కోరారు.

రేపు సర్పంచ్‌ల సంఘం సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ సర్పంచ్‌ల సంఘం ప్రత్యేక సమావేశం గురువారం ఒంగోలులో జరుగుతుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సర్పంచ్‌లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాజీ ఎంపీపీకి జడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా జైలులో ఉన్న త్రిపురాంతకం మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డిని మంగళవారం జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా విలేఖరుల సమావేశంలో శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏ తప్పూ చేయకపోయినా కేవలం ఎంపీపీగా పోటీ చేస్తున్నారన్న ఉద్దేశంతో ఆంజనేయరెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారని ఆరోపించారు. ఆంజనేయరెడ్డి బెయిల్ కోసం లీగల్ టీందరఖాస్తు చేసిందని ఆయన పేర్కొన్నారు. అక్రమ కేసులతో తమ క్యాడర్‌ను భయపెట్టలేరని బూచేపల్లి స్పష్టం చేశారు.

అవీ..ఇవీ

పోక్సో చట్టంపై అవగాహన

కంభం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, పిల్లలపై వేధింపులు క్షమించరాని నేరమని ఎస్సై నరసింహారావు వ్యాఖ్యానించారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో మాల్యాద్రి అధ్యక్షతన మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు 'గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌'పై అవగాహన కల్పించాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మాల్యాద్రి, శ్రీనివాసులు, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రౌడీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

పుల్లలచెరువు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రౌడీలు సమాజంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని పుల్లలచెరువు ఎస్‌ఐ సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌లో రౌడీలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అలజడులు సృష్టించినా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కంభం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురిమెళ్ల ఎస్ఆర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవాన్ని, వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ ఉన్నత చదువులు కొనసాగించే విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలను నిర్ధేశించుకుని కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ జ్యోతి, వైస్‌చైర్మన్ పావని, ఉపాధ్యాయురాళ్లు కల్యాణి, అనురాధ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 11 మద్యం సీసాలు స్వాధీనం

మార్కాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పట్టణ పోలీసులు సోమవారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. టౌన్ ఎస్సై సైదుబాబు కథనం మేరకు విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి సమయంలో తర్లుపాడు రోడ్డులోని పలుచోట్ల పోలీసులు సోదాలు చేశారు. ఈ క్రమంలో ఓ కూల్‌డ్రింక్ షాప్‌లో అక్రమంగా నిల్వవుంచిన 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురంరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాశయ్య మద్యానికి బానిసై భార్య మీరమ్మ, కుమారులను వేదిస్తుండగా వారు గట్టిగా మందలించారు. దీంతో మనస్థాపానికి గురై సోమవారం మద్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి పడిపోయాడు. కొంత సమయానికి గమనించిన మృతుడు కాశయ్య పిల్లలు, భార్య కలిసి స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించి వైద్య సేవలు అందిస్తుండగా సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. భార్య మీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా రహిత రాష్ట్రంగా మార్చడమే ధ్యేయం

- గలిజేరుగుళ్ల పంచాయతీ చెన్నుపల్లె గ్రామంలో గ్రామసభ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జితేంద్ర

బేస్తవారపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సారారహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే నవోదయం 2.0 ధ్యేయమని కంభం ఎక్సైజ్ సీఐ ఎస్.కొండారెడ్డి అన్నారు. మంగళవారం బేస్తవారపేట మండలంలోని గలిజేరుగుళ్ల పంచాయతీ చెన్నుపల్లె గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ కొండారెడ్డి, తహసీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను నాటు సారా రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా తాము కూడా సర్కిల్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేస్తే ఎనిమదేళ్ల జైలు, రూ.5 లక్షల జరిమానా విధిస్తారన్నారు. నాటుసారా వలన కలిగే అనర్థాలను ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఏ.జనార్ధన్‌రావు, డి.బాలయ్య అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వైసీపీ ఎంపీటీసీ సభ్యులు



మాజీ సీఎం జగన్‌తో ఎంపీటీసీ సభ్యులు

మార్కాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి). మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మార్కాపురం ఎంపీటీసీ సభ్యులు ముఖ్య నాయకులు మంగళవారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ నెల 27న మార్కాపురం ఎంపీపీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు పార్టీ అధినేత వద్దకు తీసుకెళ్లినట్లుగా సమాచారం. ఎంపీపీ అభ్యర్థి భర్త బండి కృష్ణారెడ్డితో పాటుగా మాజీ ఎంపీపీ భర్త పొరెడ్డి చెంచిరెడ్డి కూడా మాజీ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

పుస్తక పఠనంతో మేధోవికాసం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

ఎర్రగొండపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో మేధస్సు వికసిస్తుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా శ్రీధర్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సంసృతిక పుస్తకాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని కళాశాల అధ్యాపకులు డాక్టరు ప్రదీప్ రచించారు. ఈయన గతంలో ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేస్తూ 'ది మేథడ్స్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్' అనే పుస్తకాన్ని కుడా రచించారని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత డాక్టరు ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

గిద్దలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులతోపాటు దాతలు చేరెడ్డి చిన్నపాపిరెడ్డి, ఎ.ఉదయ్‌శంకర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే అత్యున్నత స్థానం

- డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఎరిక్షన్‌బాబు
- భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ

పెద్దదోర్నాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతోనే విద్యార్థులు అత్యున్నత స్థాయికి చేరుకోగలరని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.సావిత్రి ఆధ్వర్యంలో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు జీవితలక్ష్యాన్ని చేరుకోవాలంటే గురువుల పట్ల అంకితభావం ఉండాలన్నారు. తల్లిదండ్రులను ప్రేమించాలని, నిబద్ధతతో శ్రద్ధగా చదవాలన్నారు. అదేవిధంగా కళాశాల నూతనంగా మంజూరు కావడంతో పలు సమస్యలు వేధిస్తున్నాయని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ క్రమంలో సమస్యల పరిష్కారానికి, కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులకు పూర్తి స్థాయి నివేదికలు పంపించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్‌యార్డులో కళాశాలకు సరిపడే స్థలసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. శాశ్వత భవన నిర్మాణాలకు, హాస్టల్ వసతి ఏర్పాటుకు తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాలలో విద్యానైపుణ్యాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంకు మేనేజరు సురేష్‌బాబు, సర్పంచి చిత్తూరి హారిక, మాజీ సర్పంచ్ వెచ్చా హరగోపాల్, టీడీపీ నాయకులు షేక్ మాబు, దొడ్డా.శేషాద్రి, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ మంజూర్ భాష, కే సుబ్బారెడ్డి, దేవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల : ముస్లిం మైనార్టీల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. స్థానిక కొత్త మస్జీద్ వద్ద టీడీపీ మండల ముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లింలకు టీడీపీ ద్వారానే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ మహబూబ్‌బాష, షేక్ సమ్మద్‌బాష, షేక్ మంజూర్‌బాష షేక్.మౌలాలి, షేక్ రఫీ, ఖాన్, ఇస్మాయిల్, బాష, బట్టు సుధాకర్‌రెడ్డి, దొడ్డా శేషాద్రి, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చెంచయ్య, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

పెద్దదోర్నాల : పార్టీకి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక శివసదన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే బలం బలగం అని అన్నారు. వారి శ్రేయస్సు కోసం పార్టీ చర్యలు చేపడుతోందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్ఠ పరచడంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రజలకు సేవచేయాలన్నారు. ముఖ్యంగా గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు కార్యకర్తలు తోడ్పడాలన్నారు. ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. అమలు చేస్తున్న పథకాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, వెచ్చా హరగోపాల్, దొడ్డా.శేషాద్రి, చంటి, చల్లా వెంక టేశ్వర్లు, షేక్ మంజూర్ భాష, కే సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొమరోలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులదేనని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు అధికారులపై గతంలో చర్చించిన సమస్యలు ఇంకా పరిష్కారం కావడంలేదన్నారు. ఏ శాఖకు చెందిన సమస్యలు ఆ శాఖ పరిధిలో పరిష్కారానికి నోచుకోవడంలేదని కొందరు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కొమరోలు నుంచి గిద్దలూరు, కొమరోలు ప్రధాన రోడ్డులో ఆర్ అండ్‌బీ రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నా, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు సుభాని లేవనెత్తారు. కొమరోలు నుంచి గిద్దలూరుకు తగినన్ని బస్సులు ఏర్పాటు చేయక పోవడం, రాత్రి వేళలో ట్రైన్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రూ. 500 నుంచి రూ.1000లు ఆటోలు బాడుగకు తీసుకొని గిద్దలూరుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని రాత్రి ట్రైన్ సమయానికి బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కొమరోలు పట్టణం బస్టాండుకు పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉండడంతో ప్రతి బస్సును ఎంపీడీవో కార్యాలయం వరకు నడపాలని ప్రజాప్రతినిధులు తెలిపారు. రైతులకు సంబంధించిన విలువైన ప్రభుత్వ పథకాలపై సాయంకాలం సమయంలో గ్రామాల్లో చర్చించాలని ఎంపీపీ తెలిపారు. కార్యాక్రమంలో ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అమూల్య

అంగన్‌వాడీ కేంద్రాలలో సమృద్ధిగా పౌష్టికాహారం

ఎర్రగొండపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాల్లో తల్లులకు, బాలింతలకు, చిన్నారులకు 300 రోజులు పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఏ.పద్మజ అన్నారు. ఎర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం పోషణ్‌బీ పడాయిబీ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారంతోపాటు ప్రతినెల పిల్లలకు ఎత్తులు, బరువులు తీసి రక్తహీనత సమస్య, అయోడిన్ లోపం ఉంటే గుర్తించాలన్నారు. లోపనివారణకు ఆకుకూరలు, క్యారెట్, బొప్పాయి, పాలు, పెరుగు, పన్నీరు, మాంసం, కాలేయం గుడ్డు, చేపలు, తృణదాన్యాలు నిత్యం ఆహారంలో ఉండేలా చూడాలన్నారు. ఎస్‌వోపే పద్మజ, శివలక్ష్మీ శిక్షణ అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.పద్మావతి, సూపర్ వైజర్లు కేవీ.సుబ్బమ్మ, శివలక్ష్మి, హైమావతి, మరియకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూపర్‌వైజర్లు

పెద్దదోర్నాల : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి సంజయ్ అన్నారు. మండలంలోని రామచంద్రకోట గ్రామంలో సీడీపీవో కమలకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పోషన్‌బీ, పడాయిబీ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతుల్లో బాలింతలు, గర్భిణులు తీసుకోవాలసిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. పలు సూచనలు చేశారు.

రైతులు విధిగా భూసార పరీక్షలు చేయించాలి

ఏవో షేక్ జైన్‌లాబ్దీన్

పొదిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతు లు తప్పకుండా భూసార పరీక్షలు చేయించు కోవాలని ఏవో షేక్ జైన్‌లాబ్దీన్ అన్నారు. మండలంలోని సూదనగుంట, తుమ్మగుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించడం వలన సారవంతమైన భూమిని గుర్తించవచ్చన్నారు. ఆ భూముల్లో ఏపంట సాగు చేసుకుంటే మంచి దిగుబడి వస్తుందనే అవగాహన వస్తుందన్నారు. భూ సార పరీక్షలకు అనుకూలంగా రసాయన ఎరువులు వినియోగించాలన్నారు. భూమిలో ఎక్కువగా సేంద్రీయ ఎరువులు వినియోగించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు ఎక్కువగా వినియోగించాలన్నారు. కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత వ్యవసాయ ఉపకరణాలు 50శాతం రాయితీపై ఉన్నాయన్నారు. కావలసిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు ప్రభుత్వం చేపట్టిన విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు.



బత్తాయి తోటలను పరిశీలిస్తున్న అధికారులు

బేస్తవారపేట : వ్యవసాయంలో రైతులు లాభసాటి పంటలు సాగుచేసి లాభాల బాటలో నడవాలని ఏవో జక్కం మేర్సీ అన్నారు. మంగళవారం బేస్తవారపేట మండలంలోని కలగొట్ల, సలకలవీడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కందులు మద్దతు ధర క్వింటా రూ.7550, శనగలు రూ.5650తో కొనుగోలు కేంద్రం ప్రారంభించారన్నారు. రైతులు సేవా కేంద్రం వద్ద రిజిష్టేషన్ చేయించుకోవాలన్నారు. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు రాయితీలు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులను కలిసి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలోఉద్యాన విస్తరణ అధికారి శేషగిరి, టి.రమణారెడ్డి,ఎన్.ఆది గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : అసైన్‌మెంటు ,డి పట్టా కలిగిన రైతులు వెంటనే పార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పుల్లలచెరువు ఏవో పి. నిర్మలాదేవి సూచించారు. మంగళవారం పోలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మల్లాపాలెం, కోమరోలు గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుల్లలచెరువు పీఏసీయస్ ద్వారా కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభంచామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన అరటిచెట్లు

- రూ.30 లక్షల ఆస్తి నష్టం

కంభం(అర్ధవీడు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాల లో 20 ఎకరాలకు పైగా అరటితోటలు గెలలతో సహా నేలకొరిగాయి. దీంతో రూ.30లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారి శ్వేత మంగళవారం తెలిపారు. మండలంలోని అర్ధవీడు, పాపినేనిపల్లి, బొల్లుపల్లి, పెద్దకందుకూరు, మొహిద్దీన్‌పురం, వీరభద్రాపురం గ్రామాలలో రైతులు వేసిన 20 ఎకరాల అరటి తోటలలో గెలలు కోతకు వచ్చాయి. ఈ సమయంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు గెలలతోసహా అరటిచెట్లు నేలకొరిగాయన్నారు. రైతు వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.



అరటిచెట్లను పరిశీలిస్తున్న ఉద్యానాధికారి

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కంభం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మంగళవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా కంభం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అంజనేయశర్మ వేద మంత్రాల మధ్య కల్యాణ క్రతువు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకిం చేందుకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న దంపతులు



అమరనాథ్ శివలింగం అలంకరణ

ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని ఎస్ఎస్.నగర్‌లో బ్రహ్మకుమారిల ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంగళవారం అమర్నాథ్ మంచుశివలింగం విశేషంగా ఆకట్టుకుంది. ప్రత్యేక పూజల అనంతరం ఆధ్యాత్మిక సందేశం, రాజయోగ మెడిటేషన్ ద్వారా మానసిక ప్రశాంతత అందే విధానంపై బ్రహ్మకుమారి సరస్వతి సందేశం ఇచ్చారు. అనంతరం ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

29న ఉగాది సంబరాలు

గిద్దలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గర్రెవారివీధిలో ఈనెల 29న శనివారం ఉగాది సంబరాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గర్రెవారివీధి ప్రజలు ఒక ప్రకటనలో తెలిపారు. 29న ఉదయం 6 నుండి 8గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు రూ.1500, రూ.1000, రూ.500 పోటీలో పాల్గొన్న అందరికీ కన్సోలేషన్ బహుమతులు అందచేస్తామని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు మ్యూజికల్ చైర్ పోటీలు, 11 గంటలకు బాలబాలికలకు లెమన్‌స్పూన్ పోటీలు, 12 గంటలకు డస్టర్ ఆట, సాయంత్రం 4 గంటలకు కోలాట ప్రదర్శన, 6 గంటలకు ఉగాది సంబరాల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాంప్రదాయ దుస్తుల్లో అందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ముస్లింలకు పండ్లు పంపిణీ

గిద్దలూరు టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉంటున్న ముస్లింలకు ముండ్లపాడులోని అమరావతి పబ్లిక్‌స్కూల్ కరస్పాండెంట్ కె.గణేష్‌యాదవ్ మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. గణేష్‌యాదవ్ మాట్లాడుతూ ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఉంటారన్నారు. వారి కోర్కెలు నెరవేరాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరుతూ పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మహిళల కోసం ఇఫ్తార్ ఆత్మీయ సమావేశం

గిద్దలూరు : జెఐహెచ్ మహిళ విభాగం ఆధ్వర్యంలో గిద్దలూరులో మంగళవారం రాత్రి వివిధ మతాల మహిళల కోసం ప్రత్యేక ఇఫ్తార్‌విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. మత సామరస్యాన్ని ప్రోత్సహిస్తూ విభిన్న వర్గాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించేందుకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేసిన జేఐహెచ్ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీజే సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ ఖదీర్, విశ్వభారతి పాఠశాల ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, సంస్థ ప్రతినిధులు ముంతాజ్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సిల్ సభ్యురాలికి సన్మానం

పొదిలి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికైన డాక్టర్ స్వర్ణగీతను షిరిడి సాయిబాబా సేవాసంఘం నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్‌గా, ఫుడ్‌కమిషన్ సభ్యురాలిగా, ఉన్నప్పటి నుంచి పొదిలి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమెపై నమ్మకంతో నియమించిన బాధ్యతకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు.

నేడు కొమరోలులో ఎమ్మెల్యే ప్రజాదర్బార్

కొమరోలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసమస్యలపై ప్రజాదర్బార్ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డిలు తెలిపారు. ఈ ప్రజాదర్బార్‌లో మండలస్థాయి, గ్రామస్థాయి సమస్యలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి అర్జీల రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. మండలంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యాక్రమాన్ని అధికారులు విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యాక్రమం అనంతరం మద్యాహ్నం 2గంటలకు కొమరోలులోని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్వగృహంలో మండల టీడీపీ నాయకులు, కార్యాకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి నవోదయలో సీటు



సీటు సాధించిన షారిక్

మార్కాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడపాడు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న షేక్ షారిక్ (హాల్ టికెట్ నెంబర్ 1058315) మంగళవారం విడుదల చేసిన నవోదయ ఫలితాలలో జవహర్ నవోదయ విద్యాలయం-2 కలుజువ్వలపాడులో సీటు సాధించాడు. బోడపాడు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులు పి.శ్రీనివాసులు ఉచితంగా కోచింగ్ ఇచ్చి విద్యార్థి సీటు సాదించేందుకు కృషి చేశాడు. గత సంవత్సరంలో కూడా ఈ పాఠశాల విద్యార్థులు ఇద్దరు నవోదయ సీట్లు సాధించారు. ఉచితంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నవోదయ కోచింగ్ ఇచ్చి సీటు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు శ్రీనివాసులును, సీటు సాధించిన విద్యార్థి షేక్ షారిక్‌ను పలువురు అభినందించారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో

త్రిపురాంతకం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార పరిపతి సంఘం ఆధ్వర్యంలో త్రిపురంతకంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏవో కె.నీరజ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కంది పండించిన రైతులు తక్కువ ధరకు బయట దళారులకు అమ్ముకుని నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం కందులకు క్వింటాకు రూ. 7,550గా మద్దతు ధరను నిర్ణయించిందన్నారు. కందులలో తేమ శాతం 12, మట్టి పదార్థాలు 2 శాతం కల్తీ గింజలు 3 శాతం, పాక్షికంగా దెబ్బతిన్న రంగుమారిన గింజలు 4 శాతం, పురుగుపట్టిన గింజలు 4 శాతం కంటే తక్కువగా ఉండాలన్నారు. కిచెన్ గార్డున్, మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా అపరాల కొనుగోలు

పెద్దదోర్నాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మినుము, కందులు, శనగ, జొన్నలు కొనుగోలు చేస్తుందని రైతులు సద్వినియోగ పర్చుకోవాలని ఏవో జవహర్ లాల్ నాయక్ అన్నారు.మండలంలోని నల్లగుంట్ల, నల్లగుంట్ల బోడు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్టులో గిట్టుబాటు ధర లభించకపోతే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.మద్దతు ధర కోసం సీఎం ఏపీపీలో రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సీడబ్ల్యుఎస్ ఎన్‌జీవో సిబ్బంది పాల్గొన్నారు.

దర్శిలో నేడు ప్రజాదర్బార్

దర్శి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

దర్శి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం దర్శి పట్టణ, మండల టీడీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. దర్శి పట్టణం, మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి

దొనకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలని మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఆదాంషఫీకి వినతిపత్రం అందజేశారు. వివిధరకాల సర్వేలు, ఇంటి పన్నుల వసూళ్లు, చెత్తసంపద కేంద్రాల నిర్వాహణ, తదితర పనుల ఒత్తిడితో మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు శూన్యం

తాళ్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు గ్రామంలో కొర్రపాటివారిపాలెం వెళ్లే మార్గంలో ప్రభుత్వ గయాళ్ల భూమిలో ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కె.సంజీవరావు మంగళవారం ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు తహసీల్దార్‌లు మూడుసార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి పురోగతిలేదు. గ్రామంలోని సర్వేనంబరు 474లో 6.17 సెంట్ల విస్తీర్ణంలోని గయాలు భూమిలోని కొంత భాగాన్ని ఆక్రమించారు. పాములకాలీవాసుల ఫిర్యాదు చేయటంతో రెవెన్యూ అధికారులు ఆభూమిని పరిశీలించి ఆక్రమించినట్లు నిర్ధారించారు. భూమిని ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసినా స్పందించిన దాఖాలాలు లేవు. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం స్పందించి ఆక్రమణదారులపై చర్య లు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

పామూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపుతున్నట్టు చెప్పారు. పామూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల్లో క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

4న సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం

సీఎస్‌పురం(పామూరు) మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4న ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, గ్రామ సర్పంచ్‌లతోపాటు మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

వెలిగండ్ల, మార్చి 25 :(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్ఐ జిలాని బాషా యువతకు సూచించారు. మంగళవారం వెలిగండ్లలో బెట్టింగ్‌లతో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. రోజుకొక రకమైన బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. వీటి బారినపడిన యువకులు అప్పులుపాలు కావడమే కాకుండా చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు పాల్పడే అవకాశం ఉందన్నారు. మండలంలో బెట్టింగ్‌లపై నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో రైటర్ అచ్చిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

ముండ్లమూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చులో అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం మండలంలోని పోలవరం, ముండ్లమూరు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు పంట సాగు చేసే ముందు తమ పొలాన్ని భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వార ఏ పంట సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందో తెలుసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పునాదుల్లోనే కోల్డ్ స్టోరేజీ

- గత వైసీపీ పాలకుల అసమర్థతతో నిలిచిపోయిన పనులు
- కూటమి ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు

దర్శి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాల కోసం నిర్మించతలపెట్టిన కోల్డ్‌స్టోరేజీ ఏళ్ల తరబడి పునాదుల్లోనే నిలిచిపోయింది. వైసీపీ పాలకుల అసమర్థతో దర్శి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పథకాలు మధ్యలోనే ఆగిపోయాయి. కోల్డ్‌స్టోరేజీ నిర్మాణ పనులు కూడా ముందుకుసాగలేదు.

స్థానిక మార్కెట్ యార్డులో గత టీడీపీ హయాంలో 2018లో రూ.5 కోటతో కోల్డ్ స్టోరేజీ నిర్మాణాన్ని ప్రారంభించారు. పునాదులు నిర్మించేసరికి 2019లో ఎన్నికలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అభివృద్ధి పనులకు బ్రేక్ వేసింది. అందులోభాగంగా కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం కూడా ఐదేళ్లుగా అడుగు ముందుకు పడలేదు.

గత ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రైతుల్లో ఆశలు



పునాదుల్లోనే కోల్డ్ స్టోరేజీ నిర్మాణం

చిగురించాయి. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం కూడా ప్రారంభిస్తారని ఆశతో ఎదురుచూస్తున్నారు. దర్శి మార్కెట్ యార్డు నూతన కమిటీని త్వరలో ఎంపిక చేసే అవకాశం ఉంది. ఇప్పటికే చైర్మన్‌గా దర్శి పట్టణానికి చెందిన దారం నాగవేణిని ఖరారు చేస్తూ టీడీపీ అధిష్ఠానానికి పంపారు. నూతన కమిటీ ఏర్పాటుకాగానే కోల్డ్ స్టోరేజీ నిర్మాణం పనులు పునఃప్రారంభానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్డ్ స్టోరేజీ నిర్మాణం పూర్తి చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం నుంచి హామీ లభించటంతో త్వరలో నిధులు విడుదలవుతాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సీఎం చంద్రబాబు, సంబంధిత మంత్రులకు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టులకు నిధులు విడుదలయ్యాయి. ఈనేపథ్యంలో త్వరలో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి నిధులు విడుదలయ్యే అవకాశంఉంది. ఈప్రాజెక్టు పూర్తయితే దర్శి నియోజకవర్గంలో రైతులు పండించిన మిర్చి, కూరగాయులు, పండ్లు నిల్వ చేసుకొనే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం గుంటూరు మార్కెట్ యార్డుకు తరలిస్తున్న రైతులు ఇక్కడే నిల్వ చేసుకొని మార్కెట్‌లో మద్దతు ధర లభించినప్పుడు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది.

ప్రజాప్రతినిధులను గౌరవించరా..!

- అధికారులపై ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఆగ్రహం

తాళ్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల గురించి గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు ఎందుకు తెలపడంలేదని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్రజాప్రతినిధులను గౌరవించలేని అధికారులు ఈ మండలంలో పని చేయనక్కర్లేదని తెలిపారు. పథకాల గురించి ముందుగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలిపి వారి సహకారంతో లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా గ్రామస్థాయి అధికారులు ఎంపీటీసీలతో సంప్రదించి అవసరమైచోట బోర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే తక్షణమే మండల పరిషత్ నిధుల నుంచి నిధులు మంజూరుచేస్తామని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు ఏపని మీద వెళ్లారో మూమెట్ రిజిస్టర్‌లో రాసివెళ్లేలా చూడాలని ఎంపీడీవోకు సూచించారు.

జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో పనులు ఆలస్యంగా జరుగుతున్నందున రైతు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొర్రపాటివారిపాలెం సర్పంచ్ కె.శ్రీదేవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వం నిధులతో వేసిన బోర్లను కొందరు సొంతానికి వాడుకుంటున్నారని అన్నారు. విఠలాపురం సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ పనులల్లో సర్పంచ్‌లకు తెలియకుండా పనులు చేస్తుండటంతో



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

మందకొడిగా సాగుతున్నాయన్నారు.

సమావేశంలో ఎంపీడీవో దారా హనుమంతరావు, తహసీల్దార్ సంజీవరావు, సీడీపీవో భారతి, పశువైద్యాధికారులు ప్రతాప్‌రెడ్డి, రాంబాబు, వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, వైద్యాధికారులు ఖాదర్‌మస్తాన్‌బీ, మౌనిక, ఏఈలు హనుమంతరావు, వాలి, ఎంఈవోలు సుబ్బయ్య, సుధాకర్‌రావు, ఏపీవో మురళి, ఎల్ఐ శ్రీను, పలుశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

- సీఐ ఖాజావలి

కనిగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శక్తియాప్‌తో మహిళలకు భద్రత, రక్షణ ఏర్పడుతుందని సీఐ ఖాజావలి అన్నారు. పట్టణంలోని ఎంఎస్ఎం కళాశాలలో మంగళవారం విద్యార్థినులకు, మహిళలకు అవగాహన కల్పించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు ఆపద సమయాల్లో రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం శక్తి యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ఈయాప్ ద్వారా మహిళలకు రక్షణ కల్పించేందుకు ఆయా ప్రాంతాలకు అనతికాలంలోనే పోలీసులు చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. మహిళలు తమను తాము కాపాడుకునేందుకు ప్రభుత్వం తెచ్చిన శక్తి యాప్ రక్షణ కవచం వంటిదన్నారు. ఈయాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కడంతో పాటు ఫోన్ను గట్టిగా అటూ ఇటూ కదపటం ద్వారా ఆపదలో ఉన్న మహిళ యొక్క లోకేషన్ సంబంధిత శక్తి కాల్ సెంటర్‌కు చేరుతుందన్నారు. దీంతో ఆప్రాంతంలోని పోలీస్‌స్టేషన్ ద్వారా తక్షణ సహాయం అందుతుందని చెప్పారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ ఖాజావలి

కార్యక్రమంలో సీడీపీవో సరోజిని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జరీనా, పార్వతమ్మ, మల్లీశ్వరి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి అల్లాడుతున్న ప్రజలు

- నెలరోజులుగా ఆరు గ్రామాలకు సరఫరా కాని వైనం
- పట్టించుకోని అధికారులు
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

దొనకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తాగునీటికి ప్రజలు అల్లాడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ అధ్యక్షత వహించారు. వైఎస్ ఎంపీపీ మిట్లా కోటిరెడ్డి మాట్లాడుతూ కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాలకు దాదాపు నెలరోజులుగా సాగర్ జలాలు సరఫరా జరగడం లేదన్నారు మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారుల నిర్లక్ష్యపు తీరుతో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సిద్దాయిపాలెం ఎంపీటీసీ సభ్యుడు అంటో నీబాబు మాట్లాడుతూ ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేవారు సాగర్ నీటిసరఫరా జరగకుండా ఆటంకం కల్గిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. దొనకొండ పంచాయతీలోని బేతేల్‌పురంలోని రెండు డీప్‌బోర్లు సక్రమంగా పనిచేయటంలేదని ఎంపీటీసీ సభ్యురాలు జి.అమ్మాజీ పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ పైప్‌లైన్ మరమ్మతులతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడిందన్నారు. రెండురోజుల్లో నీటి సరఫరా చేస్తామన్నారు.

ఎంపీపీ ఉషామురళీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఆదాం షఫీ, జడ్పీటీసీ ఎం.సుధాకర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల బాధ్యత కార్యదర్శులదే!

- డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు

పామూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యత కార్యదర్శులదేనని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. స్థానిక తయారీ కేంద్రంలో గత నాలుగు రోజులుగా పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం వెలిగండ్ల మండల పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రలకు జరిగిన శిక్షణలో డీపీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిరోజు క్లాప్ మిత్రలు రిక్షా బండిద్వారా ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని సూచించారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రంలో గ్రేడింగ్ చేసి వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో వీటిని ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో పామూరు, వెలిగండ్ల ఈవోపీఆర్డీలు జీవీ అరవిందారెడ్డి, అన్నమ్మ, డీఆర్పీ రాఘవులు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, పామూరు పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

దొనకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దొనకొండ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై మంగళవారం కనిగిరి డివిజన్ డీఎల్‌పీవో ఎన్‌వీఎల్ హనుమంతరావు విచారణ చేపట్టారు. ముందుగా గ్రామ కార్యదర్శిగా ఐదు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తికి, గతంలో ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన డేవిడ్ రికార్డులు అప్పగించని విషయమై ఇరువురితో చర్చించారు. వెంటనే రికార్డులు అప్పగించాలని డేవిడ్‌ను ఆదేశించారు. సర్పంచ్ పాలనాపరమైన విషయాల్లో సహకరించటం లేదని దీంతో సమావేశం నిర్వహించలేక పోయామని కార్యదర్శి డీఎల్‌పీవో దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ గ్రేస్ రత్నకుమారి అందుబాటులో లేకపోవటంతో ఆమె భర్తను కార్యాలయానికి పిలిపించి పరిపాలనా వ్యవహారాల్లో సర్పంచ్ జోక్యం చేసుకోకూడదని తెలిపారు. ఎన్ని గొడవలు ఉన్నా జనరల్‌బాడీ సమావేశం జరిపించాలని ఆదేశించారు. సర్పంచ్, గ్రామ కార్యదర్శి సమన్వయంతో పంచాయతీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. అనంతరం డీఎల్‌పీవో హనుమంతరావు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు తాను విచారణకు వచ్చినట్టు చెప్పారు. కార్యాలయానికి చెందిన రికార్డులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామన్నారు.

డీఎస్పీకి ఘన సన్మానం

దర్శి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ రాష్ట్రస్థాయి ఉగాది ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైన సందర్భంగా పోలీసులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో సీఐ వై.రామారావు, ఎస్ఐ ఎం.మురళి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది డీఎస్పీ లక్ష్మీనారాయణకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు.

లైంగిక దాడి కేసులో వ్యక్తి అరెస్టు

కనిగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ టి.శ్రీరాం మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓగ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి అనే వ్యక్తి ఆగ్రామంలోని 13ఏళ్ళ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాలిక తల్లి వాంగ్మూలం ఆధారంగా నిందితుడిని అరెస్టు చేసినట్టు చెప్పారు. డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ మద్దతు ధరకు కందులను విక్రయించుకోవాలి

పామూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధరలకు కందులను విక్రయించుకోవాలని ఏవో కె.రాధ తెలిపారు. మంగళవారం మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి గ్రామాలలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ వగ్గంపల్లి గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. ప్రభుత్వం కందులకు కింటా రూ. 7550 మద్దతు ధర ప్రకటించిందని చెప్పారు. శనగ కింటా రూ.5,450 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు వి.అభిషేక్, పి.శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండలం చింతపూడు, పెదరాజుపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో బి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కందులు, శనగ పంటలు విక్రయించిన నాలుగు రోజుల్లోనే రైతు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు.

పీసీపల్లిలో.. పీసీపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు కందులను విక్రయించాలని కనిగిరి ఏడీఏ వెంకటరమణ అన్నారు. మండలంలోని ముద్దపాడు, తలకొండపాడు గ్రామాల్లో ఏవో ప్రకాశరావుతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా తలకొండపాడులో రైతులతో జరిగిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7,550కు కందులను విక్రయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద ఏర్పాటుచేసిన కేంద్రాలలో కందులను అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో.. కనిగిరి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి కందులను విక్రయించి నష్టపోవద్దని ఏవో జ్యోష్నాదేవి రైతులకు సూచించారు మంగళవారం మండలంలోని బడుగులేరు గ్రామంలో రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కందులు క్వింటా రూ.7550 మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవాలి

దర్శి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు సూచించారు. దర్శి పట్టణంలోని 3వ వార్డులో మంగళవారం ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ చేశారు. ఆర్ఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ఈకార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఇటీవల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించినట్టు చెప్పారు. పట్టణాల్లో సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపడుతన్నట్లు తెలిపారు. భూములు, స్థలాల పెండింగ్ సమస్యలను తమ దృష్టికి తీసుకోస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, వీఆర్వోలు మాదాసు మురళీ, ఆర్.శ్రీనివాసరావు, సుధాకర్, పున్నారావు, కౌన్సిలర్ ఇత్తడి దినకర్, తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలపై ఉపాధ్యాయుల హర్షం

దర్శి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ నిధులను విడుదల చేయటం పట్ల యూటీఎఫ్ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఆసంఘం జిల్లా కార్యదర్శి మీనగ శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పీఎఫ్ రూపంలో, ఏపీజీఎల్ఐ రూపంలో దాచుకున్న సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా ఇతర అవసరాలకు వినియోగించిందన్నారు. ఎంతో పోరాటం చేసినప్పటికీ తమ ఖాతాల్లోకి మళ్లీంచకుండా వైసీపీ పాలకులు నిర్లక్ష్యవైఖరి అవలంబించారన్నారు. గత ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రెండు నెలల క్రితం రూ. 1200 కోట్లు, ఇప్పుడు రూ.6200 కోట్లు విడుదల చేయటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాల్లో ఆనందం నెలకొందన్నారు. అలాగుచ సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పి.ఖాశీం, సహ అధ్యక్షుడు ఏ.రామారావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు తుమ్మల చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

తాళ్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు పాఠకుల మెంబర్‌షిప్‌ను పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. మంగళవారం తాళ్లూరు శాఖ గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలుగా ఉన్నాయన్నారు. ఎక్కువ మందిపాఠకులు గ్రంథాలయాలను వినియోగించుకునేలా చూడాలన్నారు. గ్రామపంచాయతీల నుంచి వచ్చే సెస్ బకాయిలను వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు వి.విజయకుమారి పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కురిచేడు శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సభ్యత్వాలను పెంచాలని గ్రంథపాలకురాలికి సూచించారు పాఠకులు గ్రంథాలయానికి నిత్యం వచ్చేలా వారిని చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు సుమతి పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

కనిగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రవేశ పరీక్షల్లో బోదిధర్మ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ రవీంద్ర మంగళవారం తెలిపారు. ఈఏడాది ప్రారంభించిన నవోదయ కోచింగ్ సెంటర్‌లో తర్ఫీదు పొంది, రెక్కల ధాన్యశ్రీ, జంగా హవీష్‌నందన్, మేడగం చైత్రిసీలు ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు హాజరై అర్హత సాధించారని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ రవీంద్ర, ప్రిన్సిపాల్ టి.జ్యోతి, గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.

కురిచేడు: నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి బోదనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముత్తకూరి వెంకటసాయి ఎంపికయ్యారు. 6వ తరగతిలో అతను చేరనున్నట్లు ఎంఈవో వస్రాం నాయక్ తెలిపారు.

మాదకద్రవ్యాలు సేవించి జీవితాల్ని కోల్పోవద్దు!

కనిగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలజోలికి సేవించి జీవితాల్ని కోల్పోవద్దని ఎస్ఐ టి.శ్రీరాం అన్నారు. పట్టణంలోని ఆల్ఫా డిగ్రీ కాలేజిలో మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు బానిసలై పెడత్రోవ పడుతున్నారన్నారు. మాదకద్రవాలను నిర్మూలించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, డీవైఎఫ్ఐ నాయకులు నారాయణ, శ్రీను, ఎస్ఎఫ్ఐ నాయకుడు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పామూరులో చోరీ

పామూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం పామూరులో చోటుచేసుకుంది. పట్టణంలోని రాచూరివారి వీధిలో ఉంటున్న రాచూరి మీనా పట్టణంలోని ఓప్రైవేట్ విద్యాసంస్థలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఇంటికి తాళం వేసి బ్యాంకుకు వెళ్లారు. పని ముగించుకొని ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడవేసి ఉన్నాయి. అందులో ఉన్న మూడు సవర్ల బంగారం వస్తువులు, కేజి వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేయగా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీబీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉమాకాంత్ ఎన్నిక

కనిగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య(ఏపీబీఎస్) రాష్ట్ర కార్యదర్శిగా కనిగిరికి చెందిన మారెళ్ళ ఉమాకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. కనిగిరి బ్రాహ్మణ సంఘానికి రెండు పర్యాయాలు ప్రధానకార్యదర్శిగా ఉమాకాంత్ అత్యుత్తమ సేవలు అందించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు పరసు గోపి, మతుకుమల్లి భాస్కర్, మనోహర్, వంశీకృష్ణశర్మ, సింగరాజు నరసింహారావు, మారెళ్ళ మధు, మాలకొండేశ్వరరావు, సింగంపల్లి ఫణి, హనమంతరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్'


● కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్(కేర్)' పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా, ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.

నాటి హామీ.. నేడు అమలు

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆంధ్రజ్యోతి వినూత్నంగాచేపట్టిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. ఏళ్లుగా అపరిష్కృతంగా సమస్యలపై ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు గళం వినిపించగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాటి పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నారు.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



జనవరి 28న వినుకొండ మున్సిపల్ పరిధిలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లో ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వీధివీధినా పర్యటించగా స్థానికులు తామెదుర్కొంటున్న సమస్యలను వివరించి, అర్జీలను కూడా ఇచ్చారు. ఆ సమయంలో ఆయన ఆయా సమస్యలపై స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. నాడిచ్చిన హామీ మేరకు ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులను మంజూరు చేయించి మంగళవారం వాటికి శంకుస్థాపనలు కూడా చేశారు. ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ జీవీని సత్కరించారు. రూ.62.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు.. మురుగు కాల్వల నిర్మాణ పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు.





వినుకొండలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లోని సీసీ రోడ్డు, మురుగు కాల్వ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్



జీవీ ఆంజనేయులను సత్కరిస్తున్న కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు, స్థానికులు

- అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా పనులకు శంకుస్థాపనలు
- వినుకొండ మున్సిపాల్టీలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లకు మహర్దశ
- ఆంధ్రజ్యోతి వేదికగా సమస్యలపై ప్రజాగళం.. పరిష్కారానికి మార్గం సుగుమం
- రూ.62.60 లక్షలతో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన
- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులను సత్కరించిన కాలనీ వాసులు

వినుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆంధ్రజ్యోతి గొంతుకగా మారేందుకు అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజల వద్దకే తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించే క్రమంలో జనవరి 28న వినుకొండ మున్సిపాల్టీలోని 23, 31 వార్డుల్లో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా.. కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆంధ్రజ్యోతి వేదికగా గాయత్రినగర్.. కొట్నాల్ల వీధిలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరు కాగా ప్రజలు సమస్యలను తెలియజేసి అర్జీలను అందజేశారు. నాడు హామీ ఇచ్చినట్లుగా ఆయా సమస్యల పరిష్కారానికి జీవీ నేడు నడుంకట్టారు. ఆయా కాలనీల్లో రూ.62.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్యక్రమం ద్వారా తమ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రగతి పనులకు శంకుస్థాపన చేసిన జీవీకి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం : జీవీ

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వినుకొండ (మిగతా 6వ పేజీలో)

రూ.17.60 లక్షలతో కొట్నాల్లవీధిలో పనులు

పేద ముస్లిం మైనార్టీ వర్గాలు నివసించే కొట్నాల్లవీధి ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదు. తాగునీటి పైప లైన్ కోసం సిమెంట్ రోడ్డు పగలగొట్టి వదిలేశారు. మురుగు కాల్వలు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ఆయా సమస్యలను ఆంధ్రజ్యోతి వేదికగా జీవీకి వారు గతంలో తెలిపారు. ఆ వీధిలో పర్యటించిన జీవీ ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన జీవీ కొట్నాల్లవీధి అభివృద్ధికి బాటలు వేశారు. రూ.17.60 లక్షలతో ఆ ప్రాంతవాసులు కోరిన ప్రగతి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజల సమక్షంలోనే వారడిగిన పనులకు శంకుస్థాపన చేశారు.

గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో వసతులు

కొత్తగా ఏర్పాటైన గాయత్రినగర్‌లో గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదు. అంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జీవీ వీధివీధిలో పర్యటించారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేసి తమ ఇబ్బందులను తెలిపారు. నగర్ కాల్వకట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్డు.. మురుగు కాల్వలు, ఎన్ఎస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. మరో వీధిలో రోడ్డు, డ్రెయిన్, తాగునీటి పైపులైన్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ రోజు ఇచ్చిన హామీ మేరకు జీవీ మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయా పనులకు శంకుస్థాపనలు చేశారు. తాగునీటి సమస్యలను పరిష్కరిస్తానని తాజాగా హామీ ఇచ్చారు.

పరీక్షల వేళ.. పెరిగిన కోతలు

- విద్యుత్ సరఫరాలో అంతరాయాలు
- గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన వైనం
- పరికరాల కొరత అంటున్న సిబ్బంది

ఎప్పుడు అంత రాయాలు వస్తాయో తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అసలే పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు , మరో వైపు మండుతోన్న ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవు తుంటే మరో వైపు విద్యుత్ కోతలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి.

ఎండలు మండుతోన్న కొద్ది విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లో మినహా మండల, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువవుతున్నాయి. పగటి పూటే అధికం గా విద్యుత్ అంతరాయాలుంటున్నాయి. ఇక రాత్రి సమయాల్లో

గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు సర్కిల్ తెనాలి డివిజన్‌లోని పలు సెక్షన్‌లోనూ విద్యుత్ అంతరాయాలు నెలకొంటున్నాయి. ఇక బాపట్ల సర్కిల్ పరిధిలోని బాపట్ల డివిజన్‌లో కర్లపాలెంలోని నందిరాజుతోట, యాజిలి, నల్లమోతు వారి పాలెం, కంకటపాలెం, పీవీపాలెం, అమృతలూరు, వేమూరు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఉంటు న్నట్లు సమాచారం. ఇక పల్నాడు జిల్లా సర్కిల్ పరిధి లోనూ రాజుపాలెం, నాదెండ్ల, దుర్గి, కారంపూడి ఆయా ప్రాంతాల సెక్షన్‌ల పరిధిలో కూడా విద్యుత్ అంతరా యాలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్నాయి. రాజుపాలెం మండలం ఇనుమెట్ల గ్రామంలో అయితే కొన్ని సార్లు పగలంతా విద్యుత్ సరఫరా (మిగతా 6వ పేజీలో)

లక్ష్యాలపై.. మార్గనిర్దేశం

- కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న వెంకటమురళి
- జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై నేడు పీపీటీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వెలగపూడిలోని సచివాలయం వేదికగా జరుగుతున్న కలెక్టర్ల సదస్సుకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి హాజరయ్యారు. మంగళ, బుధ రెండు రోజుల పాటు తలపెట్టిన ఈ సదస్సులో ప్రభుత్వ ప్రాథమ్యాలతో పాటు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను కూడా చేర్చారు. తొలి రోజు మంగళవారం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంపద సృష్టిపై దృష్టి పెట్టి ఆదాయ మార్గాలను పెంచాలని మార్గనిర్దేశం చేశారు. ఆయా విభాగాలకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా కలెక్టర్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సదస్సులో సూచించారు. శాంతిభద్రతలకు సంబంధించి జరిపిన సమీక్షలో కలెక్టర్ వెంకటమురళితో కలిసి ఎస్పీ తుషార్‌డూడీ పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో పాటు పలు అంశాలపై కలెక్టర్ బుధవారం నివేదించనున్నారు. జిల్లాలో సాధించిన పురోగతితో పాటు, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలు, పర్యాటక, పారిశ్రామిక రంగాలలో తీసుకోవాల్సిన చర్యలతో కూడిన వివరాలను పీపీటీ రూపంలో కలెక్టర్ వివరించనున్నట్లు సమాచారం

ఎస్పీ తుషార్ డూడీకి సీఎం అభినందనలు

ప్రభుత్వ పథకాలను ఎరగా వేసి ఆన్‌లైన్‌లో దోపిడీకి పాల్పడుతున్న అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్లు ముగ్గురిని చీరాల టుటౌన్ పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరిలో అరెస్టు చేసిన వైనంపై ఎస్పీ తుషార్‌డూడీని కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కేసును ఎస్పీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఛేదించారు. చుండూరు మండలం వేటపాలేనికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడ్ని బెదిరించి రూ.74 లక్షల సైబర్ మోసం కేసులో కూడా నిందితులను రోజుల వ్యవధిలోనే అరెస్టు చేయగలిగారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఎస్పీల సమీక్షలో ఈ రెండు సైబర్ కేసుల అంశం చర్చకు రావడంతో వాటిని ఛేదించిన తీరుతెన్నులను ఎస్పీ తుషార్ డూడీ సదస్సులో వివరించారు. సైబర్ నేరాల నిగ్గు తేల్చడంలో ఈ రెండు కేసులను రాష్ట్రస్థాయిలో కేస్ స్టడీస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు.



సదస్సులో పాల్గొన్న ఎస్పీ తుషార్ డూడీ, కలెక్టర్ వెంకటమురళి

స్థానిక సంస్థల్లో ఖాళీలకు రేపు ఎన్నిక

నాలుగు ఉప సర్పంచ్, ఓ ఎంపీపీ, కో ఆప్టెడ్ స్థానానికీ..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వివిధ కారణాలతో స్థానిక సంస్థల్లో ఏర్పడిన ఖాళీల భర్తీలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 20 ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా జిల్లాలో నాలుగు ఉప సర్పంచుల స్థానాలతో పాటు ఓ ఎంపీపీ, కో ఆప్టెడ్ సభ్యుడి ఎన్నిక గురువారం ఆయా కార్యాలయాలే వేదికగా జరగనుంది. ఎన్నికను చేతులెత్తే విధానంతో జరిపి అదే రోజు మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం కూడా చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక వేళ కోరం లేక ఎన్నిక జరగని పక్షంలో మరుసటి రోజు జరపనున్నారు.

ఎన్నిక జరిగే స్థానాలివే...

పిట్టలవానిపాలెం మండలం ఎంపీపీ విషయంలో వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రెండున్నరేళ్ల పాటు పదవులు అనుభవించేలా ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం చందోలు --1 ఎంపీటీసీగా ఉన్న షేక్ బాజీ ఎంపీపీగా తొలి రెండున్నరేళ్లు పదవిని అనుభవించి దాదాపు ఏడాది క్రితమే రాజీనామా చేశారు. దీంతో ఉప ఎంపీపీగా ఉన్న పిట్టువారి పాలెం ఎంపీటీసీ దెందుకూరి సీతారామరాజు ఏడాది నుంచి ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నిక జరపాల్సి ఉండగా ఎంపీపీ స్థానాన్ని ఖాళీల జాబితాలో చేర్చిన ఈసీ ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా గురువారం ఎంపీపీని ఎంపీటీసీలు ఎన్నుకోవడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పిట్టలవాని పాలెం మండల పరిధిలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఒకరు గతంలోనే టీడీపీ బాట పట్టారు. సంఖ్యా పరంగా చూస్తే వైసీపీ ఎంపీపీ స్థానం చేజిక్కించుకునే అవకాశం ఉంది. ఎంపీపీ ఎన్నికలో ఎంపీటీసీల సహకారంపై వైసీపీలోనే అనుమానాలు ఉన్నాయి. భట్టిప్రోలు మండల పరిధిలో మొత్తం 14 మంది ఎంపీటీసీలు ఉండగా ఇక్కడ కో ఆప్టెడ్ సభ్యుడి ఎన్నిక జరగనుంది. రాజీనామాలు చేయడంతో జిల్లాలో నాలుగు గ్రామాల్లో ఉప సర్పంచుల స్థానాలు ఖాళీ అయ్యాయి. పెదపులివర్రు, చెరుకుపల్లి మండలంలోని తుమ్మలపాలెం, పర్చూరు మండలం తుమ్మలపాలెం, రేపల్లె మండలం పేటేరు గ్రామాల్లో ఉప సర్పంచుల స్థానాలకు గురువారం ఎన్నిక జరగనుంది.

కళకళలాడుతున్న అమరావతి



యంత్రాల సాయంతో ఆగర్లలోకి ఐరన్ బుట్టలను దించుతున్న దృశ్యం

- ఇతర రాష్ట్రాల నుంచి వలస వస్తున్న కూలీలు
- కూలీల కోసం ఏర్పాటవుతున్న తాత్కాలిక షెడ్లు
- భారీగా వస్తున్న యంత్రసామగ్రి

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉండేది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఈ ప్రాంతంలో ఆశలు చిగురించాయి. దానికి ఊతమిస్తూ, అరణ్యంలా మారిన అమరావతిలో వందలకొద్దీ ఎక్స్‌కవేటర్లతో చెట్లు, కంప తొలగింపు పనులను చాలా వరకు ప్రభుత్వం జరిపించింది. అయితే వెనువెంటనే రాజధాని నిర్మాణ పనులను మొదలుపెట్టడానికి ఎన్నో సమస్యలు, న్యాయపరమైన చిక్కుముడులు అడ్డొచ్చాయి. వాటన్నింటిని క్రమంగా ఛేదించుకుంటూ నిధులను సమకూర్చుకుంటూ.. నేడు ఏకంగా రమారమి రూ. 50వేల కోట్ల విలువైన నిర్మాణ పనులను మూకుమ్మడిగా చేపట్టి రాజధాని ప్రాంత వాసులను ఆనందడోలికల్లో ముంచెత్తుతున్నది. దీంతో, అమరావతి పాత, కొత్త వీధులు మళ్లీ జనసామర్థ్యంతో కిక్కిరిస్తున్నాయి. కొత్తకొత్త హోటళ్లు, టీ కొట్లు, బడ్డీ కొట్లు ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. రాజధాని నిర్మాణ పనుల్లో పాలుపంచుకునేందుకు వస్తున్న భారీ యంత్రసామగ్రితో అమరావతి హోరెత్తుతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న కూలీలతో అమరావతి మళ్లీ కళకళలాడుతోంది.

రాజధాని అమరావతిలో నిర్మాణపనులు చేయడానికి టెండర్లను దక్కించుకున్న బడా కాంట్రాక్టు సంస్థలు అప్పుడే కార్యరంగంలోకి దిగిపోయాయి. తామే ఏయే ప్రాజెక్టులను చేపట్టబోతున్నామో ఆయా ప్రాంతాల్లో ఆయా నిర్మాణాలకు సంబంధించిన భారీ యంత్ర పరికరాలను చేరవేసుకుంటున్నారు. ఇవన్నీ హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి దూరప్రాంతాల నుంచి ఇక్కడికి తరలివస్తున్నాయి. ఈ యంత్ర సామగ్రితో పాటుగా కూలీ పనులను చేసేందుకు ప్రతీ కాంట్రాక్టు సంస్థ ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది మందిని అమరావతికి రప్పిస్తున్నారు. వీరందరికీ పనిచేయాల్సిన ప్రాంతాలలో భారీ షెడ్లను ఏర్పాటుచేసి వారికి తాగునీరు, టాయ్‌లెట్లు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడికక్కడ రెడీమిక్స్ ప్లాంట్లు కూడా పెద్దఎత్తున ఏర్పాటవుతున్నాయి. ఇదిలా వుండగా రాజధాని అమరావతిలో ఏప్రిల్ మూడవ వారంలో జరుగనున్న ప్రధాని మోదీ సభ కోసం వచ్చే అతిథులను ఆకట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీడ్ యాక్సిస్‌తో పాటు ఇతర ప్రధాన వీధుల వెంబడి మొక్కలను నాటించే కార్యక్రమాన్ని చేపట్టింది.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ అర్హత పరీక్షా ఫలితాల విడుదల

పెదకాకాని, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో దూరవిద్య కేంద్రం ఈనెల 23న నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల అర్హత పరీక్షా ఫలితాలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ మాట్లాడుతూ ఎంబీఏ కోర్సుకు 285 మంది దరఖాస్తు చేసుకోగా 257 మంది అర్హత సాధించారని, ఎంసీఏ కోర్సుకు 57 మంది దరఖాస్తు చేసుకోగా 54 మంది అర్హత సాధించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా దూర విద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడు తూ పరీక్షల ఫలితాలను దూర విద్యా కేంద్రం వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు వివరించారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (బుధవారం సాయంత్రం)
సహారి : 4.51 (గురువారం ఉదయం)

ఆర్టీఈ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై న్యాయ వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు విద్యా సంస్థలు 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. వారికి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుంది.



నీటితో కళకళలాడుతున్న పర్చూరు మంచినీటి చెరువు

మంచినీటి చెరువులకు జలకళ

- ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- యుద్ధప్రాతిపదికన నీళ్లు నింపుతున్న అధికారులు

పర్చూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చెరువులను నింపేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా అధికారులతో ముందస్తు రివ్యూ కార్యక్రమం నిర్వహించి పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలలోని మంచినీటి చెరువులను నింపేవిధంగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో అందుబాటులో ఉన్న సాగర్ జలాలను మంచినీటి చెరువులకు మళ్లించేందుకు యద్ధప్రాతిపదికన అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సారథ్యంలో చెరువులను నింపుకునే విధంగా బాధ్యతలు అప్పగించారు. చెరువులను సాగర్ జలాలతో నింపుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టడంతో జలకళను సంతరించుకుంటున్నాయి. అందులో భాగంగా పర్చూరులోని రెండు మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో అధికారులు నింపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి నీటి ఎద్దడి నుంచి అధికమించామని ఊపిరి పీల్చుకుంటున్నారు.

వేసవిలో జాగ్రత్తలపై అవగాహన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీహెచ్‌సీ డాక్టర్ శరత్‌కుమార్

అద్దంకిటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వస్తునందున వేసవి తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి సీహెచ్‌సీ వైద్యుడు డీ శరత్‌కుమార్ అన్నారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై విశ్వకర్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేయించిన కరపత్రాన్ని డాక్టర్ శరత్‌కుమార్ మంగళవారం సీహెచ్‌సీలో ఆవిష్కరించారు. వేసవిలో జాగ్రత్తలపై అవగాహన కలిగించేలా కరపత్రాలు వేసిన ట్రస్ట్ వారిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.ప్రదీప్తి, ట్రస్ట్ అధ్యక్షుడు టి.రామకృష్ణ, ఉపాధ్యాక్షుడు కొండమూది ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, కోశాధికారి రావినూతల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గొలుసు దుకాణంపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న జీవరక్షనగర్ గ్రామస్థులు

వేటపాలెం(చీరాల), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నివాసాల మధ్య గొలుసు దుకాణం నిర్వహిస్తే ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతాయని అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ జీవరక్షనగర్ ప్రజలు అన్నారు. అనధికారంగా ఓవ్యక్తి గొలుసు దుకాణం నిర్వహిస్తున్నారని మంగళవారం వారు కొద్దిసేపు రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో నిర్వాహకుడు అక్కడ నుంచి వెళ్లిపోవడంతో ఆందోళన విరమించారు. మానికల శ్రీనివాసరావు, ఎస్‌కే లాల్, ఎం.పోలీసు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు ఎంపీపీ పదవులకు పరోక్ష ఎన్నికలు

- రెండు ఎంపీపీలు, ఒక ఉపాధ్యక్ష, కోఆప్షన్‌సభ్యుని పదవికి
- జిల్లాలో నాలుగు ఉపసర్పంచ్ పదవులకు కూడా ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్ర్యోతి): జిల్లాలో ఆకస్మికంగా ఖాళీలు ఏర్పడిన అధ్యక్ష స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసింది. దీంతో తదనుగుణంగా జిల్లాలో ఎన్నికలు నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 27న ఈ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మార్కాపురం, త్రిపురాంతకం మండలాల అధ్యక్ష పదవులు, పుల్లలచెరువు మండలంలో ఉపాధ్యక్ష పదవికి, పైపాలెం మండలంలో కోఆప్షన్ మెంబరు పదవికి ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను గురువారం ఉదయం పరోక్ష పద్ధతిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. అందుకోసం ఆయా మండలకేంద్రాల్లో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ఆయా మండలాలకు జిల్లాస్థాయి అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించారు.

నాలుగు ఉపసర్పంచ్ పదవులకు ..

జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు ఉప సర్పంచ్ ఎన్నికల పదవులకు ఈనెల 27న పరోక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ముందుగా జిల్లాలో ఎనిమిది ఉప సర్పంచ్ పదవులు ఖాళీగా ఉండటంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. అయితే నాలుగు పంచాయతీల్లో వార్డు పదవులు ఖాళీగా ఉండటంతో అక్కడ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిలుపుదల చేసింది. మిగిలిన నాలుగు పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. కొండపి మండలం పెరిదేపి, కంభం మండలం తురిమెళ్ల, టంగుటూరు మండలం ఆలకూరపాడు, త్రిపురాంతకం మండలం మిట్టపాలెంలో ఉపసర్పంచ్ ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించారు. వార్డుసభ్యుల పదవి ఖాళీగా ఉన్న నాగన్నపాలెం, నాగంపల్లి, బేస్తవారపేట, టంగుటూరు పంచాయతీల ఉప సర్పంచ్ ఎన్నికలు నిలుపుదల చేశారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

పామూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపుతున్నట్టు చెప్పారు. సర్కిల్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల్లో క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దైవాలరావూరులో వేగంగా రీ-సర్వే

తొలగనున్న గట్టు వివాదాలు



దైవాలరావూరులో జరుగుతున్న రీ-సర్వేలో పాల్గొన్న రైతులు

మేదరమెట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. అందులో భాగంగా కొరిశపాడు మండలంలోని దైవాలరావూరులో రీసర్వేని ప్రారంభించారు. గ్రామాన్ని నాలుగు భాగాలుగా విభజించి సర్వే నెంబర్లవారీగా రైతుల సమక్షంలో గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహించారు. ఒక్కొక్క టీంలో వీఆర్వో, సర్వేయర్, వీఆర్‌ఏలు ఉన్నారు. వీరు ఆయా సర్వే నెంబర్లలో గట్ల వారీగా రైతుల పొలాలను గుర్తించి కంప్యూటర్‌లో మార్కింగ్‌ను నమోదు చేసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక రెవెన్యూ రికార్డుల్లో ఆయా సర్వే నెంబర్లలో ఎంత విస్తీర్ణం ఉన్నది పరిశీలించి, వారి సాగుబడిలో ఆయా సర్వే నెంబర్లలో ఉన్న విస్తీర్ణాన్ని సరిచూస్తున్నారు. సర్వే నంబర్లో ఉన్న రైతులందరినీ పిలిచి వారి సమక్షంలో ఎక్కువ తక్కువలను సరిచేసి విస్తీర్ణాన్ని నిర్ణయిస్తున్నారు. ఒక్కో టీం రోజుకు 5, 6 సర్వే నంబర్లలోని రైతులకు సమాచారం ఇచ్చి పిలుస్తున్నారు. రైతులు పూర్తిగా హాజరు కాకపోవడం, కొన్ని సర్వే నంబర్లలో విస్తీర్ణం తేడాలు రావడంతో రైతులను కూర్చోబెట్టి వివరించడంతో కొంత ఎక్కువ సమయం పడుతుంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక డీఎల్‌ఆర్ తయారు చేయనున్నారు. అప్పుడు రైతులకు సర్వే నంబర్ల వారీ హద్దు రాళ్లు వేయనున్నారు.

కొంత ఎక్కువ సమయం పట్టినా రైతులను భాగస్వాములను చేసి రికార్డులు తయారు చేయడం వల్ల భవిష్యత్‌లో భూమి సంబంధ విషయాలలో వివాదాలకు తావుండదు. గత ప్రభుత్వం రీసర్వే టీంలకు అధికారులు లక్ష్యాలు నిర్ణయించి ఒత్తిడి చేయడంతో ఎక్కువ తప్పులు దొర్లి రైతులకు సమస్యలు ఎక్కువయ్యాయి. ఇప్పుడైనా ఉన్నతాధికారులు రీసర్వే టీంలకు సమయం ఇచ్చి తప్పులు దొర్లకుండా రికార్డులు రూపొందిస్తే భవిష్యత్తులో గట్టు సమస్యలు, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభించినట్లే.

హడావుడిగా రీసర్వే చేయొద్దు



ఉన్నతాదికారులు హడావుడి చేయడం వలన రీసర్వేలో తప్పులు దొర్లే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో రీసర్వే హడావుడిగా చేయడం వలన రైతులు ఇప్పటికి కూడా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాదికారులు కూడా గ్రామాలకు వచ్చి రీసర్వేలో రైతుల సమస్యలను తెలుసుకోవాలి.

- ముమ్మన నరసింహారావు, రైతు

రైతుల సమక్షంలోనే జరగాలి



రైతుల సమక్షంలో రీసర్వే చేయడం వలన భవిష్యత్‌లో సమస్యలు రావు. అధికారులు పిలిచిన రోజే కొందరు రైతులు రాలేకపోవచ్చు. సమయమిచ్చి రైతుల వద్ద సమగ్ర సమాచారం, వారి వద్ద ఉన్న భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను తీసుకోవాలి. రైతులను కూర్చోబెట్టి సమన్వయం చేసి తుది నిర్ణయం తీసుకోవాలి. భవిష్యత్‌లో ఇప్పుడు చేసే రీసర్వేతో రైతులు సమస్యలు తొలగిపోవాలి.

- బాచిన బాలకోటయ్య, రైతు

ప్రధాన డ్రైన్‌లలో పేరుకున్న పూడిక

దుర్వాసనతో పలు కాలనీ ప్రజల ఇక్కట్లు



అద్దంకి పట్టణంలోని గుంజివారిపాలెం వద్ద మెయిన్ డ్రైన్‌లో పూడిక

అద్దంకి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని పలు ప్రధాన డ్రైన్‌లలో పూడిక పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతూ ఆయా కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా నామ్ రోడ్డులోని ఎస్‌బీఐ (ఏడీబీ) నుంచి ప్రారంభమయ్యే మెయిన్ డ్రైన్ పూడిక తీత గత ఏడాది కొంత మేర తీసినప్పటికీ గుంజివారిపాలెం సమీపంలో, కట్టకిందపాలెం సమీపంలో వాగులను తలపించేలా ఉన్న మురుకు కాలువలో పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయింది. అదే సమయంలో శ్రీనగర్ నుంచి ప్రారంభమయ్యే డ్రైన్‌లో కూడా గతంలో కొంత మేర పూడిక తీసినప్పటికీ సాయిబాబా గుడి ప్రాంతం నుంచి గుంజివారిపాలెం వరకు పూడిక పెద్ద ఎత్తున పేరుకుపోయింది. అద్దంకి పట్టణంలోని సైడ్ డ్రైన్‌లలో వారంలో ఒక రోజు పూడిక తీస్తున్నప్పటికీ మెయిన్ డ్రైన్ లలో పూడిక తీత ప్రత్యేక సందర్భాలలో మాత్రమే చేపడుతున్నారు. కనీసం ఏడాదిలో రెండు, మూడు సార్లు అయినా పూడిక తీత చేపట్టేలా చర్యలు చేపడితేనే మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా సులువుగా ప్రవహించే వీలుంటుందని ఆయా కాలనీల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రధాన డ్రైన్‌లలో పూడిక పేరకు పోవడంతో కట్టకిందపాలెం, గుంజివారిపాలెం, నర్రావారిపాలెం, సాయిబాబా గుడి తదితర ప్రాంతాల ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మెయిన్ డ్రైన్‌లలో పూడిక తీసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



సాయిబాబా గుడి వెనుక డ్రైన్‌లో ఉన్న పూడిక

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం



ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

చినగంజాం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లులో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఏప్రిల్ 1వ తేదీన మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వస్తున్నారు. ఆయన పర్యటన విజయవంతం అయ్యేందుకు అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు అన్ని శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. హెలిపాడ్, బహిరంగసభ, అధికారులతో నిర్వహించే సభా స్థలాల్లో ఉన్న, గ్రామంలోని రోడ్ల వెంబడి ఉన్న చిల్ల చెట్లను ఎక్స్‌కవేటర్‌తో పీకిస్తున్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు త్రీవముగా కృషి చేస్తున్నారు. చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు, చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్, పలు శాఖలకు చెందిన ఉన్నాతాధికారులు తమ సిబ్బందికి పలు సూచనలు ఇస్తున్నారు. మూరుమూల గ్రామైన ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రావడంతో గ్రామస్థులు కూడా పూర్తి సహకారంతో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అందరూ సిద్ధమవుతున్నారు.

నాడు హామీ.. నేడు అమలు

(5వ పేజీ తరువాయి)

మున్సిపాల్టీలో అభివృద్ధిని గాలికొదిలేసిందని జీవీ ఆంజనేయులు ఆరోపించారు. నాడు టీడీపీ ప్రభుత్వం రూ.161 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా వైసీపీ వాటిని నిలివేసిందని విమర్శించారు. తాజాగా ఆ పతకాన్ని తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ పథకం పూర్తితో పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. 102.60 లక్షలతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ద్వారా ప్రజలు వారి సమస్యలు తన దృష్టికి తీసుకురాగా వాటిఇని పరిష్కారిస్తున్నామన్నారు. ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు కోరిన పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.3 కోట్లను విడుదల చేసిందని వాటితో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంతో ప్రజలకు ప్రజాప్రతినిధులు.. అధికారుల మధ్య అవినాభావ సంబంధం పెరుగుతుందన్నారు. సమస్యల్ని అధికారులు.. ప్రజా ప్రతినిధులు స్పష్టంగా అర్థం చేసుకోవడానికి.. వాటి పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమం చేపట్టిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చైర్మన్ వేమూరి రాధాకృష్ణకు ప్రత్యేక అభినందలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, నన్నేసా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్‌కుమార్, నాగ శ్రీను, నిశ్శంకర శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చర్యలు నిల్

- గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అడ్డగోలుగా డ్రా విచారణ పేరుతో జాప్యం

దర్శి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పలు పంచాయతీల్లోని నిధులను అడ్డగోలుగా మార్చుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఇష్టానుసారంగా వ్యవహరించారు. కొన్ని పంచాయతీల్లో ఎలాంటి పనులు చేయకుండా లక్షలాది రూపాయలు డ్రా చేశారు. ఇంజనీరింగ్ అధికారులు కిక్కురుమనకుండా బిల్లులు చేశారు. నిధులు గోల్‌మాల్ విషయాలు బయటకు రావటంతో కొన్ని గ్రామాల్లో స్థానిక నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. నిజాలు నిగ్గు తేల్చేందుకు విచారణ కమిటీ అధికారిని వేశారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మండలంలోని తూర్పువెంకటాపురం పంచాయతీలో రూ.25లక్షల నిధులు గోల్‌మాల్ అయ్యాయని ఆ గ్రామానికి చెందిన పలువురు నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పలుమార్లు ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో కనిగిరి డీఎల్‌పీవోను విచారణాధికారిగా నియమించారు. ఆ అధికారి విచారణ అడుగు ముందుకు పడలేదు.

ప్లాస్టిక్‌పై నిషేధం

పంచాయతీ ఆంక్షలు

పర్చూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం రోజురోజుకూ పెరిగిపోవడం, వాటి వ్యర్థాలను డ్రైనేజ్ కాలువల్లో వేయడంతో మురుగు నీరు ముందుకు కదలక సమస్యగా మారింది. దీంతో ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తూ పంచాయతీ ఆంక్షలు జారీ చేశారు. విచ్చల విడిగా ప్లాస్టిక్ వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయడంతో రోజుల తరబడి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారుతోంది. పారిశుధ్య కార్మికులు నిత్యం పారిశుధ్య కార్య క్రమాలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. ఈ తరుణంలో డ్రైనేజీ కాలువల్లో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు అనే వార్త ఇటీవల ఆంధ్రజ్యోతిలో వెలువడింది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఎక్కడైనా ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు విక్రయించే దుకాణదారులపై జరిమాన విధిస్తామని హెచ్చరిక చేశారు. పంచాయతీ అధికారులు తీసుకున్న ప్లాస్టిక్ నిషేధ నిర్ణయంపై ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యాధికారి తనిఖీలు



ప్రైవేటు ఆసుపత్రిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి విజయమ్మ

చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం చీరాల పరిధిలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో జిల్లా వైద్యాధికారిణి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయా వైద్యశాలల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, రికార్డులు పరిశీలించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ చేయరాదని సూచించారు. వైద్య సేవలు పారదర్శకంగా లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

పరీక్షల వేళ.. పెరిగిన కోతలు

(5వ పేజీ తరువాయి)

ఉండని పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎప్పుడు విద్యుత్ సరఫరా ఉంటుందో, పోతుందో తెలియని పరిస్థితులున్నాయి. సాంకేతిక కారణాలని అధికారులు పైకి చెప్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యుత్‌శాఖ వైఫల్యంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌ల పరిధిలో విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) పేరుతో రోజుల తరబడి పనులు చేస్తుండటం కూడా ప్రజల్లో అసహనం కలిగిస్తోంది. ప్రతి నెలలో రెండో శనివారం విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉదయం నుంచి మధ్యాహ్నం, కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ సిబ్బంది పనులు చేస్తున్నారు. అది చాలదన్నట్లు సాధారణ రోజుల్లోనూ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతోన్న వేసవితో గుంటూరు సర్కిల్ పరిధిలోని ఐదు మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరిగింది. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌లో దాదాపు 15 మిలియన్ యూనిట్లపైనే విద్యుత్ వినియోగం జరుగుతుంది. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ఉన్నప్పటికీ అంతరాయాలు రావటం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది.

స్టోర్స్‌లో పరికరాల్లేవంటూ విమర్శలు

విద్యుత్ లైన్‌లకు సంబంధించి 11 కేవీ తీగెలు, స్విచ్‌లు, ఎర్త్ వైర్లు, కండక్టర్‌లు, కేబుల్స్ వంటివి సెక్షన్ కార్యాలయాల పరిధిలో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సెక్షన్‌ల పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా పట్టించుకున్న నాధుడే ఉండటం లేదని సిబ్బంది వాపోతున్నారు. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వ పాపం ఇప్పుడు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌లలో ఒకరు మాత్రమే లైన్‌మెన్ ఉండటం కూడా విద్యుత్ అంతరాయాలకు కారణాలుగా చెబుతున్నారు.

డీఎస్పీకి ఘన సన్మానం

దర్శి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దర్శి డీఎస్పీ బీ లక్ష్మీనారాయణ రాష్ట్ర స్థాయి ఉగాది ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైన సందర్భంగా పోలీసులు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో సీఐ వై.రామారావు, ఎస్‌ఐ ఎం.మురళి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది డీఎస్పీ లక్ష్మీనారాయణను శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.

రక్షిత నీటి పథకాలకు మహర్దశ

- ఎన్నో దశాబ్దాల నుంచి నిరుపయోగం
- జలజీవన్ మిషన్ ద్వారా మరమ్మతులకు నిధులు
- బల్లికురవ మండలంలో 21 వర్కులకు రూ.8.50కోట్లు మంజూరు
- తాగునీటిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మంత్రి రవికుమార్ కృషితో అన్ని గ్రామాలలో ఇంటింటికీ కొళాయి నీరు ఇచ్చేలా ప్రణాళికలు

బల్లికురవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల నుంచి గ్రామాలలో కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన రక్షిత మంచి నీటి పథకాలు అలంకారంగా ఉన్నాయి. నిధుల లేమితో పథకాలు పనిచేయకుండానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి శుభ్రం చేసిన కొళాయి నీటిని అందించేలా అడుగులు పడుతున్నాయి. అందుకు గాను జలజీవన్ మిషన్ ద్వారా బల్లికురవ మండలానికి రూ.8.50కోట్లు మంజూరయ్యాయి. అర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇప్పటికే మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు గ్రామాలలో రక్షిత నీరు అందిచేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. టెండర్లు ఈ మాసంలో పూర్తి అయి ఏప్రిల్ నుంచి గ్రామాలలో పనులు ప్రారంభం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బల్లికురవ మండలంలో అత్యధిక గ్రామాలలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు ఉన్నాయి. గత కొన్నేళ్ల కిందట పలు గ్రామాలలో రక్షిత మంచి నీటి పథకాలు కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టిన అవి స్వల్ప మర్మమ్మతులతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రజలు తాగు నీరు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని గ్రామాలలో నిరుపయోగంగా మంచి నీటి పథకాలను వినియోగంలోకి తెచ్చేలా జలజీవన్ మిషన్‌లో రూ.8.50కోట్లను మంజూరు చేయించారు. ఈ నిధులతో గ్రామాలలో ఉన్న రక్షిత నీటి పథకాల పైపులైన్లు, ట్యాంకులు, ఇంటింటికీ కొళాయిలు వంటి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో అధికారులు పర్యటించి గ్రామాలలో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి పంపగా నిధులు మంజురయ్యాయి. బల్లికురవ మండలంలో 21 వర్కులకు టెండర్లు కూడా ఈ నెలలో జరగనున్నాయి. రానున్న నెలలో గ్రామాలలో రక్షిత నీటి పథకాల మరమ్మతులకు జలజీవన్ మిషన్ పథకంలో పనులు ప్రారంభం కానున్నాయి.


నిరుపయెగంగా ఉన్న బల్లికువరం ఓవర్ హెడ్ ట్యాంక్



రామాంజనేయపురంలో అలంకారంగా ఉన్న ట్యాంక్


వేమవరంలో ఫిల్టర్‌లు లేకుండానే ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

బల్లికురవ మండలానికి నిధులు మంజూరు

జలజీవన్ మిషన్ ద్వారా బల్లికురవ మండలంలో ఉన్న రక్షిత మంచి నీటి పథకాలను వినియెగంలోకి తెచ్చేలా ప్రభుత్వం రూ. 8.50కోట్ల నిధులను 21 వర్క్‌లకు కేటాయించింది. పెద అంబడిపూడికి రూ.25లక్షలు, సూరేపల్లికి రూ.18లక్షలు, వైదనకు 46 లక్షలు, వెలమవారిపాలెంకు రూ.51లక్షలు, వేమవరానికి రూ.57.5 లక్షలు, గుంటుపల్లికి రూ.18.9లక్షలు, కొండాయపాలెంకు రూ.21 లక్షలు, చెన్నుపల్లికి రూ.65లక్షలు, గొర్రెపాడుకు రూ.11.2 లక్షలు, జమ్మలమడకకు రూ.27లక్షలు, కె.రాజుపాలెంకు రూ.40 లక్షలు, కొమ్మినేనివారిపాలెంకు రూ.39.8లక్షలు, కొణిదెనకు రూ.52 లక్షలు, కొత్తూరుకు రూ.21 లక్షలు, కొప్పెరపాలెంకు రూ.1.8 కోట్లు, కూకట్లపల్లికి రూ.31లక్షలు, ముక్తేశ్వరానికి రూ.36లక్షలు, నక్కబొక్కలపాడుకు రూ.97లక్షల నిధు లు మంజూరయ్యాయి.


సద్ది, పొంగళ్లను ఊరేగింపుగా తీసుకొని వెళ్తున్న భక్తులు

పొలేరమ్మ అమ్మవారికి ఉగాది పూజలు

చినగంజాం, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం ఉగాది పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సద్ది, పొంగళ్ల తీసుకొని గ్రామ పురవీధులలో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లారు. ఆలయం వద్ద ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉగాది పర్వదినానికి ముందు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం అనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ పెద్దలు, కాపుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా భక్తులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జయగురుదత్త, శివదత్త క్షేత్రంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జయగురుదత్త, శివదత్త క్షేత్రంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొని ఉదయం సంప్రోక్షణ, అనంతరం శాంతి హోమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ వేకువజాము నుంచే భక్తులు పాల్గొని స్వామి నామాన్ని ఆలపించినట్లు చెప్పారు. ఈసందర్భంగా ప్రత్యేక అలంకరణలు నిర్వహించి, పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వాగు అభివృద్ధికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పర్చూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వాగు అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నట్లు డ్రైనేజీ అధికారులు తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వాగును కమ్మేసిన ముళ్ల పొదలు అనే శీర్షికలో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. వాగు అభివృద్ధికి తీసుకోకున్న చర్యలపై జిల్లా పౌరసంబంధ శాఖ అధికారికి వివరణ పంపారు. కారంచేడు - పర్చూరు మధ్య ముళ్ల చెట్లు తొలగించి, పూడిక తీసేందుకు రూ.37.3 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. పర్చూరు పరిధిలో ఉన్న ఉప్పుటూరు - పెద్దివారిపాలెం మధ్య భూసేకరణ సమస్య ఉన్నప్పటికీ పనులు చేసేందుకు రూ.81.3లక్షల నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రాంభించి పూర్తి స్థాయిలో వాగు అభివృద్ధికి చర్యలు చేపడతామని డ్రైనేజ్ ఏఈ ఎస్.రత్నశేఖర్ తెలియజేశారు.

ఖేలో ఇండియాలో ఈపూరుపాలెంవాసికి బెస్ట్ కోచ్ అవార్డ్


అవార్డును అందుకుంటున్న వేణు

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 21 -23 వరకు జరిగిన రెండవ ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో తెలంగాణకు చెందిన టీం సత్తా చాటింది. ఆ టీమ్‌కు మండల పరిధిలోని ఈపూరు పాలెంకు చెందిన విన్నకోటి వేణు కోచ్‌గా వ్యవహరించడంతో పాటు కోచ్‌లకు నిర్వహించిన మెమెంటో గేమ్స్‌లో కూడా ప్రతిభను కనబరిచి బెస్ట్ కోచ్ అవార్డును అందుకున్నారు. దీంతో ఈపూరుపాఎం వాసులు వేణుకు అభినందనలు తెలిపారు.

ఈకేవైసీతో ప్రజా సరుకుల పంపిణీ సులభం


డీఎస్‌వో విలియమ్స్

చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుల ద్వారా అందించే పథకాలకు సంబంధించి కార్డులో ఉన్న సభ్యులు తప్పనిసరిగా డీలర్ వద్ద వేలిముద్రలు వేయాలని డీఎస్‌వో విలియమ్స్ తెలిపారు. వేలిముద్రలు (ఈకేవైసీ) అవసరమై వారి వివరాలను ఇప్పటికే ఆయా రేషన్ షాపుల నిర్వాహకులకు చేర్చినట్లు వివరించారు. వేలి ముద్రల సేకరణ పారదర్శకంగా చేయడం వలన తొలగించాల్సిన, చేర్చాల్సిన వారి వివరాలతో పాటు ఇతర సమస్యలకు పరిష్కారం ఉంటుందని డీఎస్‌వో విలయమ్స్ తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థుల్లో పోటీతత్వం


టాలెంట్ టెస్ట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో-2 సుధాకరరావు

అద్దంకిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం ద్వారా వారిలో పోటీతత్వం, పరీక్షలపై ఆసక్తి పెరుగుతుందని ఎంఈవో-2 బూదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి, 8వ తరగతి చదువుతున్న బాల,బాలికకలకు ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో-2 సుధాకరరావు సందర్శించారు. ఈ టెస్ట్‌లో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 5వ తరగతి నుంచి 120 మంది, 8వ తరగతి నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో 5వ తరగతిలో ఎంపీపీఎస్ తిమ్మయపాలెం(హిందూ) విద్యార్థిని జీ లేఖాసాయిశ్రీ 50 మార్కులకు 33 మార్కులతో ప్రథమ, ఎంపీపీఎస్ పేరాయపాలెంకు చెందిన ఆర్.రిషిక్‌తేజ 31 మార్కులతో ద్వితీయ, ఎంపీపీఎస్ కలవకూరుకు చెందిన టి. ఆంటోని, ఎంపీయూపీఎస్ అద్దంకికి చెందిన వెంకటప్రవీణ్‌కుమార్, ఏ.అచ్యుతానంద 30 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. 8వ తరగతిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన డి.మనీషా 50 మార్కులకు 34 మార్కులతో ప్రథమ స్థానం, జడ్పీహెచ్ఎస్ తిమ్మాయపాలెంకు చెందిన పి. తమన్ సూర్య 28 మార్కులతో ద్వితీయ స్థానం, జడ్పీహెచ్ఎస్ ధేనువకొండకు చెందిన ఎం.అపర్ణ 27 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం, బొ మ్మనంపాడు, చక్రాయపాలెం, గొరకాయపాలెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంలు వీ శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసమూర్తి, కేవీ శ్రీనివాసరావు, ఎల్.సుజాత పర్యవేక్షించారు. సిబ్బంది పాల్గొన్నారు.

మే 19న కుంభాభిషేకం

అద్దంకి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతిముఖమండపం పునఃనిర్మాణ పనులు పూర్తి చేసుకొని, మే 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి ఆధ్వర్యంలో కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. కుంభాభిషేకం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలలో భాగంగా చంద్రమౌళీశ్వరపూజ, పాదుకాపూజలను నిర్వహించేందుకు వీలుగా టీటీడీ కల్యాణ మండపంలో అవసరమైన మరమ్మతుల చేపట్టేందుకు మంగళవారం ఈవో పూజలు చేసి పనులు ప్రారంభింపచేశారు. పూజారులు పాల్గొన్నారు.

మంచినీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న అధికారులు

ఇంకొల్లు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలోని తాగునీటి చెరువులను సాగర్ జలాలతో నింపామని, మే వరకూ తాగునీటికి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జ్యోతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 8 గ్రామాలకు జలజీవన్ పథకం కింద సుమారు రూ.3కోట్ల84 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఆ నిధులతో ఫిల్టర్‌బెడ్‌లు, పైపులైన్లు వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వరుసగా సర్వసభ్యసమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏవో వేణుగోపాల్, ఏపీఎం అనూరాధ, ఏపీవో రేణుక, సీడీపీవో ఝాన్సీ, డా.శివ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరయ్యారు.

ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

అద్దంకిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతూ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) కె.ధనరాజ్ అన్నారు. మంగళవారం మం డలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మండలలో 9345 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉన్నారని, ఇప్పటికి 7200మంది మాత్రమే గుర్తింపు సంఖ్య కోసం దరకాస్తు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు ఈనెల 31వ తేదీలోపు ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేని పక్షంలో పీఎం కిసాన్ లబ్ధి చేకూరదని తెలిపారు. ప్రభుత్వం మద్దతు దరకు శనగలు కొనుగోలు చేస్తుందని, మద్దతు ధర క్వింటా రూ.5650గా నిర్ణయించారని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరావు, వీఏఏలు వీరశంకర్, ఆంజాద్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ : వ్యవసాయ యంత్ర పరికరాలు అవసరమైన రైతులు గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కుమారి కోరారు. మండలంలోని కొప్పెరపాడు, ఎస్‌ఎల్ గుడిపాడు గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో రైతులు సాగు చేసిన మినుము పంటను పరిశీలించి పల్లాకు తెగులు నివారణ కు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులతో జరిగిన సమావేశం లో ఏవో మాట్లాడుతు బల్లికురవ మండలానికి 30 ట్రాక్టర్ పరికరాలు, 20 మందు పిచికారీ స్ప్రేయర్లు, ఒక రోటావేటర్ మంజూరయ్యాయని, అర్హత ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు పవన్‌సాయి, రమణయ్య పాల్గొన్నారు.

మద్దతు ధరకు అపరాల కొనుగోలు

పర్చూరు : అపరాలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, ప్రైవేటు వ్యక్తులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని ఏడీఏ ఎస్.మోహనరావు తెలిపారు. మంగళవారం మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం ఏవో ఎస్.రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ మాట్లాడుతూ అపరాలకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం శనగలకు క్వింటాకు రూ.5650, మినుములు క్వింటా రూ.7400, పెసలు క్వింటా రూ.8682 చొప్పున మార్క్‌ఫెడ్, సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తారని చెప్పారు. పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి, గొల్లపూడి, అన్నంబొట్లవారిపాలెం, వీరన్నపాలెం, బోడవాడ, రమణాయపాలెం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, గ్రామ వీఏఏఎస్‌లు, ఆదర్శ రైతులు, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : వేసవిలో రైతులకు అనుకూలమైనందువలన భూసార పరీక్షలను రైతులు చేయించుకోవాలని వ్యవసాయఅధికారి ఎస్.మేరమ్మ రైతులకు సూచించారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మేరమ్మ మాట్లాడుతూ పంటలు ఇంటికి రావడంతో పొలాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అందువలన మట్టి నమూనాలను రైతులు తీసుకొని భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుదర్శన, పలువురు రైతులు పాల్గొన్నారు.


విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

సెయింట్ ఆన్స్ విద్యార్థినులకు లోటస్ పెటల్ స్కాలర్‌షిప్

చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ మార్గాలను ఎంచుకుని అవకాశాలను అంది పుచ్చుకోవాలని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. ఇటీవల లోటస్ పెటల్ ఫౌండేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విజయ రేణుక ఉత్తమంగా రాణించి ప్రతభను కనబరిచారు. దీంతో ఫౌండేషన్ నుంచి విస్నీ సస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారు. ఈ స్కాలర్ షిప్ ద్వారా యేటా రూ.62,300 నాలుగేళ్లు పాటు అందుతాయని వివరించారు. ఈసందర్భంగా సంబంధిత జ్ఞాపికను మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, అమర్నాథ్‌బాబు, డా.హరిణి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

మార్టూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం కావడంతో విద్యార్థులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని స్కూల్ ప్రధానోపాధ్యాయులను ఎంఈవో వస్రాంనాయక్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. వాటిలో మార్టూరులోని అంబేడ్కర్ నగర్‌లోని ఏప ప్రాథమిక పాఠశాలను, జొన్నతాళిలోని ప్రాథమిక పాఠశాలను, వలపర్లలోని సుమేధ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఫిజికల్ విద్యార్థులు ఉండి, వివిధ కారణాలు దృష్ట్యా ఆపార్ కార్డులు జనరేట్ కాని 19 మంది విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగి ఆన్‌లైన్ అడ్మిషన్ నమోదుకు సిఫారసు చేశారు. అదేవిదంగా ఒంటిపూట బడులను జాగ్రత్తగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆయన వెంట సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు


గ్రంథాలయంలో తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

బల్లికురవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలలో ఉన్న అన్ని గ్రంథాలయాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవలో ఉన్న గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో 66 గ్రంథాలయాలు పని చేస్తున్నాయన్నారు. ప్రజలకు నూతన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ప్రజలు గ్రంథాలయాలను సందర్శించాలన్నారు. సిబ్బంది కొరత విషయం ప్రభుత్వ దృష్టిలో ఉందని, త్వరలో కొత్త పోస్టులు భర్తీ చేస్తారని తెలిపారు. అలానే గ్రామాలలో ప్రజలకు పుస్తక నిక్షిప్త కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియెగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు పత్రికలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఈ తనిఖీలో ఇన్‌చార్జి గ్రంథ పాలకుడు కె.మహేశ్వరరావు పాల్గొన్నారు.

లారీలను ఆపి.. ఆర్డీవో పేరుతో డబ్బు వసూలు

ఇద్దరికి ఏడాది జైలు, రూ.10వేల జరిమానా

అద్దంకి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలం కిందట నామ్ రోడ్డులో లారీలను ఆపి.. ఆర్డీవోనని చెప్పి, భయపెట్టి డబ్బులు వసూలు చేసిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ అద్దంకి కోర్టులో మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత తీర్పు చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరుకు చెందిన లారీ డ్రైవర్ గోవిందస్వామి సురేష్ 2015 జనవరి 18వ తేదీన మధ్య ప్రదేశ్ నుంచి చెన్నైకి లారీలో మార్బుల్ లోడుతో వెళ్తున్నారు. నామ్ రోడ్డులో అద్దంకి మండలం చక్రాయపాలెం వద్దకు వచ్చే సరికి ఆర్డీవోనని చెప్పి ఇద్దరు హైదరాబాద్‌లో ఇన్‌కంటాక్స్ కన్స్‌ల్టెన్సీ ఆఫీస్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన అజిత్‌కుమార్ సింగ్ (అజయ్), నల్గొండ జిల్లా నకిరికల్లు మండలం కేతపల్లికి చెందిన దేశగాని కరుణాకర్ లారీని ఆపారు. క్లీనర్‌ని కొట్టి రూ.25వేల నగదు తీసుకు వెళ్లారు. అప్పటి ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. సీఐ బేతపూడి ప్రసాద్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసు విచారణ చేసి మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత ఇద్దరికి ఏడాది జైలు, రూ.10వేల ఫైన్ విధించారు. నిందితులకు శిక్షపడేలా సీఐ సుబ్బరాజు, కోర్టు కానిస్టేబుల్ రమణ కృషి చేశారు.


భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

మార్టూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన కుందేటి నాగేశ్వరరావు వేధిస్తున్నారని భార్య లక్ష్మి ఫిర్యాదు చేయగా మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాల కారణంగా గత నాలుగురోజుల కిందట లక్ష్మి తన స్వగ్రామమైన తాటివారిపాలెం గ్రామంలోని పుట్టింటికి వెళ్లారు. అయితే సోమవారం రాత్రి తాటివారిపాలెం వెళ్లిన నాగేశ్వరరావు భార్యపై కర్రతో గాయపరచాడు. దాంతో ఆమెను కుటుంబసభ్యులు వైద్యం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లక్ష్మి ఆస్పత్రి నుంచి ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు బాషా తెలిపారు.

గిరిజనులకు తాగునీటి వసతి కల్పించాలి

వేటపాలెం (చీరాల), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నీటి సమస్యలు లేకపోయినా నిర్వహణ లోపంతో సర్వోదయ కాలనీ, సమైక్య నగర్ ప్రాంతాల్లో గిరిజనులకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు తాగునీటిని అందించాలని కోరుతూ ఆయా కాలనీవాసులు, సీపీఎం నాయకుడు ఎస్.బాబూరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ పార్వతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ అయ్యప్ప రెడ్డి, అంజనేయులు, గిరిజన మహిళ నాయకులు లక్ష్మి, నాగేశ్వరి, వెంకటేశ్వరమ్మ, రమణ పాల్గొన్నారు.


తహసీల్దార్ పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు




గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు ఉందని తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువు పాడులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాల (బాలురు)లో 6, 7, 8 తరగతుల్లో ప్రవేశం కోసం పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

8వ పేజీలో..
ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలి • ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాసులు • కుష్ఠును ముందే గుర్తిస్తే నివారణ • సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.26 (బుధవారం సాయంత్రం)
సహరి : 4.53 (గురువారం ఉదయం)



నెల్లూరు నగర పాలక సంస్థ భారీ బడ్జెట్‌తో సిద్ధమైంది. రూ.695.95 కోట్లతో పద్దును సిద్ధం చేసిన ఎన్ఎంసీ యంత్రాం గం బుధవారం మేయర్ స్రవంతి అధ్యక్షతన కౌన్సిల్లో ప్రవేశ పెట్టనున్నది. ప్రణా ళిక వ్యయం 448.52 కోట్లుగా లెక్కగట్టిన యంత్రాంగం ప్రణాళికేత ర వ్యయం రూ.247.43 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఈసారి ఆర్థిక సంవత్సరంలో పన్నుల ద్వారా 44.73 శాతం ఆదాయం ఖజానాకు వస్తుం దని భావిస్తున్న కార్పొరేషన్ అధికారులు ఫీజులు, యూజర్ చార్జీల ద్వారా మరో 29.64 శాతం రాబట్టగల మని లెక్కగడు తున్నారు. మొత్తం మీద భారీ వ్యయాల తో పద్దును సిద్ధం చేసి కౌన్సిల్ ముందుకు తీసుకురానున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

కార్పొరేషన్ పద్దు..

నేడు కౌన్సిల్లో ప్రవేశపెట్టనున్న మేయర్ స్రవంతి

ప్రగతి పొద్దు

• కార్పొరేషన్ బడ్జెట్ రూ.695.95 కోట్లు • ప్రణాళికా వ్యయం రూ.448,52 కోట్లు • ప్రణాళికేతర వ్యయం రూ.247.43 కోట్లు

నూతన పద్దు రూ.695.95 కోట్లతో బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో మేయర్ స్రవంతి అధ్యక్షతన బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రానున్న ఆర్థిక ఏడాదిలో రూ.122.52 కోట్లు (44.73 శాతం) పన్నుల ద్వారా, వివిధ రకాల ఫీజులు, యూజర్ చార్జీల ద్వారా రూ.81.19 కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తు న్నారు. హెడ్ ఆఫ్ ది అకౌంట్ కింద రూ.273.92 కోట్లు వివిధ మార్గాల ఆదాయం ఖజానాకు చేరుతుండగా అందులో ప్రణాళిక వ్యయం ద్వారా ఖర్చులను చూపారు. మున్సిపల్ కాంప్లెక్స్‌ల ద్వారా రానున్న ఏడాదిలో రూ.3.44 కోట్ల ఆదాయం వస్తుందని లెక్కకట్టారు. గతేడాది రూ.3.39 కోట్లు ఆదాయంగా పెట్టుకుని అందులో రూ.2.52 కోట్లే వసూళ్లు చేయగలిగారు. కాగ ప్రస్తుతం అమలులో లేని, ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌ల ద్వారా ఏకంగా రూ.15 కోట్లు కార్పొరేషన్‌కు ఆదాయం వస్తుందని లెక్కకడు తున్నారు. గతేడాది ఇదే తరహా లెక్కలేసిన అధికారులు రూపాయి కూడా రాబట్టలేకపోయారు. ఇక నగరంలో గుర్తించిన ఖాళీ స్థలాలపై పన్ను ద్వారా ఈసారి రూ. 19 కోట్ల వరకు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ట్రేడ్ లైసెన్సుల ద్వారా రూ.3.50 కోట్లు, రోడ్ల ఆక్రమణల రుసుముల పేరిట మరో రూ.11.50 లక్షలు వసూళ్లు చేయాలని యంత్రాంగం నిర్ణయించింది.

● లేఅవుట్ల క్రమబద్ధీకరణ ద్వారా..

ఇప్పటివరకు నగర పరిధిలోని లేఅవుట్ల క్రమబద్ధీకరణ అనుమతులు నుడా పరిధిలో ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కార్పొరేషన్‌కు అనుమతులు అప్పగిస్తూ పురపాలక శాఖ ఆదేశాలిచ్చింది. ఈ లెక్కన రానున్న ఆర్థిక ఏడాదిలో రూ.15 కోట్లు వరకు క్రమబద్ధీక రణ ఫీజుల ద్వారా ఆదాయం సమకూరు తుందని అధికారులు భావిస్తున్నారు. భూ గర్భ డ్రైనేజీ కనెక్షన్ల ద్వారా రూ.5 కోట్లు రాబట్టాలని ఎన్ఎంసీ అధికారులు లెక్కకట్టారు. కానీ తాజాగా పురపాలక మంత్రి నారాయణ యూజీడీ కనెక్షన్ రూపాయికే ఇస్తామని ప్రకటించ డంతో బడ్జెట్‌లో ఈ ఆదాయం ప్రశ్నార్థకంగా మారింది.

ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

నెల్లూరు(సిటీ), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్ను చెల్లింపుదారు లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త వినిపించిందని నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజ ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ఆస్తి పన్ను వడ్డీలో 50 శాతం వరకు రాయితీ ఇస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వు లిచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులందరు సద్వినియోగం చేసుకుని ఈ నెలాఖరులోపు పన్నులు చెల్లించాలని కోరారు.

● ఆప్కాస్‌కు పెరిగిన వ్యయం

కార్పొరేషన్‌లో విచ్చలవిడిగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ ద్వారా జీతాలుచెల్లిస్తున్నారు. గతేడాది రూ.55 కోట్లు చెల్లించగా, ఈసారి రూ.63 కోట్లు చెల్లించేందుకు పద్దు సిద్ధం చేయడం గమనార్హం. కార్పొరేటర్లగా గెలిచి మూడున్నరేళ్ల కాలం పూర్తయిన ఈ సమయంలో శిక్షణకు రూ.25 లక్షలు బడ్జెట్ కేటాయింపులు జరపడం విశేషంగా మారింది. మేయర్ పేషీలో గడుస్తున్న ఆర్థిక సంవత్సరంలో రూ. 8 లక్షలు ఖర్చు చేసినట్లు బడ్జెట్‌లో చూపిన అధికారులు రానున్న సంవత్సరానికి రూ. 10 లక్షలు కేటాయించారు. పారిశుధ్య కార్మికులకు రూ. 25లక్షలు పెట్టి చెప్పులు కొన్నామని, రూ. 40 లక్షలు టెలిఫోన్‌కు, ఇంకో రూ. 12 లక్షలు మొబైల్స్‌కు ఖర్చయినట్లు అధికారులు బడ్జెట్‌పద్దులో చెప్పుకొచ్చారు. రోడ్లపైనున్న జంతువుల నియంత్రణకు రూ.15 లక్షలు, కుక్కలకు ఏబీసీ చికిత్సలకు రూ.80 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు లెక్కకట్టారు. వీటన్నిటిపై సభ్యులు ఏమాత్రం ప్రశ్నిస్తారో నేడు జరిగే కౌన్సిల్ వైపు అందరి చూపుమళ్లింది.



ఏడీసీ కారును అడ్డుకుంటున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ చేయాలి

• ఎన్ఎంసీ ఎదుట సీపీఎం ఆందోళన

నగరంలోని ఆస్తి పన్నులపై వేస్తున్న వడ్డీని మాఫీ చేయాలని డిమాండ్ చేస్తు సీపీఎం నాయకులు, కార్యకర్తలు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటి పన్నుకు వడ్డీలు, కొళాయిలకు పన్నులు, జరిమానా విధించడం వల్ల నగర వాసులు భయభ్రాంతు లకు గురవుతున్నట్లు వాపోయారు. దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలతో పౌరులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అనంతరం ఏడీసీ నందన్ కారును అడ్డుకుని నిరసన తెలిపారు. ఆపై మేయర్ స్రవంతికి వినతిపత్రం అందచేశారు. ముందుగా ఆందోళనకారులను పోలీసులు ప్రధాన గేట్ల వద్ద అడ్డుకున్నారు. ఈ నిరసనలో నాయకులు నాగేశ్వరరావు, పెంచలనరసింహంలు పాల్గొన్నారు.



విజయవాడలో జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

నేడు జిల్లాపై సీఎం సమీక్ష

యాక్షన్ ప్లాన్‌ను వివరించనున్న కలెక్టర్

తొలిరోజు కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ లక్ష్యాలపై దిశానిర్దేశం

నెల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రగతి, ప్రణాళికలపై ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు బుధవారం సమీక్షించనున్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిరోజు మంగళవారం ప్రభుత్వ లక్ష్యాలను దిశానిర్దేశం చేసిన సీఎం రెండోరోజు జిల్లాలపై సమీక్షించనున్నారు. ఇందులోభాగంగా జిల్లాలో సాధించిన ప్రగతి, రానున్న ఏడాదిలో నిర్ధేశించుకున్న లక్ష్యాలు, ప్రధాన అంశాలపై కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా సీఎంకు వివరించనున్నారు. ఆ తర్వాత జిల్లా గురించి ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా యాక్షన్ ప్లాన్‌ను తయారు చేశారు. అందులో వ్యవసాయం, హార్టికల్చర్, ఫిషరీస్, లైవ్‌స్టాక్, ఫారెస్ట్, మ్యాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రిసిటీ, నీటి సరఫరా, నిర్మాణ రంగం, మైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ట్రాన్స్‌పోర్ట్, విద్య, ఆరోగ్యం, రియల్ ఎస్టేట్, సంక్షేమం, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ విజన్ ప్లాన్‌ను ప్రజంట్ చేయనున్నారు. ఈ రంగంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటిని అమలు చేసేందుకు పెట్టుకున్న సమయం వంటి వివరాలను వివరించనున్నారు. అదేవిధంగా రానున్న ఏడాదిలో 15 శాతం గ్రోత్ సాధించేందుకు తీసుకుంటున్న చర్యలను కూడా తెలియజేయనున్నారు. అలానే మరో ఐదు నిమిషాలపాటు జిల్లాలోని ప్రధాన సమస్యలపై కూడా కలెక్టర్ మాట్లాడేందుకు అవకాశమిచ్చారు.

● కోవూరు షుగర్ ఫ్యాక్టరీపై..

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలు చెల్లించడం, అక్కడున్న 124 ఎకరాల భూమిని వినియోగించడం అనే అంశాన్ని తొలుత వివరించనున్నారు. ప్రస్తుతం విజిలెన్స్ విచారణ నేపథ్యంలో కొన్ని ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయి ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు అనుమతి ఇవ్వాలని కూడా కలెక్టర్ సీఎంను కోరనున్నారు. సోమశిల అప్రాన్ పనులు, హైలెవల్ కెనాల్ భూసేకరణను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల గురించి కూడా ప్రస్తావించనున్నారు. వీటితోపాటు తమిళనాడు మత్స్యకారుల పెద్ద బోట్లతో జిల్లాలోని మత్స్యకారులకు ఎదురవుతున్న ఇబ్బందులను కూడా కలెక్టర్ మాట్లాడనున్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను త్వరగా పూర్తి చేసి ఆపరేషన్‌లో తీసుకొచ్చే అంశాన్ని కూడా ప్రస్తావించనున్నారు. కలెక్టర్ ప్రెజంటేషన్ తర్వాత ఈ అంశాలన్నింటిపై సీఎం సమీక్షించనున్నారు.

● తలసరి ఆదాయంపై..

కాగా తొలిరోజు జరిగిన కాన్ఫరెన్స్ లో రానున్న ఏడాదిలో సాధించాల్సిన లక్ష్యాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. జిల్లా సాధించాల్సిన ప్రగతి వివరాలను కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా స్థూల ఉత్పత్తి ఉత్పత్తి 2023-24లో రూ.69,491 కోట్లు ఉండగా 2024-25లో 79,532 కోట్లుగా నమోదైనట్లు అంచనా వేశారు. అంటే ఈ ఏడాది జీడీపీ 14.45 శాతం పెరిగింది. రానున్న ఆర్థిక సంవత్సరం 2025-26లో జీడీపీని రూ.92,705 కోట్లకు పెంచి 16.56 శాతం గ్రోత్ సాధించాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. ప్రస్తుతం రాష్ట్ర జీడీపీలో జిల్లా వాటా 4.99 శాతం ఉండగా, రానున్న ఏడాదిలోనూ పురోగతి సాధించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇక జిల్లాలో తలసరి ఆదాయం 2023-24లో రూ.2,33,411 ఉండగా, 2024-25లో అది రూ.2,66,818లకు పెరిగింది. రానున్న ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయాన్ని రూ.3,10,214లకు పెంచాలని ప్రభుత్వం సూచించింది. తొలిరోజు కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్‌తో పాటు ఎస్పీ కృష్ణకాంత్ కూడా పాల్గొన్నారు. కాగా ఈ సదస్సును నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి జేసీ కే కార్తీక్ వీక్షించారు.

వీఎస్‌యూ పీజీ కళాశాలలో విచారణ

• ప్రొఫెసర్లు, విద్యార్థినులతో మాట్లాడిన కమిటీ • విచారణను నీరుగార్చేందుకు విశ్వప్రయత్నాలు

కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని పీజీ కళాశాలలో ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ మంగళవారం విచారించింది. మహిళా అధ్యాపకుల పట్ల ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుచితంగా ప్రవర్తించడం, మహిళల హాస్టల్‌లోకి ప్రవేశించడంపై పెద్ద దుమారమే రేగింది. ఈ వ్యవహారంపై విచారణ కమిటీని నియమించగా, విచారణకు కాలయాపన చేశారు. చివరకు మంగళవారం కమిటీ సభ్యులు కళాశాలకు చేరుకుని మహిళా అధ్యాపకులు, విద్యార్థినులతో మాట్లాడారు. అధ్యాపకుడిపై ఆరోపణలు నిజమేనని కమిటీ ముందు వారు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే కళాశాల పెద్దలు మాత్రం అధ్యాపకుడిని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అధ్యాపకుడికి అనుకూలంగా కొంతమంది విద్యార్థినులను కమిటీ ముందు హాజరుపరిచినట్లు తెలుస్తోంది. కాగా, విచారణలో తమ దృష్టికి వచ్చిన అంశాలను నివేదిక రూపంలో వీఎస్‌యూ అధికారులకు అందజేస్తామి కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.

పింఛన్ల పంపిణీకి ఎల్-1 స్కానర్లు

• ఎల్-0 స్థానంలో కొత్తవి • అక్రమాలకు చెక్ పెట్టేందుకే..
• సచివాలయాలకు పంపిణీ • వచ్చే నెల నుంచి వినియోగం

నెల్లూరు (హరనాథపురం) మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్రమాలను నియంత్రించేందుకు ఆధునిక సాంకేతికత కలిగిన ఎల్-1 స్కానర్లను జిల్లాకు పంపింది. ఇప్పటికే ఈ స్కానర్లను స్థానిక సచివాలయాల సిబ్బందికి పంపిణీ చేశారు. ఏప్రిల్ నుంచి వీటి సహాయంతో పింఛన్లు అందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు ఎల్-0 స్కానర్లను వినియోగిస్తున్నారు. అయితే ఆ స్కానర్లలో లబ్ధిదారుల వేలిముద్రలు వేస్తుంటే ఇబ్బందులు తలెత్తేవి. దీనికితోడు కొన్ని రాష్ట్రాల్లో నకిలీ వేలి ముద్రలు రూపొందించి పింఛన్లు పక్కదోవ పట్టిస్తున్నారన్న ఫిర్యాదులు యూఐడీఏఐ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) కి వెళ్లాయి. దీంతో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆధునిక సాంకేతికత కలిగిన ఎల్-1 ఆర్డీ పరికరాలు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం వాటిని కొనుగోలు చేసి సచివాలయాలకు అందజేసింది.

● ఏప్రిల్ నుంచి వినియోగం..

కొత్తగా అందజేసిన ఎల్-1 ఆర్డీ స్కానర్ పరికరాలతోనే ఏప్రిల్ నుంచి పింఛన్లు అందించనున్నారు. వీటిలో యూఐడీఏఐ ఆధార్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించింది. దీంతో ప్రస్తుతం ఉన్న పాత పరికరాలు పనిచేయవని ఆ సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. జిల్లాలోని సచివాలయ సిబ్బందికి 6400 స్కానర్లను పంపిణీ చేశారు. తొలుత ఎంపీడీవోలకు పంపి, తర్వాత సచివాలయం సిబ్బందికి అందజేశారు. మిగిలినవి అధికారుల వద్ద ఉంటాయి. ఏ సచివాలయంలోనైనా పరికరం పని చేయక పోతే వాటి స్థానంలో కొత్తవి ఇచ్చేలా అధికారులు నిర్ణయించారు.



ఎల్-1 స్కానింగ్ పరికరాలు



ఏర్పాట్లు చేశాం

ఆధునిక సాంకేతికత కలిగిన ఎల్-1 స్కానర్లు జిల్లాకు వచ్చాయి. వీటిని సచివాలయాలకు పంపిణీ చేశాం. ఏప్రిల్ నుంచి వీటి ద్వారానే పింఛన్లు పంపిణీ చేయిస్తాం. ఎక్కడైనా పరికరం పనిచేయకపోతే వెంటనే కొత్తది అందజేస్తాం. పింఛన్లు అనుకున్న రోజు అనుకున్నట్లు అందజేసే ఏర్పాట్లు చేశాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ

పాఠశాలల అభివృద్ధికి నిధులు

• మనబడి-మనభవిష్యత్తు పనులకు మోక్షం • జిల్లాకు రూ.39.36 కోట్ల కేటాయింపు


నెల్లూరు (విద్య), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను (మనబడి-మనభవి ష్యత్తు) పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా జిల్లాలో రెండవదశలో పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తికి జిల్లాకు రూ.39.36 కోట్లు కేటాయిం చారు. జిల్లాలోని పాఠశాలల్లో రెండవ దశలో 1400 పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించి పూర్తి చేయ డానికి పాఠశాల విద్యాశాఖ నివేదికలను కోరింది. దీంతో కొన్ని పాఠశాలల్లో నిర్మిం చిన అదనపు తరగతి గదులకు ప్లాస్టింగ్ చేసి పెయింటింగ్ చేయాలని, మరికొన్ని చోట్ల తలుపులు, కిటికీలు బిగించాల్సి ఉందని, అలాగే పారిశుధ్యపనులు, విద్యుత్ క్రమబద్ధీకరణ ఇలా పలు పనులకు సంబంధించి నివేదికలు తయారు చేసి పంపారు. గత వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడం, పనుల్లో నాణ్యత లేదని కొన్నిచోట్ల ఆపివేయడం వంటి అంశాలతో కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలి వెళ్లిపోవడంతో చాలా వరకు అసంపూర్తిగా భవనాలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల పాఠశాలల అభివృద్ధి కమిటీ ఖాతాల్లో ఉన్న నిధులతో చిన్నచిన్న పనులు ప్రారం భించినా నిధులు అయిపోవడంతో ఈ పనులు కూడా ఆగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ మొత్తం నివేదికల ఆధారంగా రాష్ట్ర ఉన్నతాధికారులు అన్ని జిల్లాలతో పాటు నెల్లూరుకు రూ.39.36 కోట్లు కేటా యించారు. అడ్మిన్ శాంక్షన్ మాత్రమే అయిన ఈ నిధులను ఫైనాన్స్ శాంక్షన్ కింద జిల్లాకు విడుదల చేస్తే అసంపూర్తి భవనాలు పూర్తి చేసి రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాలలను వినియోగంలోకి తెస్తామని ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు.

28 నుంచి ఎయిడెడ్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్ష

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు ఈనెల 28, 29 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకట నలో పేర్కొన్నారు. నెల్లూరులోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ 2, బయలాజికల్ సైన్స్ 1, ఫిజికల్ సైన్స్ 1, హిందీ 1, ఎస్‌జీటీ 2 పోస్టులు ఉన్నా యని తెలిపారు. గూడూరు లోని శ్రీపొట్టిశ్రీరాములు అప్పర్‌ప్రైమరీ స్కూల్‌లో ఎస్‌జీటీ 1, లాంగ్వేజ్ పండిట్ హిందీ 1, తెలుగు 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు cse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టి కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో ఆయా పాఠశాలల యాజమాన్యానికి ఇచ్చిన దరఖాస్తులకు కూడా డీఈవో అనుమతితో హాల్‌టికెట్లు పొందాలని సూచించారు.

నేర నియంత్రణకు కృషి చేయాలి

• ఆర్పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ • నెల్లూరు ఆర్పీఎఫ్ స్టేషన్ తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్

నెల్లూరు(క్రైం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ నేరా ల నియం త్రణకు కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే పోలీసు ఐజీ, ఆర్పీఎఫ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూరు ఆ దేశించారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగంలో మెలకువలపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశా రు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్టేషన్ ప్రాంగణం లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ ఎఫ్ విజయవాడ సీ నియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బాపూజీ తోకల, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జీ మధు సూదనరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీ రమేష్‌గౌడ్, ఎస్ఐ శివరూపావత్, ఏఎస్ఐలు కిరణ్‌కుమార్, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

వేసవిలో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి): వేసవిలో రైలు ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది, కావున దొంగతనాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నందున జీఆర్పీఎస్ పోలీసులు అప్రమత్తంగా ఉండా లని రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ ఆదేశించారు. నగరంలోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన నెలవారీ నేర సమీక్ష జరిపారు. స్టేషన్ ప్లాట్‌ఫాంలపై బీట్ల సంఖ్య పెంచి, దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచా లన్నారు. రైళ్లలో కిటికీల పక్కన కూర్చొని ప్రయాణించే మహిళలకు దొంగతనాలపై అవగా హన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎస్ఐ రమాదేవి, నెల్లూరు ఎస్ఐ హరిచందన, గూడూరు ఎస్ఐ చెన్న కేశవులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	111
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 470



70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

గుడ్లూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరేటిపల్లి నుంచి కావలికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, మినీ వాహనాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు పూరేటిపల్లి సమీపంలో 70 బస్తాల రేషన్ బియ్యా న్ని తరలిస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అందులో ఉన్నవి రేషన్ బియ్యంగా గుఇర్తంచారు. బియ్యంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ వాహనంలో ఉన్న శివకుమార్, నరసింహం, శివారెడ్డిలను అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట్రావు తెలిపారు.

రీ సర్వేలో తప్పులు చేస్తే చర్యలు : ఆర్డీవో


తహసీల్దారు కార్యాలయంలో రీ సర్వేపై సమీక్షిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో తప్పు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ హెచ్చరించారు. కావలి తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం మండలంలోని రుద్రకోటలో జరుగుతోన్న రీ సర్వేకు సంబంధించి కావలి తహసీలారు పీ.శ్రావణ్‌కుమార్, రీసర్వే డీటీ, డివిజనల్, మండల, సచివాలయ సర్వేలతో పాటు ఆగ్రామంలో పాల్గొంటున్న వీఆర్వోలతో ఆయన సమీక్షించారు. రీసర్వే ఎలా జరుగుతోంది.. ఎంత పూర్తి చేశారు.. ఎదురవుతున్న సమస్యలు.. వాటిని అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చించారు. గతంలో జరిగిన రీ సర్వేలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమయం ఎక్కువ ఉన్నందున ఎక్కడా లోపాలు, ఫిర్యాదులు రాకుండా సర్వే నిర్వహించాలన్నారు. రీసర్వే సమయంలో అందుబాటులో లేని రైతులను రెండు పర్యాయాలు రమ్మని పిలిచి వారు రాలేకపోతే వారి తరుపున లిఖిత పూర్వకంగా వారి అనుచరులను పంపమని చెప్పి తద్వారా సర్వే పూర్తి చేయాలని చెప్పారు.

ఆధార్‌కార్డులు ఇప్పించండి సారూ..

ఆధార్‌కార్డులు ఇప్పించండి సారూ.. ముసునూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన గిరిజనులు ఆర్డీవో ఎం. సన్నీవంశీకృష్ణను వేడుకున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ఆధార్ కార్డులు లేనందున ప్రభుత్వ పథకాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో పక్కనే ఉన్న తహసీల్దారు పీ.శ్రావణకుమార్‌తో ఆధార్ కార్డులు లేని వారిని గుర్తించి కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

‘ఆర్టీసీ’లో రక్షణ కరువు!

- నిత్యం అల్లరి మూకలు, మందుబాబుల ఆగడాలు
- చీకటి పడితే భయాందోళనలో ప్రయాణికులు
- మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలు
- దిష్టిబొమ్మలా పోలీసు అవుట్ పోస్ట్


కావలి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

కావలి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు దాని పరిసరాలలో ప్రయాణికులకు రక్షణ కరువైంది. నిత్యం అల్లరి మూకలు, మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని ప్రయాణికులు వాపోతున్నారు. దూర ప్రాంతాలకు రాత్రి సమయంలో రాపోకలు సాగించే ప్రయాణికులు ఆకతాయిల ఆగడాలతో హడలిపోతున్నారు. ముఖ్యంగా మహిళల పట్ల వీరు వ్యవహరిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల కిందట అర్ధరాత్రి బస్టాండ్‌లో ఉన్న ఒక టీ దుకాణంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టనివ్వలేదని దుకాణ నిర్వాహకుడిని ఐదుగురు యువకులు చితకొట్టారు. ఆ విషయం డిపోలో ఉన్న నిఘా కె మెరాలలో దొరకి అవి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ ఐదుగురి యువకులపై ఒకటో పట్టణ పోలీస్‌లు కేసు నమోదు చేశారు. అసలు అర్ధరాత్రి అక్కడ ఐదుగురు యువకులు ఎందుకు చేరారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. గతంలో బస్టాండ్‌లో బస్సుల కోసం కొంత సేపు నిలబడితే జేబులో ఉన్న సెల్ ఫోన్‌లు క్షణాల్లో మాయమయ్యేవి. అయితే సెల్‌పోన్ దొంగలు ఎక్కువైన తర్వాత డిపోలో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడంతో సెల్‌ఫోన్ దొంగలు కొంత తగ్గాయి. అయితే మందుబాబులు, అల్లరి మూక ల ఆగడాలు బస్టాండ్ ఆవరణంతోపాటు దాని పరిసరాలలో ఎక్కువయ్యా యి. చీకటి పడితే కొందరు యువకులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరి కొందరు యువకులైతే యువతులు కనిపిస్తే వారి వెంట పడి వేధిస్తున్నారనే ప్రచారం ఉంది. మహిళలు ఏమీ చేయలేక సర్దుకుపోతున్నారే కానీ పోలీసులకు ఫిర్యాదులు చేస్తే తమ గౌరవం ఎక్కడ దెబ్బతింటుందోనని వెనుకాడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని అల్లరి మూకలు, మందుబాబుల ఈవ్‌టీజింగ్ బస్టాండ్ ప్రాంతంలో ఎక్కువైందని చెబుతున్నారు. రాత్రి అయితే బస్టాండ్‌కు వెళ్లాల్నా, బస్సుల కోసం నిరీక్షించాలన్నా, బస్సు దిగి రావాలన్నా ప్రయాణికులు బిక్కు బిక్కు మంటూ అభద్రతతో ఆందోళన చెందుతున్నారు.


పోలీసులు లేని ఔట్‌పోస్ట్

● దిష్టిబొమ్మలా పోలీసు ఔట్‌పోస్ట్

గతంలో ఆర్టీసీలో పోలీస్‌ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయడంతో పోలీస్‌లు అందుబాటులో ఉంటున్నందున అల్లరి మూకలు, మందు బాబులు అక్కడ తిరగాలంటే భయపడేవారు. ప్రయాణికులకు కూడా పోలీసులు ఉన్నారనే ధైర్యం ఉండేది. అయితే ప్రస్తుతం అక్కడ పోలీస్ ఔట్‌పోస్ట్ ఉంది కానీ పోలీసులు మాత్రం ఉండడం లేదు. దీంతో అది దిష్టిబొమ్మలా మారింది. ఫలితంగా రెచ్చిపోతున్న ఆకతాయిలు, మందు బాబుల నుంచి ప్రయాణికులకు రక్షణ కరువైంది.

పోలీసు అధికారులు స్పందించలేదు

బస్టాండ్‌లో అల్లరి మూకలు, మందుబాబులు ఆగడాలు ఎక్కువైంది వాస్తవమే. అయితే ఈ విషయం పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీసు ఔట్‌పోస్ట్‌లో సిబ్బందిని నియమించి ప్రయాణికులకు రక్షణ కల్పించాలని కోరినా స్పందనలేదు.

\- ఆర్ శ్రీనివాసులు, డిపో మేనేజరు

పంచాయతీ సమావేశం వాయిదా


పంచాయతీ సమావేశంలో పాల్గొన్న అధికారులు, సర్పంచు మాల్యాద్రి, తదితరులు

కొండాపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవోలు పంచాయతీ సాధారణ సమావేశం ఎప్పటిలాగే వార్డు సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడింది. ఈ పంచాయతీకి గతంలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 10 వార్డులకు 8 వార్డుల్లో టీడీపీ మద్దతు దారులు విజయం సాధించగా, మిగిలిన 2 వార్డులతో పాటు పంచాయతీ సర్పంచుగా వైసీపీ మద్దతు దారులు గెలుపొందారు. దీంతో సర్పంచు సమావేశాలు నిర్వహించకనే ఏకపక్షంగా తీర్మానాలు చేసుకుని వార్డు సభ్యులను సంతకాలు పెట్టమనేవారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో గత కొంతకాలంగా పంచాయతీ సాధారణ సమావేశాలు జరగలేదు. ఈ విషయాన్ని సర్పంచు మాల్యాద్రి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ సమావేశం జరిగేలా చూడాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఈవోపీఆర్‌డీ నారాయణరావు, ఏవో శేషసాయి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్‌లు సర్పంచు అధ్యక్షతన స్థానిక సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కూడా వార్డు సభ్యుల రాకపోవడంతో కోరం లేక వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోసం ‘నవోదయం 2.0’


తహసీల్దారుతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

బిట్రగుంట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0ను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం బోగోలు తహసీల్దారు కార్యాలయంలో నవోదయం 2.0 కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు తహసీల్దారు సురేష్‌బాబు అధ్యక్షతన నాటుసారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. ఈ కార్య క్రమంలో కమిటీ సభ్యులు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ కోటేశ్వరావు, కావలి అటవీశాఖాదికారి సుమన్, లోకాయుక్త సభ్యులు మాలకొండారెడ్డి, ఆకుల డేవిడ్‌పాల్, సాల్మన్‌రాజు, నాగేశ్వరావు, వెలుగు ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి


చీమలపెంటలో తడి, పొడి చెత్తపై వివరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో క్లాప్‌మిత్రలు ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద సృష్టి కేంద్రాలకు తరలించి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావుతో కలిసి చీమలపెంట, పెంట్రాల గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి క్లాప్ మిత్రలు తడి పొడి చెత్తను సేకరిస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. క్లాప్‌మిత్రలు ఇంటికి వచ్చినప్పుడు తడి పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

● మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ మాట్లాడుతూ సుందరయ్యనగర్, జనార్దనకాలనీ గిరిజన సంఘం, ఉప్పుచెరువు కాలనీల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ బోర్లు, బావులు ప్రజలకు ఉపయోగపడేలా మరమ్మతులు చేయించాలని, పెరిగిన పట్టణానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి రోజువారీ కాలువలను శుభ్రం చేయించటం ద్వారా ప్రజలను దోమల బెడద నుంచి కాపాడాలని కోరారు. కందుకూరు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పెట్రోలు బంకు ఏర్పాటు చేసే ప్రయత్నాలను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మున్వర్‌సుల్తానా, ఎస్కే. మల్లిక, ఎం.పద్మ, ఎస్.పవన్‌కుమార్, టీ.వెంకటరావు, డీఎం రాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆస్తి పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ

కావలి/కందుకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కావలి, కందుకూరు మున్సిపాలిటీల్లో ఇల్లు, ఖాళీస్థలం పన్నులు ఈనెల 31వ తేదీ లోపు పూర్తిగా చెల్లించే వారికి వడ్డీలో 50 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, కందుకూరు మున్సిపల్ కమిషనర్ కె.అనూష వేర్వేరు ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు దగ్గరలో ఉన్న మీ సేవా కేంద్రాల్లో, సచివాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లలో పన్నులు చెల్లించి వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పన్నులు చెల్లింపుదారుల కోసం సెలవు దినాల్లో కూడా పన్నులు చెలించేందుకు కౌంటర్లు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ ద్వారా కూడా పన్నులు చెల్లించుకోవచ్చునని తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తృతపరచాలి

కావలిటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సేవలు విస్తృత పరచాలని రెడ్‌క్రాస్ కావలి శాఖ అధ్యక్షుడు, ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో జరిగిన రెడ్‌క్రాస్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా నడుచుకోవాలన్నారు. అనంతరం పాలక మండలి ఉపాధ్యక్షుడుగా డాక్టర్ బెజవాడ రవికుమార్, చైర్మన్‌గా డాకారపు రవిప్రకాష్, వైస్ చైర్మన్‌గా హరినారపరెడ్డి, కోశాధికారిగా అరికట్ల మధుసూదన్‌రావు, సభ్యులుగా న్యాయవాది గొట్టిపాటి మనోరమ, ఇలీంద్ర శ్రీవాణి, డాక్టర్ శ్రీధర్, దాత ఏ రమేష్‌రెడ్డి, పోషక సభ్యులు మోడరన్ నరసింహరావు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, జెనిగర్ల మనోహర్, ప్రవీణ్, బీద లక్ష్మీనంద, ఎస్‌కే నయీమ్, బెజవాడ ప్రసన్నకుమార్ తదితరులు ప్రమాణ స్వీకారం చేయించారు.

నేడు టీడీపీ ‘కార్యకర్తే అధినేత’ సమావేశం

కందుకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కార్యకర్తే అధినేత అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణ టీడీపీ కార్యకర్తలతో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పట్టణంలోని క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్‌లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వలేటివారిపాలెం, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోకూరులో భారతీయ రిజర్వు బ్యాంకు, అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ విశ్రాంత మేనేజర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని, పొదుపు చేయడం అలవర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అవార్డు సంస్థ అడ్మిన్ రాజేశ్వరి, సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు, ఫైనాన్షియల్ అడ్వయిజర్ శివాజీ, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

బిట్రగుంట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరులోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పేదలకు రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ కుందుర్తి రవి తన తల్లి నీలవేణి 23వ వర్ధంతి సందర్భంగా మంగళవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రవి కుటుంబ సభ్యులు రాధ, మైత్రేయి, సురేఖ, బీఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు షేక్.సమీఉల్లా, బిట్రగుంట రైల్వే ఎస్సీ ఎస్టీ యూనియన్ చైర్మన్ బొడ్డు శ్రీనివాసులు, సొసైటీ నిర్వాహకులు కట్టేపల్లి భవానీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 65 మంది ఎంపిక


నియామకపత్రం అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కందుకూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. టీఆర్ఆర్ ప్లేస్‌మెంట్ సెల్, ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 150 మంది నిరుద్యోగులు హాజరుకాగా 65మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో హెటిరో డ్రగ్స్, ఎస్బీఐ కార్డ్స్, ఏరీస్ ఆగ్రో లిమిటెడ్, డైకిన్, ఆల్‌టూయిస్ట్, గ్లోబల్ ఫ్యాక్టరీస్ తదితర కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొని ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడ్ ఆఫ్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్డీసీ కో ఆర్డినేటరు ఇమ్రాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.రాజగోపాలబాబు పాల్గొన్నారు.

ఎస్ఐ నారాయణకు సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

లింగసముద్రం, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం ఎస్సైగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎం.నారాయణను టీడీపీ నేతలు మంగళవారం ఘనంగా సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ కా ర్యక్రమంలో టీడీపీ నాయకులు కండే మాలకొండయ్య, ఆర్ఎంపీ వైద్యులు షేక్ పరేష్, బోడి సురేష్, దాసరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు


విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐలు


డ్రోన్‌ల నిఘాను పరిశీలిస్తున్న సీఐ ఫిరోజ్

కావలి రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు పట్టణ శివారులోని ఆలయాలు, వ్యాపార సముదాయాలు, పాఠశాలల పరిసరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని రూరల్ సీఐ జీ.రాజేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని బాలక్రిష్ణారెడ్డినగర్, ముసునూరు ఇందిరమ్మకాలనీ శివారు ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎస్ఐలు తిరుమలరెడ్డి, బాలక్రిష్ణలతో కలసి పర్యటించారు. స్థానికులకు నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇందిరమ్మకాలనీలోని అక్షర ట్యుటోరియల్స్ వద్దకు వెళ్లి 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ట్యుటోరియల్స్ కరస్పాండెంట్ జీ.శివాంజనేయ రెడ్డికి సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. అలాగే అపరిచిత వ్యక్తుల అనుమానాస్పద సంచర, అసాంఘీక కార్యక్రమాలపై 9440796337కు సమాచారం ఇవ్వాలని కోరారు.

శివారు ప్రాంతాల్లో డ్రోన్ల వినియోగం

పట్టణ శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు, నేర నియంత్రణకు డ్రోన్ల వినియోగాన్ని ప్రభుత్వం ఉపయోగంలోకి తెచ్చిందని 1వ పట్టణ సీఐ ఫిరోజ్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ శివారు ప్రాంతాల్లో ఎల్లవేళలా నిఘా ఉంచుతామన్నారు. మంగళవారం కావలి పట్టణ పరిధిలోని వెంగయ్యగారిపాలెం, ఆముదాలదిన్నె తదితర శివారు ప్రాతాల్లో డ్రోన్లను ఎగురవేసి పరిశీలించారు. మ్యాన్ పవర్ వినియోగానికి అణువుగాని ప్రదేశాల్లో కూడా వ్యభిచారం, పేకాట, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణకు సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై నడిచేదెలా?

బిట్రగుంట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ యాదవపాలెం ప్రధాన రోడ్డుపై మురుగు ప్రవహిస్తుండడంతో స్థానికులు ఆమార్గంలో వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. 30 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు, కాలువలు పూర్తిగా దెబ్బతిని మురుగు నీరు రోడ్లపైకి నిల్వ చేరడంతోపాటు దుర్వాసన వెదజల్లుతోంది. పాతహరిజనవాడలో కూడా ఇటువంటి పరిస్థితే నెలకొని ఉందని దళితులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదని, కూటమి ప్రభుత్వంలోనైనా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


యాదవపాలెం ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

అసంపూర్తిగా ‘నాడు-నేడు’ పనులు

- జడ్పీ హైస్కూల్లో ఆగిన అదనపు గది నిర్మాణం
- ఆదిఆంధ్ర కాలనీ పాఠశాలలో పూర్తికాని ప్రహరీ
- మొగిలిచర్లలో విద్యార్థులకు తప్పని తిప్పలు

లింగసముద్రం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలో జడ్పీ హైస్కూల్‌లో, ఆదిఆంధ్ర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో రూ.60 లక్షలతో అదనపు తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్డి, ఫ్లోరింగ్, కరెంటు వైరింగ్ పనులు చేపట్టారు. అయితే వీటిలో వంటగది, మరుగుదొడ్డి, ఫ్లోరింగ్, కరెంటు వైరింగ్ పనులు పూర్తి చేశారు. అదనపు తరగతి గదులకు పిల్లర్లు వేసి, శ్లాబు వేసి అంపూర్తిగా వదిలేశారు. ఈ పనులన్నింటికీ రూ.45 లక్షలు ఖర్చు చేయగా మిగిలిన నిధులు మంజూరు కాకపోవడంతో గత ఏడాది ఎన్నికలకు ముందు ఈ పనులు నిలిచిపోయాయి. మరుగు దొడ్లకు కూడా పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే ఆదిఆంధ్ర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పథకం కింద ప్రహరీ, మరుగుదొడ్డి, పాత తరగతి గదికి మరమ్మతులకు రూ.23 లక్షలు మంజూరు చేశారు. అందులో రూ.10 లక్షలతో మరుగుదొడ్డి, పాత తరగతి గదికి మరమ్మతులు పూర్తి చేశారు. ఆ తరువాత నిధులు విడుదల కాకపోవడంతో ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోయింది. ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తలిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.


మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా అదనపు తరగతి గది నిర్మాణం


మొగిలిచెర్ల ఆదిఆంధ్ర కాలనీలో అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణ పనులు

మండుతున్న ఎండలతో

జాగ్రత్త సుమా !

- వేసవిలో పొంచి ఉన్న వ్యాధులు
- నివారణోపాయాలతో ఉపశమనం

వేసవిలో భానుడి ప్రతాపానికితోడు నీటి కాలుష్యంతో పలు రకాల వ్యాధులు ప్రబలుతున్నాయి. ఎండాకాలంలో ప్రధానంగా వడదెబ్బ, అతిసారా, పైయోడెర్మాస్(శరీరంపై గుల్లలు), వైరల్‌ఫీవర్, పచ్చ కామెర్లు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే వాటి బారి నుంచి తప్పించుకోవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే వేసవిలో వ్యాధులు దరిచేరవని వారంటున్నారు.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)


జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఒక వైపు ఎండలు భయపెడుతుంటే, మరోవైపు వేసవి వ్యాధుల ప్రమాదాన్ని తలచుకుని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

● నీటి వల్లే వ్యాధులు

- వేసవిలో వచ్చేవ్యాధులు అత్యధికంగా నీటి నుంచి వచ్చేవే. అందువల్ల సాధ్యమైనంత వరకు సురక్షితమైన నీటినే తాగాలి.
- కుళాయి, బోరు ప్రాంతాల్లో లీకేజీలను నివారించుకోవాలి. బోర్ల చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- పైపులైను వాల్వుల వద్ద చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

● వడదెబ్బ లక్షణాలివి...

- ఎండలో ఎక్కువగా తిరిగితే వడదెబ్బ తగులుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత పెరిగి అపస్మారకస్థితిలోకి వెళ్తారు. ఫిట్స్ రావడం, చర్మంపై మార్పులు రావడం, దాహం అధికం కావడం, శరీరం నీరసించడం, విసుగు వస్తాయి. కాబట్టి ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెల్లటి నూలు దుస్తులు ధరించాలి.
- ఎండలో పనిచేసేవారు తలపాగా చుట్టుకుంటే మంచిది. టోపీలు శ్రేయస్కరం.
- నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ తరచూ తీసుకోవాలి. కొబ్బరినీళ్లు ఎంతో శ్రేయస్కరం.
- ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో విరివిగా లభించే ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇళ్లలో సిద్ధంగా ఉంచుకోవడం ఉత్తమం. ఇంట్లో ఉష్ణోగ్రత తగ్గించుకోడానికి కిటికీలకు చాపలు కట్టి నీరు చల్లుకోవాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఎండ తగిలే శరీర భాగాలకు సన్‌స్కిన్ లోషన్ రాసుకుంటే మేలు.
- వేసవి నుంచి రక్షణ పొందేందుకు మన రోజువారీ ఆహార అలవాట్లను కొంత మార్చుకుంటే మంచిది. దీనివలన వేసవి ఇబ్బందుల నుంచి చాలావరకు గట్టెక్కవచ్చు.



పరిస్థితుల్లో ఎండ నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి.

- ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.

ఎక్కడపడితే అక్కడ లభించే నీటిని తాగరాదు. తాగితే అతిసారా ప్రబలే అవకాశం ఉంది.

- కాచి వడపోసిన నీటిని తాగడం ఉత్తమం. వేసవిలో ఎండకి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. సాధ్యమైనంతవరకు ఎండలో తిరగరాదు. అత్యవసర

కలుషిత ఆహారంతో అతిసారా

కలుషితాహారం, నీరు తీసుకోవడం వల్ల అతిసారా వస్తుంది. శరీరంలో నీరు, ఇతర లవణాలు విరేచనాలు ద్వారా బయటకు పోవడంతో బాధితుడు నీరసించిపోతాడు. కాళ్లు, చేతులు చల్లబడడం, పెదవులు ఎండిపోవడం, కళ్లు పీల్చుకుపోవడం, వాంతులు, విరేచనాలు మొదలు కాగానే ఓఆర్ఎస్‌ను నీటిలో కలిపి తాగాలి. మజ్జిగ సేవిస్తే ఇంకా మేలు చేకూరుతుంది. లీటరు నీటిలో టీ స్పూన్ ఉప్పు, కొంత పరిమాణంలో చక్కెరను కలిపి తాగించడం శ్రేయస్కరం. ఇళ్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వాడకూడదు. నీటిని కాచి చల్లార్చి తాగాలి. చిన్నపిల్లలకు, వృద్ధులకు ఈ జబ్బులు వస్తే అత్యవసరంగా సమీపంలోని వైద్యశాలలకు తరలించాలి.



- డాక్టర్ బాలాజీ, శ్వాసకోశ వైద్యనిపుణులు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, ఆత్మకూరు



తిరమలాపురం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ యంత్రం

రూ.లక్షలు వ్యయం.. లక్ష్యానికి దూరం!

గ్రామాల్లో ప్రజలకు సాంకేతిక సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో సచివాల యాల్లో యంత్రాలు ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించారు. కానీ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. జిల్లాలో పలు సచివాల యాల్లో ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ యంత్రాల నుంచి సిగ్నల్స్ రావడం లేదు. దీంతో ఉద్యోగులు అవసరమైనప్పుడు కంప్యూటర్లకు సెల్‌ఫోన్ హాట్‌స్పాట్ ద్వారా నెట్ అనుసంధానం చేసుకుని వినియోగిస్తున్నారు. సిగ్నల్స్ రాకపోవడంతో సొంత నిధులు వెచ్చించి ప్రజలకు సేవలందిస్తున్నామని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 80 శాతం సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

సోమశిలలో 54.086 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 54.086 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాసులు



నెల్లూరు (హరనాథపురం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాలసాని శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన ఎస్సీ కార్పొరేషన్‌లో పూర్తి అదనపు బాధ్యతల ఈడీగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ పథకాలను లబ్ధిదారులకు సత్వరమే చేరవేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఐసీడీఎస్ పీడీగా నిర్మలాదేవి



నెల్లూరు (హరనాథపురం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నిర్మలాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న సుశీలదేవి అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో నిర్మలాదేవిని పూర్తి అదనపు బాధ్యతలతో పీడీగా నియమించారు. ఆమె ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్నారు. ఐసీడీఎస్‌కు ఇన్‌చార్జ్ పీడీగానూ వ్యవహరించనున్నారు.

సమర్థవంత సముద్ర సంపదతోనే

బ్లూ ఎకానమీ అభివృద్ధి

వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు



మెరైన్ సిస్టమ్స్ పుస్తకావిష్కరణలో వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ తదితరులు

వెంకటాచలం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సముద్ర సంపదను సమర్థవంతంగా విని యోగించుకుంటే బ్లూ ఎకానమీ అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం బ్లూ రేవో ల్యూషన్ ఇన్నోవేషన్స్ ఇన్ మెరైన్ సిస్టమ్స్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. సముద్ర పరిశ్రమ అభివృద్ధిలో పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలు చాలా కీలకమన్నారు. సముద్ర ఆహార ఉత్పత్తుల నాణ్యతను మెరుగు పరిచేందుకు పరిశ్రమలు నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత మాట్లాడారు. సముద్ర పరిశోధన, మత్స్యపరిశ్రమ, బ్లూ ఎకానమీ అభివృద్ధిలో యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం అత్యవసరం అన్నారు. సదస్సుకు వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.వెంకట్రాములు, మెరైన్ బయాలజీ విభాగాధిపతి డాక్టర్ హనుమా రెడ్డిలు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మెరైన్ బయాలజీ నిపుణులు డాక్టర్ మానెల్ జెకరియా, చెన్నై డీప్ ఓషన్ మిషన్ సభ్యుడు డాక్టర్ ఎన్‌వీ వినీత్‌కుమార్, ఆక్వాకల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ హరిబాబు, హైటెక్ ఫార్మా సీఈవో ఎన్‌వీ రమణరెడ్డి పాల్గొన్నారు.

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్' అమలుకు కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్(కేర్)' పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు నియమించింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్‌జీవో నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఇందులో ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా, ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.

● రాష్ట్రంలో వర్సిటీలు

రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి సోమవారం రాత్రి సీఎంను కలవగా పైవిధంగా స్పందించారు. త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి యూనివర్సిటీల ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల ఉద్యోగుల జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

విడవలూరు :ముదివర్తి, ఊటుకూరు, అన్నారెడ్డిపాళెం, పెద్దపాళెంలో బుధ వారం నుంచి 28 వరకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నగేష్ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

సహజ వ్యవసాయ పద్ధతులు పాటించాలి

● ఏపీసీఎన్ఎఫ్ డీపీడీ మాలకొండయ్య



మాట్లాడుతున్న మాలకొండయ్య

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు సహజ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా మట్టి ఆరోగ్యంతోపాటు దిగుబడులు పెంచుకునే అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్టు అధికారి మాలకొండయ్య పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, పాటించాల్సిన పద్ధతులు, మెలకువలపై నెల్లూరులోని ఓ హోటల్‌ల్లో ఆయన ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. చివరి రోజు ఆయన మాట్లాడుతూ నేలలో తేమను నిల్వచేసి, సూక్ష్మ జీవుల చురుకుదనాన్ని పెంచడం ద్వారా మంచి పంటల దిగుబడి పొందేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్ణయించడం, సమస్యలను ఎదుర్కోవడం, గ్రామ, మండల, జిల్లాస్థాయిలో లక్ష్యాలను సాధించేలా 2025-26 సంవత్సర కార్యాచరణ చేపట్టామని తెలి పారు. ఈ ఏడాది 12.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అను సరించేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 365 కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. 4 నుంచి 6 ప్రధాన పంటలతో పాటు 25 వైవిధ్య పంటలను సాగుచేసి నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం, దిగుబడిని పెంచేందుకు ఏపీసీఎన్ఎఫ్ కృషి చేస్తోందని చెప్పారు.

ఏపీఏహెచ్‌వోఎస్ఏ అధ్యక్షుడిగా కృష్ణమౌర్య

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధకశాఖ అధికారుల సేవా సంఘం(ఏపీఏహెచ్‌వోఎస్ఏ) జిల్లా అధ్యక్షుడిగా కోవూరు ఏడీ డాక్టర్ ఐ కృష్ణమౌర్య ఎన్నికయ్యారు. నెల్లూరులోని పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీ మోహన్‌రావు పర్యవేక్షణలో ఎన్నికలు జరి గాయి. ప్రధాన కార్యదర్శిగా నెల్లూరు ఐఎస్‌డీపీ ఏడీ డీ మాధవీలత, కోశాధికారిగా నెల్లూరు ఏడీడీఎల్ ఏడీ జే చైతన్యకిషోర్, ఉపాధ్యక్షుడిగా నెల్లూరు వీపీసీ ఏడీ మాలకొండయ్య, సంయుక్త కార్యదర్శిగా కోట ఏడీ బీవీ సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. వీరిని నెల్లూరు జేడీ డాక్టర్ రమేష్‌నాయక్ సత్కరించి అభినందనలు తెలిపారు.



ఏపీఏహెచ్‌వోఎస్ఏ నూతన కమిటీ సభ్యులతో జేడీ రమేష్ నాయక్

భయపెడుతున్న

భౌ.. భౌ!



వామ్మో.. ఇదేంది ఇలా ఉంది!?



ఎన్ని శునకాలో!?

నగరవాసులను శునకాలు భయపెడుతున్నాయి. ఒంటరిగా వెళుతున్న వారిపై ముకుమ్మడిగా దాడికి తెగబడుతున్నాయి. బయటిప్రాంతాల నుంచి వస్తున్న కుక్కలు నగర శివార్లలోని కాలనీల్లో ఉండిపోతున్నాయి. అవే వస్తున్నాయా!? లేదా ఎవరైనా వదిలి వెళుతున్నారా!? అన్నది అంతుపట్టడం లేదు. కొత్త ప్రదేశంలో ఎటువెళ్లాలో తెలియక పాదచారులు, వాహనదారులను వెంటబడి కాటువేస్తున్నాయి. నగరపరిధిలో పట్టుకున్న కుక్కలను కార్పొరేషన్ సిబ్బంది పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కు.ని శస్త్రచికిత్స చేసి నగర వెలుపల వదిలేస్తు న్నారు. కానీ కుక్కల సంఖ్య మాత్రం తగ్గనం టున్నాయి. వీటి నియంత్రణ కోసం కార్పొరేషన్ బడ్జెట్‌లో రూ.లక్షలు వెచ్చి స్తున్నా ఫలితాలు ఉండటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పట్టుకున్న కుక్కలకు కు.ని శస్త్రచికిత్సలు చేయించి, నగరానికి దూరంగా వదిలిపెట్టాలని నగర వాసులు కోరుతున్నారు.





ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన ప్రజలు (ఫైల్)



ఇలాంటి దృశ్యాలు ఎన్నో..



- ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

కుష్ఠును ముందే గుర్తిస్తే నివారణ

● ప్రతినెల 11న పీహెచ్‌సీల్లో శిబిరాలు ● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత



అధికారుల సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తే అంగవైకల్యాన్ని అధిగమించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కుష్ఠు విభాగంలో మంగళవారం అధికారు లతో ఆమె సమీక్ష జరిపారు. అంగవైకల్యం ఉన్న కుష్ఠు వ్యాధి బాధితులకు ఆ వైకల్యాన్ని తగ్గించేందుకు తగిన చికిత్సలు అందించాలని సూచించారు. కొత్తగా గుర్తించిన కేసులకు సంబంధించి వ్యాధిగ్రస్తుల వల్ల కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కల వారికి వ్యాధి ప్రబలకుండా పెప్ చికిత్సలు చేయాలని ఆదేశించారు. జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రతి నెల 11వ తేదీన కుష్ఠువ్యాధి వల్ల అంగ వైకల్యం కలిగిన వ్యక్తులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. అవసరమైన వారికి ఎంసీఆర్ చెప్పులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యూక్లియస్ వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర బాబు, డాక్టర్ సునీత, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీపీఎంవోలు, డీఎఫ్ఐటీ ఏవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'కి 37 మంది విశ్వం విద్యార్థుల ఎంపిక



తిరుపతి(విద్య), మార్చి25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు 37మంది ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. విక్రమ్, గోపిక, జీవన్, సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్ యాదవ్, జాహ్నవి, జశ్వంత్, మిథున్, మిహాల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయ, సోహిత్‌తోపాటు మొత్తం 37మంది సీట్లు సాధించారన్నారు. 35 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షల్లో తమ విద్యార్థులు విజయపరంపరని కొనసాగిస్తున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందంటూ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ ఎస్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందనలు తెలిపారు.

ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలి

● అదనపు కమిషనర్ శ్రీధర్

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలని ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ శ్రీధర్ ప్రజలను కోరారు. నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో ఆదాయపన్నుపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ టాక్స్ పన్ను చెల్లింపు విధానాన్ని వివరించారు. సకాలంలో పన్ను చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలు, చెల్లించకపోతే ఆదాయపన్ను శాఖ తీసుకునే చర్యలను తెలియజేశారు. వివాద్ సే విశ్వాస్ పథకం గురించి ఆదాయపన్ను అధికారి సందీప్ కృష్ణ వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు, వైద్యులు అశోక్, అమర్‌నాథ్, రాహుల్ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్), (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో మేకల శ్రీనివాసులు అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ. 24 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... ఉమ్మడి జిల్లా కోట మండలం గోవిందరాజుపల్లికి చెందిన మేకల శ్రీనివాసులు 2023 ఏప్రిల్ 18వ తేదీ స్థానిక పరవగుంట సమీపంలో పదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కోట పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ చంద్రశేఖర్ వాదించారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మునిసిపాలిటీ, కార్పొరేషన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ మెరిట్ సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో, నోటీస్‌బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యంతరాలను ఈనెల 28 లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని, అభ్యంతరాన్ని స్పష్టంగా తెలియచేయాలని కోరారు. ఆధారాలు ఉంటే సంబంధిత అధికారి ధ్రువీకరణతో వాటిని సమర్పించాలన్నారు.